RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 18 జూలై 2025 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ. 2.00 | సంపుటి:21 | సంచిక:43

## సచివాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు







హైదరాబాద్, జూలై 17 : డా. బి. ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం, నల్ల పోచమ్మ దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ ఊరేగింపు, బోనాల సమర్పన తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సచివాలయం సమీపంలో ఉన్న నల్ల పోచమ్మ దేవాలయంలో పలువురు సచివాలయ అధికారులు, సచివాలయ సిబ్బంది పూజలు నిర్వహించారు. సచివాలయం ప్రాంగణం నార్త్ గేట్ నుండి ప్రారంభమైన ఉత్సవాల ఊరేగింపు బాహుబలి గేట్, సౌత్ గేట్ ద్వారా పోచమ్మ దేవాలయం వరకు కొనసాగింది. ఈ ఊరేగింపులో డప్పు విన్యాసాలు, పోతరాజుల ప్రదర్శనలతో పలు కళారూపాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలలో తెలంగాణ సెక్రటేరియట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు గిరి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, లావణ్య లత, జనరల్ సెక్రటరీ ప్రేమ్, అదనపు కార్యదర్శి రాము భూక్య, ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస రావు తదితరులు హాజరయ్యారు.

## మీకు దమ్ముంటే అసెంబ్లీ కి కేసీఆర్‌ను తీసుకురండి
## టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

వార్త 12 లో

## సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి....

### నూతన రైలు మార్గాలు మంజూరు చేయండి..
### కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి...
### కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



ఢిల్లీ: తెలంగాణలో సెమీకండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం, ప్రపంచ స్థాయి పరిశోధన, అభివృద్ధి కేంద్రాల తెలంగాణలో ఉన్నందున ప్రతిపాదిత అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ (%ూూాఞా%) ప్రాజెక్ట్, మైక్రో %ాజుణ% డిస్ప్లే ఫ్యాబ్ ప్రాజెక్ట్ క్రిస్టల్ మ్యాట్రిక్స్ కు ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రైల్ భవన్‌లో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు %జువీజ% 2.0 పథకం కింద తెలంగాణ వినతిని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. రీజినల్ రింగు రోడ్డు సమీపంలో నూతన ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

రీజినల్ రింగ్ రైలు.. డ్రైపోర్ట్-బందరు ఓడ రేవు అనుసంధాన మార్గాలు

తెలంగాణలో రైల్వే అనుసంధానత పెంపు కోసం నూతన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును ప్రతిపాదించామని... ఇందుకు రైల్వే బోర్డు ఇప్పటికే ఫైనల్ లొకేషన్ సర్వేకు అనుమతి ఇచ్చిందని సీఎం తెలిపారు. రూ. 8 వేల కోట్ల విలువైన ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్ కు త్వరగా అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. రీజినల్ రింగు రైలు ప్రాజెక్టుతో గ్రామీణ పేదరికం తగ్గడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ డ్రైపోర్ట్ నుంచి బందరు ఓడ రేవుకు అనుసంధానంగా రైలుమార్గం మంజూరు చేయాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఔషధాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తుల ఎగుమతులకు ఈ మార్గం దోహదపడుతుందని సీఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే ఆపరేషన్స్‌ను మరింత సమర్థంగా నిర్వహించేందుకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి సీఎం అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రయాణికులకు భద్రత, వేగవంతమైన సేవలు అందించేందుకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తెలంగాణలో వివిధ ప్రాంతాల అనుసం ధానత, పారిశ్రామిక, వ్యవసాయక ఎగ ుమతులు, దిగుమతుల కోసం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నూతన రైలు మార్గాలు మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా వికారాబాద్-కృష్ణా (122 కి.మీ.- అంచనా వ్యయం రూ. 2,677 కోట్లు, కల్వకుర్తి-మాచర్ల (100 కి.మీ. -అంచనా వ్యయం రూ. 2 వేల కోట్లు, డోర్నకల్-గద్వాల (296 కి.మీ. -అంచనా వ్యయం రూ. 6,512 కోట్లు), డోర్నకల్-మిర్యాలగూడ (97 కి.మీ.- అంచనా వ్యయం 2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. సమావేశంలో ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## 10 సంవత్సరాలు గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ లు ఇవ్వలేదు. ముఖ్యమంత్రి మాట ప్రకారం ఇందిర మా ఇల్లు ఇవ్వడం జరిగింది..

### మంత్రి వివేక్ వెంకటస్వామి





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజా పాలనలో ప్రజల సమస్యలకోసం కంకణ బద్ధులై పనిచేస్తున్నా.

ప్రజా పాలనలో

ప్రజల సమస్యలు కనుక్కోవాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖజానా చూస్తే అప్పులే ఉన్నాయి..

60 వేల అప్పులు రాష్ట్రాన్ని ఎనిమిది లక్షల కోట్లకు టిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకెళ్లింది

ఖజానా మొత్తం ఖాళీ అయింది

ప్రజలకు ఇచ్చిన ఆర్ గ్యారంటీలను నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేసింది

అందులో భాగంగా ఉచిత మహిళ బస్సు, గ్యాస్.. తదితర సంక్షేమ కార్యక్రమాలు ఇచ్చింది.

10 సంవత్సరాలు గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ లు ఇవ్వలేదు.

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెదక్ నియోజకవర్గంలో 9 వేల ఇవ్వడం జరిగింది..

ఖజానా ఖాళీ ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇండ్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు ప్రతిపక్షాలు.

ముఖ్యమంత్రి మాట ప్రకారం ఇందిర మా ఇల్లు ఇవ్వడం జరిగింది..

మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పావలా వడ్డీ, వడ్డీ లేని రుణాలు ఇచ్చే కార్యక్రమం పెట్టుకుంది

ఇది మహిళల మేలుకోసమే పెట్టారు.

వడ్డీ లేని రుణాలు మహిళలకే వెళ్లినప్పుడు కుటుంబం బాగుపడుతుంది తదనంతరం రాష్ట్రం బాగుపడుతుంది దేశం బాగుపడుతుంది.

మహిళలందరికీ మంచి అవకాశం మహిళలు ఉపయోగించుకోవాలి.

మహిళలకు మహిళ క్యాంటీన్లో ఎలక్ట్రిక్ బస్సులు పెట్రోల్ పంపులు ఇస్తున్నారు..

మహిళలు పట్టుదలతో పని చేస్తారు అనుకున్నది సాధిస్తారు బ్యాంకులు అందుకే ముందుకు రావడం జరిగింది..

ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మహిళలకు మేలు చేయాలని గరీబి హటావో స్కీం తీసుకొచ్చారు.

బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది..

కేంద్రం నుంచి మాట్లాడి తెలంగాణకు నిధులు తీసుకురావాలని మెదక్ ఎంపీ ని కోరారు..

మన రాష్ట్రం నుంచి టాక్స్ కేంద్రాన్ని కడుతున్నాం..

మెదక్ ఎంపీ రఘునందరావ్ మోడీకి సన్నిహితుడు కాబట్టి ఏది అడిగినా కాదనడు..

6 గ్యారంటీలు సరిగా అమలు చేస్తున్నారా లేదా అనేది రివ్యూ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు..



ప్రజాబలం

18 జూలై 2025 శుక్రవారం

## ప్రకంపనలు సృష్టిస్తున్న పదవీవిరమణ

బిజెపిలో 75 ఏళ్లకు అన్ని అధికార, పార్టీ పదవుల నుండి నిష్క్రమించాలనే నిర్దుష్టమైన నిబంధన ఏమీ లేనప్పటికీ ఈ అంశం ఇప్పుడు ఆ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ అధినేత డా. మోహన్ భగవత్ గత వారం మరో సందర్భంలో సీనియర్ సంఘ్ నేత మోరోపంత్ పింగ్లేపై రాసిన గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ ఆయన అన్నమాటలను ఉటంకించడంతో పరోక్షంగా బిజెపి నాయకులకు ఆయన సందేశం ఇచ్చారనే కథనాలు వ్యాపిస్తున్నాయి. ప్రస్తుత రాజకీయాలను, రాజకీయ నాయకులను దృష్టిలో ఉంచుకొని ఆ విధమైన మాటలు చెప్పలేదని అంటూ ఆ తర్వాత ఆర్ఎస్ఎస్ వివరణ ఇవ్వడం గమనిస్తే ఆయన ప్రకటన రాజకీయంగా ఎంతటి కలకలం రేపిందో వెల్లడి చేస్తున్నది. అయితే, ఆయన ప్రకటన కన్నా ముందే రోజే కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తన రాజకీయ రంగ నిష్క్రమణ గురించి ప్రస్తావించడం కూడా ఈ కలకలంకు ఆజ్యం పోసింది. ఇదంతా మరో రెండునెలల్లో ప్రధాని నరేంద్ర మోడీ 75 ఏళ్ళ వయస్సుకు రాజకీయ ప్రకంపనలకు దారితీస్తున్నది. దానితో తాను ఏర్పర్చిన ఈ నిబంధనను ప్రధాని తాను ఏమేరకు పాటిస్తారో అన్న ఆసక్తి అన్ని వర్గాలలో సహజంగానే నెలకొంటుంది. 2015లో ప్రధాని పదవి చేపట్టగానే (%ఖుంంబఎఱఅత్ర శీటటఱఎవ ూతీఱఎవ వీఱఅఱర్వతీ%) పార్టీ ప్రారంభంనుండి కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్న ఎల్‌కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి, శాంత కుమార్ వంటి వారికి కనీసం పార్టీ పార్లమెంటరీ బోర్డులో కూడా స్థానం లేకుండా చేయడంతో అనధికారికంగా అటువంటి నిబంధన పార్టీలో అమలు చేయడం ప్రారంభించారు. 'మార్గదర్శకులు' అంటూ వారికి ఓ హెూదాను కట్టబెట్టినప్పటికీ అటువంటి వారితో ఇప్పటి వరకు ఒక సమావేశం కూడా జరపకపోవడం గమనార్హం. అప్పటినుండి అనేకమంది నాయకులను గవర్నర్లు, మంత్రులు, పార్టీ పదవులనుండి ఈ నిబంధన పేరుతో తొలగిస్తూ వస్తున్నప్పటికీ రాజకీయ అవసరాలకోసం 80 ఏళ్ళు పైబడిన వారికి సైతం ఎన్నికలలో సీట్లు ఇవ్వడం, నామినేట్ పదవులు ఇవ్వడం చేస్తూనే ఉన్నారు. అయితే, ఇప్పుడు అమిత్ షా తన రాజకీయ నిష్క్రమణ గురించి ఎందుకు ప్రస్తావించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే ఆయన మరో 15 ఏళ్లకు గాని 75 ఏళ్ళ పరిధికి చేరుకోరు.

రాజకీయాల నుండి నిష్క్రమిస్తే తాను వేదాలు, ఉపనిషత్తులు చదువుకుంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ గడుపుతానని చెప్పడం ద్వారా చివరికంటా పదవులను పట్టుకొనే వేలాడననే సంకేతం ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఆయన వ్యవసాయం చేస్తారని ఎవ్వరూ విశ్వసించే పరిస్థితి లేదు. కేవలం ఓ రాజకీయ ఎత్తుగడగా ఈ ప్రకటన చేశారని స్పష్టం అవుతుంది. నేటి జాతీయ నాయకులలో వ్యక్తిగత విషయాలపై బహిరంగంగా ఎప్పుడూ మాట్లాడని నాయకుడు అమిత్ షా. కేవలం ఈ మధ్య ఒకసారి తన ఇద్దరు మనవరాళ్లతో కలిసి ఉన్న ఫోటోను పంచుకున్నారు. కుటుంబ విషయాలను మీడియావారు ప్రస్తావించినా నిర్మొహమాటంగా సమాధానం ఇచ్చేందుకు నిరాకరిస్తారు. అటువంటిది ఈ విషయం గురించి ప్రసావించడం సహజంగానే రాజకీయంగా ఆసక్తి కలిగిస్తుంది. ఆయన ఈ ప్రకటన మహిళా బృందాలతో మాట్లాడుతున్నప్పుడు చేశారు. సహకార మంత్రిగా వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నట్లు చెబుతూ వారికి నేరుగా వారి బ్యాంకు అకౌంటులలో చెల్లింపులు జరిగేటట్లు చూడటమే తన అభిలాష అని చెప్పారు. అయితే, ఈ లక్ష్యం నెరవేరేందుకు ఓ పదేళ్లు పట్టవచ్చని చెప్పడం ద్వారా మరో పదేళ్లు అధికారంలో కొనసాగుతానని సంకేతం ఇదే సమయంలో ఇచ్చారు. బిజెపి అధ్యక్ష ఎన్నిక విషయంలో ప్రతిష్టంభన నెలకొనడంతో ఆయన కొంత అసహనంగా ఉన్నారనే ప్రచారం జరుగుతుంది. గత 11 ఏళ్లుగా పార్టీ వ్యవహారాలు అన్ని ఆయన కనుసన్నలలో జరుగుతున్నాయి. తన తర్వాత ఐదున్నరేళ్లుగా జెపి నడ్డా అధ్యకునిగా ఉంటున్నప్పటికీ మొత్తం అధికారం అమిత్ షా చేతుల్లోనే కొనసాగుతున్నది. పార్టీకి సంబంధించిన అన్ని వ్యవహారాలు ఆయన అభీష్టం మేరకే జరుగుతున్నాయి. అందుకనే నడ్డా వారసునిగా సహజంగా తాను ఎంపిక చేసేవారే ఉండాలని కోరుకుంటారు. కానీ, గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఒక ఇంటర్వ్యూలో బిజెపి ఎంతో ఎదిగిందని, ఇంకా తమకు ఆర్ఎస్ఎస్ మద్దతు అవసరం లేదని, సొంతంగా తమ వ్యవహారాలు చక్కబెట్టుకోగలమని చెప్పడం ద్వారా నడ్డా పార్టీకి ఎంతో నష్టం కలిగించారు.

ఆయన మాటల ప్రభావమో, మరేమిటో గాని 400 సీట్లు గెలుస్తామని ప్రచారం చేసుకుంటే సొంతంగా మెజారిటీ కూడా లేకుండా 240 సీట్లకు పరిమితం కావాల్సి వచ్చింది. ఆ తర్వాత జరిగిన మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కేవలం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రతిష్ఠాకరంగా పనిచేయడంతోనే ఓటమి నుండి బిజెపి విజయంవైపు ప్రయాణం చేయగలిగింది. పైగా, ప్రధాని మోడీ ప్రచారంతో మాత్రమే ఓట్లు పొందే పరిస్థితులు కూడా కనిపించడం లేదు. అందుకనే ఆర్ఎస్ఎస్ సూచనలను కాదని పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకుంటే రాబోయే రోజులలో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందనే భయం పార్టీ వర్గాలలో ఉంది. ఆర్ఎస్ఎస్ సైతం పార్టీ అధ్యక్ష పదవికి ఓ నిర్దిష్టమైన పేరు సూచింపకుండా, ఓ బృందంగా పనిచేస్తూ, పార్టీని సంస్థాగతంగా పటిష్టపరిచే వారిని ఎనుకోవాలని మాత్రమే చెబుతున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంలో ఆర్ఎస్ఎస్ బిజెపి మధ్య ఏకాభిప్రాయం ఏర్పడటంలేదని చెబుతున్నారు. ఓ విధంగా మొత్తం పార్టీ వ్యవస్థను ఈ మధ్య కాలంలో తలాకుతలం కావించారు. విధానపరమైన విషయాలపై పార్టీలో చర్చలు జరగడంలేదు. ఎక్కువగా సోషల్ మీడియాపై, ప్రచార వ్యూహాలపై దృష్టి సారిస్తున్నారు. జెపి నడ్డా పదవీకాలం జనవరి, 2023లోనే అయిపోయింది. అప్పటినుండి ఏదో ఒక సాకుతో ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ మరో అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోతున్నారు. బిజెపి అధ్యక్షుడి పదవీకాలం మూడేళ్లు మాత్రమే. కానీ 2014 నుండి అమిత్ షా, ఆ తర్వాత జెపి నడ్డా మాత్రమే అధ్యక్షులుగా ఉన్నారు. పార్టీ నిబంధనల మేరకు ఈ పాటికి నాలుగో అధ్యక్షుడు ఉండాల్సి ఉంది. గతంలో బిజెపి నాయకత్వంలో ఎన్ని సమస్యలు ఉన్నప్పటికీ సంస్థాగత వ్యవహారాలు క్రమబద్ధంగా జరుగుతూ ఉండెడివి. ప్రతి ఏడాది రెండు సార్లు జాతీయ మండలి సమావేశాలు, మరో రెండు సార్లు జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుపుతూ ఉండేవారు. కానీ ఇప్పుడు చాలా అరుదుగా సమావేశాలు జరుపుతున్నారు. చివరకు 2024 పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఇప్పటి వరకు బిజెపి ఎంపిల సమావేశాలే జరపడం లేదు.

ప్రజాస్వామ్య సంప్రదాయం ప్రకారం కూటమి ప్రభుత్వం ఉంటే, కూటమిలో పెద్ద పార్టీ ఎంపిలు ముందుగా తమ నాయకుడిని ఎన్నుకొని, ఆ నాయకుడికి ఇతర మిత్రపక్షాల మద్దతు తీసుకొనేవారు. కానీ, ఆశ్చర్యకరంగా 2024 ఎన్నికల అనంతరం ఎన్‌డిఎ ఎంపిల సమావేశం జరిపే, అందులో నరేంద్ర మోడీని నాయకునిగా ఎన్నుకున్నారు. అంతకు ముందు పార్లమెంట్ సమావేశాల సమయంలో ప్రతి వారం బిజెపి ఎంపిలు సమావేశమై సమావేశాల తీరుతెన్నులు, వ్యూహాలపై చర్చించేవారు. కానీ ఇప్పుడు ఎన్‌డిఎ ఎంపిల సమావేశాలు జరుగుతున్నాయి గాని, విడిగా బిజెపి ఎంపిల సమావేశాలు జరపడం లేదు. పార్టీ ఎంపీల సమావేశాలు జరిగితే విధానపరమైన అంశాలపై నేతలను ప్రశ్నించేందుకు కనీసం 50 మంది ఎంపీలు సిద్ధంగా ఉన్నారని, అందుకనే దాటవేస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఏదిఏమైనా ప్రధాని మోడీ 75 ఏళ్ళు రాగానే రాజీనామా చేయాల్సిన అవసరం లేదని ఇప్పటికే అమిత్ షా, దేవేంద్ర ఫడ్నవీస్ వంటి నేతలు స్పష్టం చేశారు. 2024 ఎన్నికలలో ఆయనను ఐదేళ్లపాటు ఎన్నుకున్నారని, అందుకనే 2029 వరకు ఆయనే కొనసాగుతారని నిషికాంత్ దూబే వంటి వారు స్పష్టం చేస్తున్నారు. అయితే ఆర్ఎస్ఎస్‌లో కొంతకాలంగా ఈ నిబంధనను పాటిస్తూవస్తున్నారు. ఇప్పుడు మోడీ కూడా పాటించాలని కోరుకోవడం సహజమే కాగలదు. ఆ మేరకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అందుకనే ఈ అంశం ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యత సంతరింప చేసుకుంటుంది. ఒక వంక ప్రధాని మారి, పార్టీకి కొత్త అధ్యక్షుడు కూడా వస్తే మొత్తం పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. అందుకనే సహజంగానే ప్రస్తుతం కీలకంగా వ్యవహరిస్తున్నవారు అటువంటి మార్పును స్వాగతిపలేరు.

# భీమేశ్వర సదన్ లో లిఫ్ట్ నిర్మించారు, ప్రారంభం మర్చిపోయారు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం లో భక్తుల రద్దీ కనుగుణంగా వసతి గృహాలను నిర్మించి, రాజన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయవలసిన బాధ్యత రాజన్న ఆలయ అధికారులపై ఉంది. వేములవాడ పట్టణంలోని భీమేశ్వర్ ఆలయం ప్రక్కన కోట్ల రూపాయలు వెచ్చించి భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన భీమేశ్వర సదన్ వసతి గృహాలలో గతంలో లిఫ్ట్ లేకపోవడం వల్ల భక్తులు, మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురి అయినారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాజన్న ఆలయ అధికారులు భీమేశ్వర సదన్ ముందు భాగంలో ఒకటి, వెనుక భాగంలో మరొక లిఫ్టును భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి లిఫ్టులను ఏర్పాటు చేసిన తర్వాత వారం రోజులపాటు ఇట్టి లిఫ్టుల పనితీరును ఆలయ అధికారులు పరిశీలించారు. ఇట్టి లిఫ్టులు సక్రమంగా పనిచేస్తున్నాయి అనుకున్న తరుణంలో ప్రస్తుతం లిఫ్టులకు అడ్డుగా కుర్చీలను అడ్డంగా పెట్టి భక్తులు వినియోగించుకోకుండా పకడ్బందీ ఏర్పాట్ల చేసినారు. వివరాల్లోకి వెళితే లిఫ్ట్ ను నిర్మించిన గుత్తేదారుకు పూర్తిస్థాయిలో ఆలయ అధికారులు డబ్బులు చెల్లించలేదని, అందుకనే కాంట్రాక్టర్ లిఫ్టులు వినియోగం లేకుండా అడ్డుగా కుర్చీలు ఏర్పాటు చేసినారని భక్తులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు సదరు కాంట్రాక్టర్కు బిల్లులు చెల్లించి, భక్తుల సౌకర్యార్థం లిఫ్టులను వినియోగంలోకి తీసుకురావాలని రాజన్న భక్తులు కోరుచున్నారు.

# కోటి మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పం

## శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా జూలై 17:**రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకొని రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు.

బుధవారం శామీర్ పేట మండలంలోని అలియాబాద్‌లోని శుభం పంక్షన్ హాల్‌లో సెర్ప్, మెప్మా ఆద్వర్యంలో స్వయం సహాయక సంఘాలు సభ్యులతో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల లో చీఫ్ విఫ్ మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

బ్యాంక్ లింకేజీ కింద 619 స్వయం సహాయక సంఘాలకు రూ. 38 కోట్ల 86 లక్షలు, 5 మండలాలకు 3698 స్వయం సహాయక సంఘాలకు సభ్యులకు వడ్డీ రాయితీ కింద కోటి 79 లక్షలు, 5 మంది మహిళలకు లోన్ భీమా కింద 3 లక్షల 19 వేల విలువగల చెక్కుల మేడ్చల్ శాసభ్యులు సిహెచ్. మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి లతో కలిసి చీఫ్ విఫ్ మహేందర్ రెడ్డి స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా చీఫ్ విప్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీలో ఆడబిడ్డకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు మహిళా సంఘాలకు బస్సులిచ్చి కిరాయికి ఇచ్చే విధంగా అవకాశం కల్పించామని, 200 యూనిట్ కరెంట్ ఉచితంగా ఇస్తున్నాం. అలాగే జిల్లా కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంక్ లు నడిపించే బాధ్యత అప్పగించామని, అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో వాటిని నిర్వహించే బాధ్యత ఇచ్చాం. గృహజ్యోతి పథకం, ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి రూ. 5 లక్షల వరకు అందిస్తున్నామని తెలిపారు, మహిళలను కోటీశ్వరులుగా చేయటకు దృడ సంక్పంతో రాష్ట్ర ప్రభుత్వము అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. అలాగే స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు ఇచ్చి వారు వ్యాపార రంగంలో రాణించే విధంగా కృషి చేశామని ఆయన తెలిపారు. గతంలో మహిళలను లక్షాదికారులను చేయాలని లక్షం కాగా ప్రస్తుత ప్రభుత్వము కోటీశ్వరులను చేయాలని కృత నిశ్చయంతోపనిచేస్తుందని తెలిపారు. ఇందుకు అర్హులైన ప్రతి మహిళ స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరేందుకు ప్రస్తుతం ఉన్న సభ్యులు, సంఘాంలో చేరితే వచ్చే లాభాలగురించి క్షుణ్ణంగా వివరించి నూతన సభ్యులకు సభ్యత్యం కల్పించాలని సూచించారు. మహిళలు నిర్ధిష్టమైన లక్ష్యాలను ఎంచుకొని అందుకు తగిని విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకుని, లక్ష్యాలను సాధించేందుకు మరింత కష్టపడాలని ఆయన తెలిపారు. చిన్న వ్యాపారమే కదా అని అనుకోకుండా, నిరంతరం కృషి చేస్తే ముమ్ముందు ప్రగతి సాధించడం పెద్ద కష్టం కాబోదని, తద్వారా ఆర్థికంగా ఎదుగుటకు దోహదపడుతుంది ఆయన సూచించారు.

ఈ సందర్భంగా చామకూర మాల్లారెడ్డి మాట్లాడుతూ ,, దైర్యే సహాసే లక్ష్మి,, ప్రతి మహిళ ధైర్యంగా ముందుకు సాగాలని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 36 వేల స్వయం సహాయక సంఘాలలో సభ్యులు ఉన్నారని, అర్హులైన మహిళలందరిని స్వయం సహాయక సంఘాల గ్రూపులలో చేర్పింటకు కృషి చేయాలన్నారు. మహిళల స్వాలబన కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలు రుణాలు అందించి వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తుందని సూచించారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ కమీటీలు బాధ్యతకూడా మహిళలకు అప్పగించామని అన్నారు. పాఠశాలలో యూనిఫామ్స్ కుట్టుటకు వారికే అప్పగిస్తే నిర్ధేశించిన సమయంలోపు బట్టలను కుట్టి అప్పగించడం అభినందనియమని ఆయన అన్నారు. మహిళా సంఘాల ద్వారా ఐకేపి సంఘాల కు వడ్ల కొనుగోలులో ప్రాధాన్యత కల్పించామని తెలిపారు. సమాజంలో మహిళలు అభివృద్ధి చెందితే వారి కుటుంబంతో పాటు రాష్ట్రం , దేశం మొత్తం బాగుంటదని ఆయన వివరించారు. అత్యదికంగా మహిళలు పనిచేస్తున్న దేశాలు అభివృద్ధిలో కొనసాగుతున్నాయని కలెక్టర్ ఈ సందర్భంగా



ప్రపంచ దేశాలలో మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని ఆయన తెలిపారు.

ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ యం. మను చౌదరి మట్లాడుతూ మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువును అమ్ముకొనుటకు ప్రభుత్వ అవకాశాలు కల్పిస్తుందని, తద్వారా వచ్చే లాభాలను వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాని చెప్పారు. ఇంట్లో బాధ్యతలు నిర్వహణలో మహిళలే రోల్ మోడల్‌గా ఎదుగుతున్నారని, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొందిన సభ్యులకు వ్యాపారం చేసేందుకు కావల్సిన శిక్షణలు ఇస్తామని తెలిపారు. వారు ఎ రంగంలో కావాలంటే ఆ రంగంలోనే శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ మహిళ ఆర్థిక అవృద్ధికి పెద్ద పీఠ వేస్తుందని తెలిపారు. గుర్తుచేశారు. మహిళా సంఘాల ద్వారా లబ్దిపొందిన మహిళా సభ్యులు తమ తమ అనుభవాలను తెలియజేసారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారధులు ఇందిరా మహిళా శక్తి పై పాడిన పాటలు ఆహుతులను ఎంతగానో అలరించాయి.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా , వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింగ్ యాదవ్, గ్రంధాలయ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఇంచార్జీ డిఆర్‌డిఓ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతమ్మ, జిల్లా సమాఖ్య అధ్యక్షులు అజయల క్ష్మి, తహశీల్దార్, యంపిడిఓ, అలియాబాద్ మున్సిపల్ కమీషనర్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సెర్ప్, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 17:**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో పూర్తి చేయాల్సిన ఇళ్లపై జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జిహెచ్ఎంసి పరిధిలో మొత్తం 30068 ఇల్లు ఉండగా అందులో29094 ఇల్లు కేటాయించడం జరిగిందని మిగిలిన 974 ఇళ్ల కేటాయింపు ఈ వారంలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు జిల్లాలో జిహెచ్ఎంసి పరిధిలో వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న 6880 ఇళ్ల నిర్మాణాలను వచ్చే మూడు నెలల లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు ఈ సమీక్ష సమావేశంలో డబుల్ బెడ్ రూమ్,జిహెచ్ఎంసి ఈ ఈ లు జిల్లా పంచాయతీ ఆర్ అండ్ బి అధికారులు హౌసింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## ప్రణవ టవర్స్ లో ఉద్రిక్తత

హైదరాబాద్ ప్రణవ గ్రూప్స్ ల్యాండ్ షేర్ హోల్డర్స్ తమ ప్రాపర్టీ తీసుకుని కనీసం ప్రవణ టవర్స్ వద్దకు కూడా రానివ్వకుండా అడ్డుకోవడంతో ఆందోళనకరంగా మారింది. భారతదేశంలోనే గుర్తింపు పొందిన హైదరాబాద్ స్టాక్ ఎక్స్చేంజ్ లిమిటెడ్ సంస్థకు సోమాజిగూడలో ఐదు ఎకరాల స్థలం ఉన్నది. హెచ్ఎస్ఈఎల్లో 297 మంది షేర్ హోల్డర్స్ నుండి ప్రస్తుతానికి 100 మంది షేర్ హోల్డర్ మిగిలారు. కాలక్రమంలో హెచ్ఎస్ఈఎల్ ను మూసివేయడంతో సంబంధిత స్థలంలో భారీ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే ఫిబ్రవరి 15, 2017లో హెచ్ఎస్ఈఎల్ షేర్ హోల్డర్స్ నిర్మాణ సంస్థ బూర్గుబ్బ్రా డెవలపర్స్ తో నాలుగు టవర్స్ నిర్మించేందుకు ఫిఫ్టీ ఫిఫ్టీ షేర్ ఒప్పందంతో ఎంఓయూ కుదుర్చుకోవడం జరిగింది.నిర్మాణాలను 2020లోనే పూర్తి చేయాల్సి ఉండగా.. 2025 వరకు నిర్మాణాలు కొనసాగుతూ వచ్చాయి. మొత్తం 17,700 గజాల స్థలంలో నాలుగు టవర్స్ నిర్మించాల్సి ఉంది. ఇందులో ఏ, బీ, సీ బ్లాక్టులు రెసిడెన్షియల్, కమర్షియల్ బ్లాక్ లను మాత్రం 19 అంతస్తుల్లో నిర్మించారు. జూన్ 2024న డీ బ్లాక్కు అనుమతి పొందడం జరిగింది. ల్యాండ్ ఓనర్స్ కు ఇవ్వాల్సిన ఫిఫ్టీ పర్సెంట్ షేర్ ను వారికి ఇవ్వలేదు. దీంతో బాధితులు ప్రణవ టవర్స్ వద్దకు చేరుకున్నారు.


# వినడమే జీవన సాఫల్యం

ప్రపంచ శ్రవణ దినోత్సవం అనే విశిష్ట దినోత్సవం ప్రతి సంవత్సరం జూలై 18వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. మన చుట్టూ ఉన్న శబ్దాల ప్రపంచాన్ని, శ్రవణ అనుభూతిని, మరియు శబ్దాల ద్వారా మన సంస్కృతుల, పరిసరాల పట్ల మన బంధాన్ని గుర్తు చేసుకోవడానికి ఈ దినోత్సవం ఒక విలక్షణమైన వేదిక. శబ్దానికి సంబంధించిన చైతన్యాన్ని పెంపొందించడం, శ్రవణ సామర్థ్యానికి ప్రాధాన్యత నివ్వడం, శబ్ద కాలుష్యాన్ని అరికట్టే శబ్దాలను స్వాగతించడం, వాటిని శ్రద్ధగా విన గలగడం, వాటి వెనుకనున్న ప్రకృతి, భావం, జీవితాన్ని అర్థం చేసుకోవాలి అనే సంకల్పంతో జరుపుకునే ఈ దినోత్సవం వినికిడి అనే ప్రక్రియను వ్యక్తిత్వ వికాసానికి, పర్యావరణ పరిరక్షణకు, మానవ సంబంధాల మెరుగుదలకూ మార్గంగా చూపుతుంది. ఈ దినోత్సవాన్ని కెనడాకు చెందిన ప్రసిద్ధ స్వరకర్త, శబ్ద పర్యావరణ శాస్త్రవేత్త, రచయిత అయిన ఆర్. ముర్రే షేఫర్ జన్మదినాన్ని పురస్కరించుకొని జరుపుతారు. శబ్ద భౌగోళిక శాస్త్రానికి పితామహుడిగా గుర్తింపు పొందిన షేఫర్ స్థాపించిన వరల్డ్ సౌండ్‌స్కేప్ ప్రాజెక్ట్ ద్వారా శబ్దాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయాలనే ఆలోచనకు బలమైన పునాదులు ఏర్పడ్డాయి. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం వినే సామర్థ్యానికి ప్రాధాన్యత నివ్వడం, శ్రవణ నైపుణ్యాలను ప్రజల్లో అభివృద్ధి చేయడం, శబ్ద పర్యావరణంపై అవగాహన పెంపొందించడం. వినడం అనేది కేవలం చెవుల ద్వారా శబ్దాలను గ్రహించడమే కాదు, అది మనసుతో కూడిన అవగాహన ప్రక్రియ. శ్రద్ధగా వినడం ద్వారా ఇతరుల భావోద్వేగాలను అర్థం చేసుకోవచ్చు, గౌరవించవచ్చు. సంభాషణల్లో స్పష్టత, సంబంధాల్లో గాఢత, సమస్యల పరిష్కారంలో లోతైన అర్థం వినికిడి ద్వారానే సాధ్యమవుతుంది. వినడం ఒక జీవిత నైపుణ్యం, అది అభ్యాసంతో బలపడే సామర్థ్యం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు పదిహేను కోట్ల మందికి పైగా వ్యక్తులు శ్రవణ సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సమస్యలు శబ్ద కాలుష్యం వల్ల మరింత తీవ్రంగా మారుతున్నాయి. పరిశ్రమల శబ్దం, వాహనాల మోత, నగరాల్లో పెరిగిన శబ్ద స్థాయిలు, నిరంతరంగా వినిపించే హారన్లు వంటివి మానవ శ్రవణ సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. శబ్ద కాలుష్యం వల్ల నిద్రలేమి, మానసిక ఆందోళన, రక్తపోటు, హృదయ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు పెరుగుతున్నాయని అధ్యయనాలు స్పష్టంగా సూచిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన విధంగా రాత్రిపూట శబ్ద స్థాయి 40 డెసిబెల్స్ లోపు ఉండాలి. కానీ భారతదేశం లోని మెట్రో నగరాల్లో ఇది 65 నుండి 85 డెసిబెల్స్ వరకు నమోదవుతోంది. ఈ విషయం శ్రవణ పరిరక్షణకు ఎంత అప్రమత్తత అవసరమో తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రపంచ శ్రవణ దినోత్సవం యొక్క ప్రాముఖ్యత మరింత పెరిగింది. ఈ దినోత్సవం సందర్భంగా అనేక దేశాలలో శ్రవణ కళలను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. సౌండ్‌వాక్‌లు ద్వారా ప్రజలను తమ పరిసరాల శబ్దాల పట్ల శ్రద్ధగల వారుగా తయారు చేస్తారు. శ్రవణ కళా ప్రదర్శనలు, శాస్త్రీయ సెమినార్లు, వర్క్ షాపులు, సంగీత కచేరీలు వంటి కార్యాచరణలు వినే సంస్కృతిని అభివృద్ధి చేయడంలో తోడ్పడతాయి. ప్రతి సంవత్సరం ఈ దినోత్సవానికి ఒక ప్రత్యేకమైన థీమ్‌ను నిర్ణయిస్తారు. 2023లో "భవిష్య శ్రవణం" అనే అంశంతో, 2024లో "దూరపు వినికిడి" అనే అంశంతో నిర్వహించారు. ఈ థీముల ప్రకారం కళాకారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు కొత్త ఆవిష్కరణలతో ముందుకొస్తారు. శ్రవణాన్ని ఒక కళగా, విజ్ఞానంగా, జీవన విలువగా చూడటానికి ఇది ఒక గొప్ప వేదికగా నిలుస్తోంది. భారతదేశంలో కూడా శబ్ద కాలుష్య నియంత్రణకు చర్యలు చేపడుతున్నా, అవి పరిమిత స్థాయిలోనే ఉన్నాయి. కొన్ని నగరాల్లో నాయిస్ మ్యాపింగ్ ద్వారా శబ్ద స్థాయిని కొలుస్తున్నారు. మౌన ప్రదర్శనలు, శబ్ద వినికిడి ప్రయోగాలు, కళా కార్యక్రమాలు పలు విద్యా, పర్యావరణ సంస్థలు నిర్వహిస్తున్నాయి. అయినా, వినే సామర్థ్యాన్ని విలువైన శక్తిగా గుర్తించి శ్రద్ధా శ్రవణాన్ని జీవితంలో భాగం చేసుకోవాలనే చైతన్యం ఇంకా విస్తృత స్థాయిలో ఏర్పడాల్సి ఉంది. శ్రవణం ప్రకృతితో మన బంధాన్ని మరింత బలపరుస్తుంది. కోయిల కూత, వర్షపు చినుకుల రమణీయత, అడవి జంతువుల అరుపులు, సముద్ర తరంగాల గర్జనలు – ఇవన్నీ మన శ్రవణ అనుభవాన్ని భౌతికానికి అందని పరవశ స్థాయికి తీసుకెళ్తాయి. ప్రకృతి ధ్వనులను మనసు పోగా వినగల సామర్థ్యం మనల్ని మానవతా వాదులుగా మలచ గలదు. శ్రవణం ఒక ధ్యాన ప్రక్రియ. అది మౌనాన్ని అర్థం చేసుకునే మార్గం. ఈ శ్రవణం ద్వారా మనం ప్రపంచాన్ని మరింత లోతుగా, ప్రశాంతంగా, స్నేహతో చూడ గలుగుతాం. ప్రపంచ శ్రవణ దినోత్సవం వినే సామర్థ్యానికి అంకితమైన ఒక సాంస్కృతిక ఉద్యమంగా నిలుస్తోంది. ఇది కేవలం ఒక రోజు జరుపుకునే కార్యక్రమం మాత్రమే కాదు, శ్రవణాన్ని ఒక జీవన విలువగా అభివృద్ధి చేసుకునే అవకాశం. ఈ దినాన్ని పురస్కరించుకొని మనమందరం ఒక్కసారి చుట్టూ ఉన్న ప్రకృతిని గమనించుదాం, మౌనాన్ని అలవర్చుకుందాం, శ్రద్ధగా వినే మనస్తత్వాన్ని మన జీవితాలలో నాటుదాం. వినడం ద్వారా అర్థం, అనుభూతి, అవగాహన పెరుగుతుంది. శ్రవణం ద్వారా మనిషి మౌనాన్ని అర్థం చేసుకుంటాడు. ఆ మౌనం లోనే ఉన్నది ప్రకృతి, శాంతి, జ్ఞానం. అందుకే వినే సామర్థ్యం మనకు అనుగ్రహం మాత్రమే కాదు, బాధ్యత కూడా. శ్రవణం మనిషి సంస్కృతికి మూలపునాది. దానిని గౌరవించాల్సిన సమయం ఇది.

# సామాజిక మార్పుకు సాధనం సాహిత్యం

రెంటాల గోపాలకృష్ణ, (5 సెప్టెంబర్ 1920 –18 జూలై 1995) తెలుగు సాహిత్య భూమికపై తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయిత, పాత్రికేయుడు, సంపాదకుడు, విమర్శకుడు, అనువాదకుడు, నాటకకర్తగా ఆయన సాహిత్య సేవ విస్తృత పరిధిని కలిగి ఉంది. భావ ప్రకటనను సామాజిక బాధ్యతగా స్వీకరించి, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయితగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. గుంటూరు జిల్లా రెంటాల గ్రామంలో 1920లో జన్మించిన గోపాలకృష్ణ, బాల్యంలోనే పఠనంపై ఆసక్తి కలిగి చరిత్ర, ఆర్థికశాస్త్రాలలో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం తరువాత పాత్రికేయ వృత్తిలోకి అడుగుపెట్టి, 'ఆంధ్రప్రభ' పత్రికలో ఉపసంపాదకుడిగా తన జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. ఆపై 'ఈనాడు' పత్రికలో కీలక పదవులు నిర్వహించారు. వార్తలను సామాజిక రాజకీయ విశ్లేషణతో సమన్వయం చేస్తూ, నూతన దృక్పథాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఆయన రాసిన సంపాదకీయాలు పాఠకుల ఆలోచనా సరళిని ప్రభావితం చేశాయి. పత్రికా రచనను ప్రాణంలా భావించిన గోపాలకృష్ణ, మాతృభూమి, అభ్యుదయ, విజయప్రభ, ఆనందవాణి, ఆంధ్రజ్యోతి వారపత్రిక, స్వాతి మాసపత్రిక, బాలజ్యోతి పిల్లల పత్రిక వంటి అనేక ప్రముఖ ముద్రిత మాధ్యమాల్లో రచనలు కొనసాగించారు. వార్తల వెనుకనున్న సంక్లిష్టతను విశ్లేషించి ప్రజలకు చేరువ చేసే శైలితో ఆయన పాత్రికేయత విలక్షణంగా నిలిచింది. ఆయన కలం మానవీయ విలువలకు ప్రతిబింబంగా మారింది. సాహిత్య రంగంలో కూడా గోపాలకృష్ణ అభినవ దిశల్లో ప్రయాణించారు. ఇది నా కథ కాదు, కాలం కాకిలా ఎగిరింది, మనిషి స్వప్నం వంటి నవలల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నిరంకుశత, కుల వ్యవస్థలపై పోరాటం వంటి అంశాలను శక్తివంతంగా చిత్రించారు. ఆయన కథలు చిన్నవైనా భావ వ్యాప్తి లోతుగా, మానవ స్వభావం లోని అంతర్లీన సంఘర్షణలను ప్రతిఫలించే విధంగా ఉండేవి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ స్పష్టంగా ప్రతిఫలించేది. అనువాద రంగంలో గోపాలకృష్ణ చేసిన కృషి విశేషంగా నిలిచింది. ముఖ్యంగా మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు సంబంధించిన పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించి, అభ్యుదయ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. అనువాదాన్ని ఆయన భాషాంతరం కాదని భావాంతరంగా చూసారు. భావ గంభీరతను, భాషా సామర్థ్యాన్ని సమన్వయించుతూ చేసిన ఆయన అనువాదాలు తెలుగులో విశిష్టమైన స్థానం సంపాదించాయి. విమర్శా రచనలలో గోపాలకృష్ణ నిర్మాణాత్మక దృష్టితో, నిశితంగా, వాస్తవతను విశ్లేషించగల శైలితో నిలిచారు. వ్యక్తిగత అభిప్రాయాల కన్నా సామాజిక అవసరాలను ప్రతిబింబించగల రచనలవైపు దృష్టిపెట్టి, సమకాలీన సాహిత్యంపై గంభీరంగా స్పందించారు. ఆయన విమర్శలు సాహిత్యాన్ని తన సామాజిక బాధ్యత గుర్తు చేసుకునేలా చేసేవి. సంపాదకునిగా గోపాలకృష్ణ పాత్ర అసాధారణంగా నిలిచింది. అభ్యుదయ రచయితలకు ప్రోత్సాహం ఇచ్చి, వారి రచనలకు పత్రికల్లో చోటు కల్పించారు. నూతన రచయితలను తీర్చిదిద్దడంలో ఆయన నైపుణ్యం ప్రత్యేకమైనది. సంపాదకత్వాన్ని కేవలం పేజీల ఆవరణగా కాక, ప్రజా చైతన్య వేదికగా మలచిన వ్యక్తిగా ఆయన సాహిత్య చరిత్రలో గుర్తింపు పొందారు. సమకాలీన సమస్యలపై మౌలిక విమర్శను మేల్కొల్పే వ్యాసాల ద్వారా పాఠకులలో కొత్త దృక్పథాన్ని పెంపొందించారు. రచయితగా గోపాలకృష్ణను ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో ముఖ్యమైనవి – పదజాలంలో స్పష్టత, భావ ప్రకటనలో లోతు, విమర్శలో నిజాయితీ, సంపాదకత్వంలో తాత్త్విక నిబద్ధత. రచనను వృత్తిగా కాక, బాధ్యతగా పరిగణించి, జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన అరుదైన ఉదాహరణగా ఆయన నిలిచారు. రెంటాల గోపాలకృష్ణ రచనలు నేటికీ సమకాలీనతను కలిగి ఉన్నాయి. సామాజిక సమస్యలను కేంద్రంగా ఉంచుకుని, మార్పుకు మార్గనిర్దేశం చేసే శక్తిని వాటిలో నిక్షిప్తం చేశారు. ఆయన జీవితమే ఒక ఉద్యమం, రచనలే ఒక సందేశం. భావసాంద్రతతో కూడిన ఆయన రచనలు పాఠకులను కలచి వేస్తాయేమో కానీ, తేలికగా వదిలిపెట్టవు. ఆయన కలం ప్రశ్నించేది – సమాజాన్ని, చట్టాలను, మనవాణ్ని. ఆయన రచనలను చదవడం ద్వారా మనం మనల్ని మళ్ళీ ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. రెంటాల గోపాలకృష్ణ ఒక రచయిత మాత్రమే కాదు – ఒక అభ్యుదయ దృక్కోణం. సాహిత్యాన్ని మార్పు కోసం, మానవీయత కోసం, సమాజపు అణగారిన గొంతుకలకు మద్దతుగా వినిపించిన ఆత్మగాథగా ఆయన రచనలు నిలిచి పోయాయి. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక శాశ్వత శిఖరం. ఆయన రచనలను మనం గౌరవించాలి కాదు – అనుసరించాలి. ఎందుకంటే ఆయన కలం భావాలకు మార్గాన్ని చూపినది, సమాజానికి దిక్సూచి అయినది.

# విలక్షణ నటుడు ఎస్వీ రంగారావు




తెలుగు సినీ చరిత్రలో ఒక ప్రత్యేక విలక్షణ నటులు ఎస్వీ రంగారావు. రంగారావు తన నటనలో ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్వికా భినయాలు కలబోసిన నటుడు. సహజ నటుడిగా పేరు గాంచారు. పౌరాణిక, సాంఘిక, చారిత్రిక, ఐతిహాసిక పాత్రలు ఏవైనా వాటిల్లో పరకాయ ప్రవేశం చేసి, అందరి మన్ననలు పొందిన మహానటులు యస్వీఆర్. నవరసాలను అలవోకగా అవలీలగా పాత్రల ద్వారా ఒలికించిగల అతికొద్ది మంది నటుల్లో ఎస్వీఆర్ ది అగ్రస్థానం. ఎస్వీ రంగారావు కృష్ణా జిల్లా లోని నూజివీడులో, 1918 జూలై 3 వ తేదీన జన్మించారు. మద్రాసు హిందూ హైస్కూలులో తన పదిహేనవ ఏట మొదటి సారిగా నాటకంలో నటించారు. తన నటనకు అందరి నుంచి ప్రశంసలు రావడంతో ఆయనలో నటుడు కావాలన్న కోరికకు బీజం పడింది. తర్వాత పాఠశాలలో ఏ నాటకం వేసినా ఏదో ఒక పాత్రలో నటించేవారు. వక్తృత్వ పోటీల్లో పాల్గొనేవారు. క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ క్రీడల్లోనూ ప్రవేశం ఉండేది. 1936 లో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఉత్సవాలలో రంగారావు బళ్ళారి రాఘవ, గోవిందరాజు సుబ్బారావు లాంటి ప్రఖ్యాత నటులను చూసి తాను కూడా ఎలాగైనా నటుడు అవ్వాలనుకున్నారు. మద్రాసులో ఎక్కడ తెలుగు నాటకాలు జరుగుతున్నా హాజరయ్యేవారు. అన్ని భాషల సినిమాలు శ్రద్ధగా చూసేవారు. వాటిని విశ్లేషించేవారు. ఇంటర్ పరీక్షకు 45 మంది హాజరయితే అందులో రంగారావు ఒక్కడే ఉత్తీర్ణుడు కావడం విశేషం. రంగారావు కు మాత్రం నటుడు కావాలనే కోరిక బలంగా ఉండేది. బాగా చదువుకుంటూనే నటనను కూడా వదిలి పెట్టలేదు. కాకినాడ లోని యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ లో చేరి ఎన్నో నాటకాల్లో పాల్గొన్నారు. ఆయనకు ఇక్కడ అంజలీదేవి, ఆదినారాయణ రావు, బి.ఎ.సుబ్బారావు, రేలంగి వంటి వారితో పరిచయం ఏర్పడింది. నాటకాల్లో రంగారావు అనేక వైవిధ్యమైన పాత్రలు పోషించారు. పీష్వా నారాయణరావు వధ నాటకంలో రంగారావు ఇరవై రెండేళ్ళ వయసులో అరవై ఏళ్ళ వృద్ధుని పాత్ర ధరించి మెప్పించారు. ఖిల్జీ రాజ్యపతనం నాటకంలో మాలిక్ కపూర్ పాత్రలో, స్ట్రీట్ సింగర్ నాటకంలో విలన్ పాత్ర మొదలైన పాత్రలు పోషించారు. రంగారావు కు ఇంగ్లీషు మీద కూడా పట్టు ఉండటంతో షేక్స్‌పియర్ నాటకాల్లోని సీజర్, ఆంటోనీ, షైలాక్ లాంటి పాత్రలు పోషించేవారు. నాటకాలు వేస్తూనే బి. ఎస్. సి పూర్తి చేశారు. మొదట బందరు లో తర్వాత విజయ నగరంలో ఫైర్ ఆఫీసరు గా పనిచేశారు. ఈ ఉద్యోగంలో రంగారావుకు పెద్దగా పని ఉండేది కాదు. కానీ ఉద్యోగ స్వభావ రీత్యా ఖాళీ సమయాల్లో నటించడానికి వీలులేదు. తాను కళకు దూరం అవుతున్నేనేమో నని భావించిన రంగారావు ఆ ఉద్యోగం నుంచి బయటకు వచ్చేశారు. ఆయన నటించిన మొట్టమొదటి చిత్రం 1946లో వచ్చిన వరూధిని అనే చిత్రం. తొలి సినిమాలో పాత్ర పోషించినందుకు గాను రూ.750 పారితోషికంగా అందుకున్నారు. ఎల్. వి. ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన మనదేశం, పి. పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన తిరుగుబాటు చిత్రంలో కూడా అంతగా ప్రాధాన్యం లేని పాత్రలే వచ్చాయి. అయినా రంగారావు నిరుత్సాహ పడకుండా మంచి అవకాశం కోసం ఎదురుచూడ సాగారు. నాగిరెడ్డి, చక్రపాణి కలిసి విజయా ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ తొలిసారిగా నిర్మించిన షావుకారు సినిమాలో సున్నపు రంగడు అనే కీలకమైన పాత్రను రంగారావు కిచ్చారు. ఈ సంస్థలో ప్రవేశించడం రంగారావు కెరీర్ కు గట్టి పునాది పడింది. తర్వాత అదే సంస్థ నిర్మించిన పాతాళ భైరవి (1951) సినిమాలో అతి ముఖ్యమైన మాంత్రికుడి పాత్రను రంగారావు కిచ్చారు. పరభాషా సినిమాలు కూడా ఎన్నో పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టాయి. హిందీ భాషలో ప్రవేశమున్న రంగారావు తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకున్నారు. భానుమతి దర్శక నిర్మాత వచ్చిన నాది ఆడజన్మే ఆధారంగా హిందీలో తీసిన మై భీ లడ్కీ హూ లాంటి హిందీ చిత్రాల్లో నటించారు. భూకైలాస్, మాయాబజార్ లాంటి కన్నడ చిత్రాలలోనూ, విదయాగలే ఎతిలే ఎతిలే, కవిత వంటి మలయాళ చిత్రాలలో కూడా నటించారు. నటసామ్రాట్, విశ్వనట చక్రవర్తి మొదలగు బిరుదులతో తెలుగు ప్రేక్షకులు ఆయన్ను గౌరవించారు. ఎస్వీయార్ నటించిన నర్తనశాల ఇండొనేషియా లోని జకార్తాలో ఆఫ్రో–ఆసియా అంతర్జాతీయ చిత్రోత్సవము?లో ప్రదర్శించ బడడమే కాకుండా కీచకపాత్రకు గాను ఎస్వీయార్ అప్పటి ఎన్నో చిత్రాల కథా నాయకులను వెనుకకు నెట్టి భారతదేశం నుంచి తొలి అంతర్జాతీయ ఉత్తమ నటుడుగా బహుమతి పొందారు. కొన్ని చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. ముఖ్యంగా ఆయన దర్శకత్వం వహించిన చదరంగం చిత్రానికి రెండో ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం లభించింది. రెండో చిత్రం బాంధవ్యాలు ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం అందుకున్నది. మొదటి సినిమా వైఫల్యం తర్వాత రంగారావు జంషెడ్పూర్ లో టాటా కంపెనీలో ఉద్యోగం లో చేరారు. ఇదే సమయంలో ఆయన మేనమామ బడేటి వెంకట రామయ్య, కోటేశ్వరమ్మ దంపతుల కుమార్తె లీలావతిని 1947 డిసెంబరు 27న వివాహం చేసుకున్నారు. వ్యక్తిగా రంగారావు చమత్కారి, సహృదయుడు. సినిమా సెట్స్ మీద గంభీరంగా ఉండేవారు. వ్యక్తిగత విషయాలు సహనటులతో చర్చించడానికి ఇష్టపడేవారు కాదు. ఆయన ఇష్టదైవం శివుడు. ప్రతిరోజూ శివపూజ చేసిన తర్వాత దినచర్య ప్రారంభించేవారు. యస్వీఆర్ ఒక వేదాంతి. ఆయన ఇంటి లైబ్రరీలో వివేకానందునికి సంబంధించిన పుస్తకాలు ఎన్నో ఉండేవి. తానే స్వయంగా కొన్ని రచనలు కూడా చేశారు. ప్రజాహిత సంస్థలకు లెక్కలేనన్ని విరాళాలు ఇచ్చారు. చైనాతో యుద్ధం వచ్చినపుడు ఏర్పాటు చేసిన సభలో పదివేల రూపాయలు విరాళం ఇచ్చారు. తర్వాత పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చినపుడు కూడా ఎన్నో సభలు నిర్వహించి, మిగతా నటులతో కలసి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి, విరాళాలు సేకరించి, ఆ డబ్బును రక్షణ నిధికి ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో ఏలూరు, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, పాలకొల్లు, సామర్లకోట, పెనుగొండ, అనకాపల్లి లాంటి ఊర్లలో ఆయనకు సన్మానాలు జరిగాయి. జకార్తాలో పురస్కారం అందుకుని మద్రాసు వచ్చాక మద్రాసు సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ , ఆంధ్రా ఫిల్మ్ జర్నలిస్టు సంఘం , దక్షిణ భారత ఫిల్మ్ వాణిజ్య మండలి, మద్రాసు సినిమా ప్రేక్షక సంఘాలు ఘనంగా సన్మానించారు. అన్నై, శారద, నానుం ఒరుపెణ్, కర్పగం, నర్తనశాల సినిమాలకు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా పారితోషికం స్వీకరించారు. విశ్వనటచక్రవర్తి, నటసార్వభౌమ, నటసింహ, నటశేఖర తదితర బిరుదులు పొందారు. రంగారావు దర్శకత్వం వహించిన మొదటి చిత్రం చదరంగం ద్వితీయ ఉత్తమ చిత్రంగా నంది అవార్డును, రెండవ చిత్రం బాంధవ్యాలు తొలి ఉత్తమ చిత్రంగా నంది అవార్డును గెలుచుకున్నాయి. నర్తనశాల చిత్రంలో నటనకు ఇండోనేషియా ఫిలిం ఫెస్టివల్లో ఉత్తమ నటుడి అవార్డు, అదే పాత్రకు రాష్ట్రపతి అవార్డు అందుకున్నాడు. 2013 లో భారత సినీ పరిశ్రమ వందేళ్ళ సందర్భంగా విడుదలయిన తపాలాబిళ్ళలలో ఒకటి ఎస్వీ రంగారావు మీద విడుదలయింది. రంగారావుకు తొలినాళ్ళలో మంచి పేరు తెచ్చిన షావుకారు చిత్రంలోని సున్నం రంగడి పాత్ర కోసం తన స్వగ్రామంలో కోడి రంగడు అనే రౌడీని మనసులో పెట్టుకుని అతని మాట తీరుని, ప్రవర్తనా విధానాన్ని అనుకరించారు. సంతానం చిత్రంలో ఆయన పోషించిన గుడ్డివాని పాత్ర కోసం కొన్నాళ్ళు పాటు అంధుల ప్రవర్తనను గమనించారు. మాంత్రికుడి పాత్ర కూడా తాను ఆంగ్ల నాటకాల్లో ధరించిన షైలాక్ పాత్రలను ఆధారంగా చేసుకుని మరింత రౌద్రరసాన్ని కలిపి తనదైన శైలిలో నటించారు. రంగారావు యముడి పాత్ర పోషించిన సతీ సావిత్రి సినిమా మద్రాసులో జెమినీ స్టూడియోలో చిత్రీకరణ జరుగుతుండగా మద్రాసు పర్యటనకు వచ్చిన చైనా ప్రధాని చౌ ఎన్ లై ఈయన నటనను అభినందించారు. జులై 3, 2018న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఏలూరులో పన్నెండున్నర అడుగుల ఎత్తైన రంగారావు కంచు విగ్రహాన్ని ఆవిష్కరించారు. 1974 జూలై 18వ తేదీన మద్రాసులో కన్ను మూశారు.

# వ్యవసాయానికి 'ఇథనాల్' ముప్పు

రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల్ జిల్లా రాజోలి మండలం, పెద్ద ధన్వాడ వద్ద నిర్మించతలపెట్టిన ఇథనాల్ (ఇథైల్ ఆల్కహాల్) తయారీ పరిశ్రమతో పర్యావరణ, అనారోగ్య సమస్యలొస్తాయని స్థానిక రైతులు ఉద్యమిస్తున్న విషయం తెలిసిందే. తుంగభద్ర నది ఒడ్డున ముప్ఫయి ఎకరాల్లో రూ.190 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమ, చుట్టుపక్కల పన్నెండు గ్రామాల నివాసితుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున. ఇది ఒక జీవ ఇంధనం అయినప్పటికీ దాన్ని తయారు చేసే విధానం నీటి కాలుష్యానికి, వాయు, నేల, ఇతరత్రా అనేక కాలుష్యాలకు దారితీస్తుంది. ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ (ఇబిపి) కార్యక్రమంలో పెట్రోల్‌కు కొద్ది పరిమాణంలో దీన్ని కలుపుతారు. ఉదారణకు తొంభై శాతం పెట్రోల్‌లో పదిశాతం ఇథనాల్ కలిపితే దానిని ఇ10 పెట్రోల్ అని, 80శాతం పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపితే దాన్ని ఇ20 పెట్రోల్ అని పిలుస్తారు. ప్రత్యామ్నాయ, పర్యావరణ అనుకూల ఇంధనాల వాడకాన్ని ప్రోత్సాహానికంటూ ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం జనవరి, 2003లో ప్రారంభించింది. రవాణారంగంలో మొత్తం చమురు అవసరాల్లో 85 శాతం భారత దేశం దిగుమతి చేసుకుంటున్నది. 98 శాతం శిలాజ ఇంధనాలు వాడుతుండగా కేవలం రెండుశాతం మాత్రమే జీవ ఇంధనాలు వాడబడుతున్నాయి. మనదేశంలో ఇథనాల్ ఉత్పత్తికి ప్రధానంగా చెరకు ప్రాసెసింగ్ ఉప ఉత్పత్తి అయిన మొలాసిస్‌పై ఆధార పడింది. చెరుకు సాగు అధిక మొత్తంలో నీటిని వినియోగించుకోవడం వలన భూగర్భ జలాలు కూడా క్షీణిస్తాయి. అయితే ఈ ఏకైక మార్గం పెట్రోల్‌కు 20శాతం ఇథనాల్(ఇ20 పెట్రోల్) కలిపే లక్ష్యాన్ని సాధించడానికి సరిపోదని నిరూపించబడింది. (వినియోగదారుల వ్యవహారాలు, ఆహార,ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ, 2023). తత్ఫలితంగా, మొక్కజొన్న, దెబ్బతిన్న ఆహార ధాన్యాలు(డిఎఫ్‌జి), భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ)ద్వారా లభించే బియ్యం వంటి ప్రత్యామ్నాయ వనరుల ద్వారా అవసరమైన ఇథనాల్ ఉత్పత్తిని సాధించాలని కేంద్రం నిర్ణయించింది. అందుకు ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ కార్యక్రమానికి అవసరమైన ఇథనాల్ తయారీ కోసం కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ మొక్కజొన్న,ధాన్యం, చెరకు ఆధారిత అనేక ఇథనాల్ ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చింది. తెలంగాణ, ఏపీలోని ప్రతిపాదిత ఇథనాల్ తయారీ పరిశ్రమల్లో ఎక్కువ భాగం ధాన్యం ఆధారితమైనవి. ఈ పరిశ్రమలు అసిటాల్డిహైడ్, ఫార్మాల్డిహైడ్, అక్రోలిన్, హెక్సేన్ వంటి ప్రమాద కరమైన వాయు కాలుష్య కారకాలను (హెచ్‌ఎపి/టి) విడుదల చేస్తాయి. నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయి. ఇవి శ్వాసకోశ వ్యాధులు నుండి క్యాన్సర్ వరకు అనేక అనారొగ్య సమస్యలను కలిగి స్తాయని పరిశోధనలో గుర్తించారు. గాలిలోకి ఈ కాలుష్య కారకాలు విడుదల కావటం వలన చుట్టపక్కల గ్రామాల్లోకి ఈవిషవాయువులు ప్రవేశించటమే కాక గ్రామాల్లో వాసనను కలుగచేస్తాయి.అంతర్జాతీయ వర్గీకరణల ప్రకారం, ఎసిటాల్డిహైడ్‌ను, ఫార్మాల్డి హైడ్‌ను, అక్రోలిన్ లను మానవులకు క్యాన్సర్ కారకాలుగా వర్గీకరించారు. హెక్సేన్ వంటి కాలుష్య కారకాలకు గురికావడం వల్ల తిమ్మిరి, జలదరింపు, బలహీనత వంటి తీవ్రమైననాడీ సంబంధిత ప్రభావాలకు గురవుతారు. దేశంలో పర్యావరణ క్లియరెన్స్ నివేదికల నుండి ఈ కాలుష్య కారకాలను తొలగిం చడం వల్ల ఇథనాల్ ప్లాంట్ల సమీపంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్రమైన అనారోగ్యం బారిన పడతారు. అలాగే ఇథనాల్ ఉత్పత్తికి మొక్కజొన్న, బియ్యం,చెరకు వంటి ఆహార పంటలను ఉపయోగించడం ఆహార భద్రతపై కూడా ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఆహార ధాన్యాలను ఉపయోగించే ఇథనాల్ పరిశ్రమల వలన గణనీయమైన కాలుష్యం విడుదలయ్యే అవకాశం ఉంది. అందుకే వీటిని రెడ్ కేటగిరీ పరిశ్రమలుగా గుర్తించారు. అంటే ఇవి అరవై, అంతకంటే ఎక్కువ కాలుష్య సూచిక స్కోరు కలిగిన పారిశ్రామిక రంగాలు. ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి ఆహార ధాన్యాలకు డిమాండ్ పెరగడం వల్ల వ్యవసాయ పద్ధతులు మారిపోయి పంటపొలాలు నిస్సారవంతంగా మారిపోతాయి. ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి అవసరమైన ఒకే పంటను తరచూ పండించటం వలన నేలలో సేంద్రీయ పదార్థాల పరిమాణం, కార్బన్ నిల్వచేసే సామర్థ్యం తగ్గి పోతుంది. ఇథనాల్ ఉత్పత్తి కోసం పంట అవశేషాలను (గడ్డి వంటివి) తొలగించడం వలన నేల కోతకు గురవుతుంది. ఇథనాల్ పరిశ్రమల నుండి వెలువడే కలుషిత నీరు, భూగర్భ జలాలను, చెరువులు వంటి ఉపరితల నీటి వ్యవస్థలను కాలుష్య జలముగా మార్చివేయటం వలన గ్రామాల్లో నీటి కొరత ఏర్పడుతుంది. ఈ నీటిని తాగిన జంతువులు చనిపోతాయి. నారాయణపేట జిల్లాలోని, చిత్తనూర్ గ్రామంలో ఇథనాల్ పరిశ్రమ ద్వారా విడుదలయ్యే వ్యర్థ జలాల్లో ఆమ్లాలు, భారీ లోహాలు కలిగిఉండి చుట్టుపక్కల గ్రామాలకు సరఫరా చేసే ప్రధాన నీటి వనరుల్లో చేరాయి.దీంతో గ్రామస్తులకు చర్మవ్యాధులు సంభవించాయి. అందుకే గద్వాల రైతులు ఈ పరిశ్రమను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ముప్పు తెచ్చే పరిశ్రమలను అనుమతించకూడదు.

# బొత్స కుటుంబంలో చీలక...

విజయనగరం, జూలై 17, బొత్స కుటుంబంలో చీలిక వచ్చిందా? ఆధిపత్య పోరు ప్రారంభం అయ్యిందా? వచ్చే ఎన్నికల్లో తలో దారిన వెళ్ళనున్నారా? విజయనగరం పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఆ కుటుంబానికి చెందిన ఓ నేత రాజకీయ చిరకాల ప్రత్యర్థిని ప్రశంసించడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల గోవా గవర్నర్గా సీనియర్ నేత పూసపాటి అశోక్ గజపతిరాజు నియమితులైన సంగతి తెలిసిందే. ఆయన నియామకంతో టిడిపి కూటమి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. సీనియారిటీతోపాటు సిన్సియారిటీకి సరైన గౌరవం దక్కిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అశోక్ గజపతిరాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అనూహ్యంగా తన చిరకాల ప్రత్యర్థి అయిన బొత్స కుటుంబం నుంచి ఓ మాజీ ఎమ్మెల్యే అశోక్ గజపతి రాజుకు అభినందనలు తెలపడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుందివిజయనగరం జిల్లాలో) బొత్స కుటుంబానిది ఒక హవా. కాంగ్రెస్ హయాంలో పెనుమత్స సాంబశివరాజు ఒక వెలుగు వెలిగారు. ఆయన శిష్యరికంలో పనిచేశారు బొత్స. కానీ తనకున్న సామాజిక, కుటుంబ బలంతో ఒక రాష్ట్రస్థాయి నేతగా ఎదిగారు. ఉత్తరాంధ్రలో తనకంటూ ఒక మార్క్ చూపించారు. విజయనగరం జిల్లాలో అశోక్ గజపతిరాజుకు ధీటుగా రాజకీయాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు మొన్నటి వైసిపి ప్రభుత్వం లో ఒక వెలుగు వెలిగారు. తాను చీపురుపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ మంత్రి పదవి చేపట్టేవారు. సోదరుడు అప్పల నరసయ్య గజపతినగరం నియోజకవర్గంలో నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. మరో సమీప బంధువు బడ్డు కొండ అప్పలనాయుడు నెల్లిమర్ల శాసనసభ్యుడిగా ఉండేవారు. స్వయానా మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు జిల్లా పరిషత్ చైర్మన్గా ఇప్పటికీ కొనసాగుతున్నారు. అయితే మొన్నటి ఎన్నికల్లో బొత్స తో పాటు ఆయన కుటుంబ సభ్యులంతా ఓడిపోయారు. ప్రస్తుతం బొత్స విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్నారు. పైగా శాసనమండలిలో విపక్ష నేతగా కొనసాగుతున్నారు.విజయనగరం జిల్లాలో పూసపాటి అశోక్ గజపతి రాజుతో బొత్స కుటుంబానికి దశాబ్దాలుగా వైరం నడుస్తోంది. అయితే ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు అశోక్ గజపతిరాజు. ఈ క్రమంలో అశోక్ ను గోవా గవర్నర్ గా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పుడు అశోక్ గజపతి రాజును నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆకాశానికి ఎత్తేశారు. రాజకీయాలకే వన్నెతెచ్చిన నాయకుడు అశోక్ గజపతి రాజు అని కొనియాడారు. అటువంటి నేత జిల్లా వాసి కావడం గర్వకారణంగా చెప్పుకొచ్చారు. అయితే బొత్స కుటుంబ వ్యక్తి ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థిని ప్రశంసించడం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. గత కొద్దిరోజులుగా బడ్డు కొండ అప్పలనాయుడుకు బొత్స కుటుంబంతో విభేదాలు ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే అప్పలనాయుడు అశోక్ గజపతి రాజును ప్రశంసించడం చర్చకు దారితీస్తోంది. రకరకాల రచ్చకు కారణం అవుతోంది.నెల్లిమర్ల ఇన్చార్జిగా బడ్డుకొండ అప్పలనాయుడు ను తప్పిస్తారని ప్రచారం నడుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయన టిడిపిలో చేరుతారని కూడా టాక్ నడిచింది. నెల్లిమర్ల నియోజకవర్గంలో బొత్స సోదరుడు వేలు పెట్టడం వెనుక పెద్ద స్కెచ్ ఉందన్నది అప్పలనాయుడు లో ఉన్న అనుమానం. అయితే అప్పలనాయుడు జిల్లా పరిషత్ చైర్మన్, బొత్స మేనల్లుడు అయిన మజ్జి శ్రీనివాసరావుకు స్వయాన బావ. అయితే ఇటీవల కుటుంబంలో తలెత్తిన విభేదాలతో బడ్డుకొండ తీవ్ర మనస్తాపంతో ఉన్నట్లు ప్రచారం జరిగింది. అందుకే బొత్స ప్రత్యర్థిని ఆకాశానికి ఎత్తినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# అమరావతికి మైక్రోసాఫ్ట్...

విజయవాడ, జూలై 17, ఏపీకి గుడ్ న్యూస్. మరో దిగ్గజ పరిశ్రమ ఏపీకి రానుంది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ మైక్రోసాఫ్ట్ అమరావతి క్వాంటం వ్యాలీకి వస్తోంది. ఈ మేరకు ఆ సంస్థ పసరత్తు ప్రారంభించింది. క్వాంటం కంప్యూటర్ తీసుకురానుంది. ఇందుకు సంబంధించి అధికారులతో చర్చలు కూడా జరిగాయి. త్వరలో ఏపీ ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్ మధ్య ఎంవోయూ కుదరనుంది. ఇప్పటికే ఐబీఎం 156 క్యూబిట్ల సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఐబీఎం బాటలోనే మైక్రోసాఫ్ట్ నడవనుంది. ఐబీఎం సంస్థ క్వాంటం కంప్యూటర్ కు భిన్నంగా మైక్రోసాఫ్ట్ మరో క్వాంటం కంప్యూటర్ ఉండనుంది.సాంకేతికంగా అత్యున్నతంగా క్వాంటం కంప్యూటర్లుసేవలందించునున్నాయి. వీటిలో సూపర్ కండక్టింగ్, ట్రాప్డ అయాన్, ఫోటానిక్, టోపో లాజికల్, న్యూట్రల్ ఆటమ్ లు ఉన్నాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీలో మైక్రోసాఫ్ట్ కొత్త భవనం కట్టనుంది. ఇది నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. అయితే ఈ భవనం మైక్రోసాఫ్ట్ కడుతుందా? ప్రభుత్వం కట్టి ఇస్తుందా అన్నది తెలియడం లేదు. ఎంవోయూ సమయంలో దీనిపై స్పష్టత రానుంది.వాస్తవానికి అమెరికాలోని మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయంలో 50 క్యూ బిట్స్ సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ను ఏర్పాటు చేసింది. అయితే క్వాంటం టెక్నాలజీ పై ఏపీ ప్రభుత్వం మొగ్గు చూపుతున్న నేపథ్యంలో అమరావతిలో పరిశోధనా కేంద్రం కోసం ఎంచుకుంది. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ హైదరాబాదులో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసుకున్న సంగతి తెలిసిందే. అమరావతి క్వాంటం వ్యాలీలో 90 లక్షల చదరపు అడుగుల సదుపాయాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 40 చదరపు అడుగులు ఐబీఎం కోసం, ఐటీ హార్డ్వేర్ తయారీ కంపెనీల కోసం ఒక భవనాన్ని నిర్మించాలని నిర్ణయించింది. అయితే ఇప్పుడు మైక్రోసాఫ్ట్ వస్తుండడంతో ప్రపంచ దిగ్గజ సంస్థల చూపు అమరావతి పై పడే అవకాశం ఉంది.ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ అమెజాన్, అయాన్ క్యు వంటి సంస్థలు క్వాంటం కంప్యూటింగ్ రంగంలో అనేక సాంకేతికలపై పరిశోధనలు చేస్తున్నాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీకి సంబంధించి అనుకూల వాతావరణం ఏర్పాటు చేయాలన్నది చంద్రబాబు టార్గెట్. తద్వారా ప్రపంచంలో క్వాంటం ద్వారా రాణించాలనుకుంటున్న దిగ్గజ సంస్థలను తన వైపు తిప్పుకోవాలన్నదే చంద్రబాబు లక్ష్యం. మైక్రోసాఫ్ట్ లాంటి దిగ్గజ సంస్థ అమరావతికి వస్తే మాత్రం.. ఒక విధంగా చెప్పాలంటే అనుకూల వాతావరణం ఏర్పాటు అవుతుంది. స్వల్ప కాలంలోనే అమరావతి క్వాంటం వ్యాలీ అంతర్జాతీయ స్థాయికి ఎక్కడం ఖాయం.

# సింగరాయకొండలో కనిపించని పెద్ద భవనాలు

ఒంగోలు, జూలై 17, భారీగా సంపాదించినా..కోట్ల ఆస్తులున్నా..ఎంత గొప్పోళ్లైనా..ఎవ్వరైనా భగవంతుడి ముందు తగ్గాల్సిందే. భక్తులకు ఈ విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు..కానీ ఏకంగా ఓ ఊరు ఊరంతా తగ్గుతూనే వస్తున్నారు. తరతరాలుగా ఇదే సంప్రదాయం పాటిస్తున్నారు. దేవుడిపై ఉన్న భయమో-భక్తో కానీ పూర్వకాలం నుంచి పెద్దలు అనుసరిస్తున్న కట్టుబాటుని దాటే సహసం ఎవరూ చేయడం లేదు.

ఊరి పేరు పాత సింగరాయకొండ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వే స్టేషన్ కి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఊర్లో నివాసం ఉండేవారంతా బాగా స్థిరపడినవారే..అంటే ఆర్థికంగా ఓ అడుగుపైన ఉన్నవారే. కానీ ఈ ఉర్లో ఎక్కడా బహుళ అంతస్తుల భవనాలు కనిపించవు. అంతెందుకు..కనీసం ఇంటికి సెకెండ్ ఫ్లోర్ వేయరు. ఎన్ని కోట్లు మూలుగుతున్నా, ఎంత సంపాదించినా తరతరాలుగా ఇదే కట్టుబాటును అనుసరిస్తున్నారు. పాత సింగరాయకొండలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. ఈ స్వామివారంటే స్థానికులకు ఎంతో భక్తి. ఎంత అంటే..ఈ ఊర్లో ఉండే ఒక్క నివాసం కూడా స్వామివారి ఆలయాన్ని మించిన ఎత్తులో ఉండకూడదు. తరతరాలుగా ఇదే నియమం పాటిస్తున్నారు. ఒకప్పుడు పూరిపాకలు ఉండేవి, ఆ తర్వాత అవి పెంకుటిల్లుగా మారాయి..ఆ తర్వాత డాబాలొచ్చాయి..అంతే..అక్కడితోనే ఆగిపోయారు. మరో ఫ్లోర్ అదనంగా వేసే సాహసం మాత్రం చేయలేదు. స్వామివారి ఆలయం కన్నా ఏ ఇల్లు కూడా ఎత్తుగా కనిపించకూడదు అనే నియమానికి కట్టుబడి ఉండిపోయారు. ఒకప్పుడు అక్కడో గ్రామం ఉందని దూరంనుంచి వచ్చేవారికి తెలిపే సిగ్నల్ ఆలయం. ఆలయం ధ్వజస్తంభం, గోపురం చూసి ఇక్కడో గుడి ఉందంటే నివాసాలున్నాయని అర్థం చేసుకునేవారు బాటసారులు. పైగా ఎక్కడైనా ఆలయం ఉందంటే..ఆ చుట్టుపక్కల నివాసయోగ్యమైన స్థలంగా భావించేవారు. పండుగలు, వేడుకలు, ఒక్కోసారి పంచాయితీలు కూడా ఆలయం వేదికగానే నడిచేవి. ఇప్పటికీ పాతసింగరాయకొండలో ఇదే పద్ధతి నడుస్తోంది. ఇల్లు ఉన్నవాళ్లు మరో ఇల్లు కట్టుకుంటారు కానీ మరో ఫ్లోర్ మాత్రం వేయరు.తాతముత్తాతల నుంచి ఇదే సంప్రదాయం అనుసరిస్తున్నారు. అందుకే వాళ్లని ఫాలో అయిపోతున్నాం అంటారు స్థానికులు ఇక్కడ మొత్తం 1500 పైగా నివాసాలున్నాయి. రోడ్ దాటిన తర్వాత మరికొన్ని నివాసాలున్నాయి. వాస్తవానికి ఇది సింగరాయకొండ...కానీ ఊరి పరిధి పెరిగిన తర్వాత కొత్త సింగరాయకొండ అనడం మొదలుపెట్టారు. దీంతో ఈ ప్రదేశం పాతసింగరాయకొండగా స్థిరపడింది. ఇళ్ల సంఖ్య పెరుగుతోంది కానీ పైన మరో ఫ్లోర్ మాత్రం వేయరు అని పంచాయతీ ఆఫీసులో పనిచేసే సోము చెప్పారు.

డబ్బుల్లేకకాదు.. కానీ స్వామిని మించి ఉండకూడదు అనే నియమం.ఎవరైనా ఆలయ నిర్మాణాన్ని దాటి కడితే ఆ భవనం కూలిపోతుందని అక్కడే పుట్టి అక్కడే పెరిగిన ఓ పెద్దావిడ చెప్పారు . వాస్తవానికి మూడు అంతస్తులు నిర్మించినా కొండంత ఎత్తురాదు కానీ పూర్వకాలం నుంచి ఉండిపోయిన నమ్మకం అది. భక్తో, భయమో కానీ ఈ ఊర్లో ఈ సెంటిమెంట్ బలపడిపోయిందంటారు అక్కడున్న పురోహితులు. దక్షిణ సింహాచలంగా పిలిచే ఆ ఆలయాన్ని పల్లవులు కట్టించారు...విజయనగరం చక్రర్తులు అభివృద్ధి చేశారని అక్కడున్న శాసనాల్లో ఉంది. భక్తులకు ఈ విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు..కానీ ఏకంగా ఓ ఊరు ఊరంతా తగ్గుతూనే వస్తున్నారు. తరతరాలుగా ఇదే సంప్రదాయం పాటిస్తున్నారు. దేవుడిపై ఉన్న భయమో-భక్తో కానీ పూర్వకాలం నుంచి పెద్దలు అనుసరిస్తున్న కట్టుబాటుని దాటే సహసం ఎవరూ చేయడం లేదు. ఊరి పేరు పాత సింగరాయకొండ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వే స్టేషన్ కి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఊర్లో నివాసం ఉండేవారంతా బాగా స్థిరపడినవారే..అంటే ఆర్థికంగా ఓ అడుగుపైన ఉన్నవారే. కానీ ఈ ఉర్లో ఎక్కడా బహుళ అంతస్తుల భవనాలు కనిపించవు. అంతెందుకు..కనీసం ఇంటికి సెకెండ్ ఫ్లోర్ వేయరు. ఎన్ని కోట్లు మూలుగుతున్నా, ఎంత సంపాదించినా తరతరాలుగా ఇదే కట్టుబాటును అనుసరిస్తున్నారు. ఒకప్పుడు అక్కడో గ్రామం ఉందని దూరంనుంచి వచ్చేవారికి తెలిపే సిగ్నల్ ఆలయం. ఆలయం ధ్వజస్తంభం, గోపురం చూసి ఇక్కడో గుడి ఉందంటే నివాసాలున్నాయని అర్థం చేసుకునేవారు బాటసారులు. పైగా ఎక్కడైనా ఆలయం ఉందంటే..ఆ చుట్టుపక్కల నివాసయోగ్యమైన స్థలంగా భావించేవారు. పండుగలు, వేడుకలు, ఒక్కోసారి పంచాయితీలు కూడా ఆలయం వేదికగానే నడిచేవి. ఇప్పటికీ పాతసింగరాయకొండలో ఇదే పద్ధతి నడుస్తోంది. ఇల్లు ఉన్నవాళ్లు మరో ఇల్లు కట్టుకుంటారు కానీ మరో ఫ్లోర్ మాత్రం వేయరు.తాతముత్తాతల నుంచి ఇదే సంప్రదాయం అనుసరిస్తున్నారు. అందుకే వాళ్లని ఫాలో అయిపోతున్నాం అంటారు స్థానికులు పల్లవుల కాలం నుంచి ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయాన్ని విజయనగర రాజులు కూడా సందర్శించారు..దానాలు చేశారని ఇక్కడ శాసనాల్లో ఉంది. ఇక్కడ మొత్తం 1500 పైగా నివాసాలున్నాయి.

రోడ్ దాటిన తర్వాత మరికొన్ని నివాసాలున్నాయి. వాస్తవానికి ఇది సింగరాయకొండ...కానీ ఊరి పరిధి పెరిగిన తర్వాత కొత్త సింగరాయకొండ అనడం మొదలుపెట్టారు. దీంతో ఈ ప్రదేశం పాతసింగరాయకొండగా స్థిరపడింది. సంఖ్య పెరుగుతోంది కానీ పైన మరో ఫ్లోర్ మాత్రం వేయరు అని పంచాయతీ ఆఫీసులో పనిచేసే సోము చెప్పారు. మొత్తానికి భక్తో-భయమో పాత సింగరాయకొండవాసులు అనుసరిస్తున్న ఈ నియమం ఇప్పటికి అయితే కొనసాగుతోంది..మరి భవిష్యత్ తరాలు కూడా అనుసరిస్తారా?...

# జగన్ ఆ ప్రస్తావన తేకపోవడానికి కారణం ఏమై ఉంటుంది చెప్మా?

విజయవాడ, జూలై 17, వైసీపీ అధినేత వైఎస్ జగన్ దాదాపు రెండు గంటల పాటు మీడియా సమావేశం పెట్టారు. అందులో అన్ని అంశాలను ప్రస్తావించారు. అన్నివర్గాల ప్రజలకు తాము అండగా ఉంటున్నామని చెప్పారు. కానీ ఒక్క విషయంలో మాత్రం ఆయన స్పందించలేదు. అదే ఇప్పుడు రాజకీయంగానూ, రాజధాని అమరావతిలోనూ హాట్ టాపిక్ గా మారింది. జగన్ మైండ్ సెట్ మారినట్లుందని సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. అనేక అంశాలను ప్రస్తావించిన జగన్ రాజధాని రైతుల విషయాన్ని మాత్రం పూర్తిగా పక్కన పెట్టేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మరో ఇరవై వేల ఎకరాల ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సమీకరణకు నిర్ణయించిన నేపథ్యంలో జగన్ ఆ ప్రస్తావన లేకుండా సమావేశాన్ని ముగించారు. మిర్చి, పొగాకు, మామిడి రైతుల సమస్యలను ప్రస్తావించారు. కరేడు లో భూ సేకరణపై కూడా జగన్ మండిపడ్డారు. మూడు పంటలు పండే భూమిని ఎలా సేకరిస్తున్నారని ప్రశ్నించారు. కరేడు రైతులు తనను కలిశారని, వారికి అండగా వైసీపీ నిలబడుతుందని మీడియా సమావేశంలో చెప్పారు. కానీ రాజధాని రైతులు రెండో విడత భూ సమీకరణకు అంగీకరించకపోయినా వారి గురించి మాట్లాడకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాజధాని రైతుల పై ఆగ్రహంతోనే జగన్ వారికి మద్దతుగా మాట్లాడలేదా? లేక జగన్ తన మైండ్ సెట్ ను మార్చుకున్నారా? అన్న చర్చ జరుగుతుంది. అనేక సమస్యలపై పోరాటానికి సిద్ధమని ప్రకటించిన జగన్ రాజధాని భూముల ప్రస్తావన మాత్రం తేలేదు. గతంలో అసెంబ్లీ సమావేశంలోనే రాజధాని నిర్మాణానికి ముప్ఫయి వేల ఎకరాల భూములు అవసరమా? అని ప్రశ్నించిన జగన్ ఇప్పుడు మరో ఇరవై వేల ఎకరాలు సమీకరించడానికి ప్రభుత్వం సిద్ధమయినా ఎందుకు ప్రశ్నించలేదన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తానే అంతకు ముందు అవసరమైతే మరిన్ని భూములు సేకరించాలని తాను అన్నమాటలు జగన్ కు గుర్తుకు వచ్చి ఉండవచ్చని కొందరు నెట్టింట నిలదీస్తున్నారు. అయితే ప్రభుత్వం రెండో విడత ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సమీకరణ విషయంలో కొంత వెనక్కు తగ్గినట్లు ప్రచారం జరుగుతున్నా అది తాత్కాలికమేనని, ఖచ్చితంగా భూ సమీకరణ మరో ముప్ఫయి వేల ఎకరాలను సేకరిస్తామని అధికారులు చెబుతున్నారు. . గత ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ మూడు రాజధానుల అంశంతో జనం ముందుకు వెళ్లి బోల్తాపడ్డారు. మూడు రాజధానుల ప్రతిపాదనను మూడు ప్రాంతాల్లో జనం అంగీకరించలేదని 2024 ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయి. దీంతో గత కొన్నాళ్ల నుంచి మూడు రాజధానుల అంశం జగన్ నోటి వెంట నుంచి రావడం లేదు. పైగా ఇటీవల ఆయన గుంటూరు – విజయవాడను కలుపుతూ రాజధాని నిర్మాణం చేపడితే బాగుండేదని కూడా అభిప్రాయపడ్డారంటే ఆ ప్రతిపాదనను విరమించుకున్నట్లే కనపడుతుందంటున్నారు. అందుకే జగన్ రాజధాని అమరావతి విషయంలో జరిగే విషయాలను కొంతకాలం పరిశీలించిన తర్వాత మాత్రమే రెస్పాండ్ కావాలని భావిస్తున్నట్లుంది. అందుకే రెండు గంటల పాటు జరిగిన మీడియా సమావేశంలో రాజధాని అమరావతి పేరు కూడా తేకుండా జగన్ జాగ్రత్త పడ్డారంటున్నారు.

## వడ్డీతో చెల్లిస్తాం

చంద్రబాబు నాయుడుకు, అధికారులకు వైసీపీ అధినేత వార్నింగ్ ఇచ్చారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని, వస్తే వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. జగన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం బెదిరింపులకు ఎవరూ భయపడే వారు లేరన్నారు. కేసులకు భయపడి ప్రశ్నించడం మానుకుంటామంటే అది మీ అవివేకమే అవుతుందని అన్నారు ఎన్ని కేసులు పెడితే అంత ఖచ్చితంగా ఇంకా పెద్ద గొంతుకతో ప్రశ్నిస్తూనే ఉంటామని జగన్ అన్నారు. ఇప్పుడు వేధించిన అధికారులను ప్రతి ఒక్కరినీ గుర్తుపెట్టుకుంటామని, వారు ఎక్కడ ఉన్నా పట్టి తీసుకు వచ్చి చట్టప్రకారం శిక్షించడం ఖాయమని జగన్ అన్నారు. ఈసారివచ్చేది తమ ప్రభుత్వమేనన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకుని, న్యాయపరంగా వ్యవహరించాలని జగన్ అన్నారు. దెబ్బతిన్న వాళ్లు రేపు తన మాట వినరని, అప్పుడు పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలని, అది మీ ఊహకే వదిలేస్తున్నానని అన్నారు

# ఇంకా ఉందంటున్న నారాయణ

గుంటూరు, జూలై 17, అమరావతి రెండో దశ భూసమీకరణపై మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రెండో దశలో సుమారుగా 34 వేల ఎకరాల భూమిని సమీకరించాలని ప్రభుత్వం భావించింది. 13 గ్రామాల పరిధిలో ఈ భూములను సమీకరించాలని ప్రతిపాదించారు. ఇందుకోసం పలు గ్రామాలలో గ్రామసభలు కూడా నిర్వహించారు. అయితే అమరావతి రెండో దశ భూసమీకరణ ఆగిందంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వార్తలపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ క్లారిటీ ఇచ్చారు.రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని ఏపీ ప్రభుత్వం చెప్తోంది. మూడేళ్లలోగా అమరావతిలో తొలి దశ నిర్మాణాలను పూర్తి చేయాలనే పట్టుదలతో ఉంది. ఇక అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో.. అమరావతిలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్ సిటీ, అమరావతి క్రికెట్ స్టేడియం వంటి నిర్మాణాలను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. రాజధాని అమరావతి కోసం తొలి దశలో 33 వేల ఎకరాలు సమీకరించగా.. రాజధాని భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రెండో విడతలో మరో 34 వేల ఎకరాలు సమీకరించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. అయితే రెండో విడత భూసమీకరణకు రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని.. అమరావతి రెండో దశ భూసమీకరణ ఆగిపోయిందంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి.ఈ పరిణామాల నేపథ్యంలో అమరావతి రెండో దశ భూసమీకరణపై మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ క్లారిటీ ఇచ్చారు. అమరావతి కోసం రెండవ విడత భూసమీకరణ ఎక్కడా ఆగలేదని మంత్రి నారాయణ క్లారిటీ ఇచ్చారు. రెండో దశ భూసమీకరణ కోసం సీఎం నారా చంద్రబాబు నాయుడు మంత్రుల కమిటీని ఏర్పాటుచేశారని.. ఈ మంత్రుల కమిటీ ఈ విషయంపై చర్చిస్తుందని వెల్లడించారు. 2014-19 మధ్య చేపట్టిన భూసేకరణలో కొన్ని సమస్యలు ఉన్నాయని.. వాటిని పరిష్కరించాలని మంత్రుల కమిటీని చంద్రబాబు ఆదేశించినట్లు నారాయణ వివరించారు. వచ్చే రెండు, మూడురోజుల్లో మంత్రుల కమిటీ చర్చించి వచ్చే ఏపీ కేబినెట్ భేటీ నాటికి నివేదిక అందిస్తుందని వివరించారు

# చంద్రబాబు సొంత ఇలాకాలోనే ఇబ్బందులా

అమరావతి, జూలై 17, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఇప్పుడు అమరావతి రైతుల్లోనే అసంతృప్తి పెరుగుతుంది. ఇచ్చిన భూములను డెవలెప్ చేయకుండా ఇంకా భూములు కావాలంటూ సమీకరణకు సిద్ధమవుతుండటాన్ని తప్పుపడుతున్నారు. నిజానికి చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అమరావతి రైతులు ధర్నాకు దిగాలని నిర్ణయించినా, అది నారా లోకేశ్ జోక్యంతో విరమించుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. అంటే రైతులు మరో విడత భూ సమీకరణకు వ్యతిరేకంగా ఉన్నారని స్పష్టంగా అర్థమవుతుంది. ముందు తీసుకున్న భూములను అభివృద్ధి చేసిన తర్వాత మిగిలిన భూములను అవసరమైతే సేకరించడంలో తప్పులేదని, అదే సమయంలో ఒక్కటీ పూర్తి చేయకుండా, రైతులకు మేలుచేయకుండా మరోసారి భూ సమీకరణ చేయడాన్ని అమరావతి రైతులే ప్రశ్నిస్తున్నారంటే చంద్రబాబుకు ఊహించని షాక్ అని చెప్పక తప్పదు. ఇందుకు ఉదాహరణలతో చంద్రబాబు నిర్ణయాన్ని తప్పుపడుతూ సెటైర్లుపడుతున్నాయి. ఒక మెకానిక్ వద్దకు మోటారుబైక్ ను తీసుకెళి రిపేర్ చేయమంటే... దానిని బాగు చేసేలోపు మరొక బైక్ రాగానే దానికి మరమ్మతులుచేయడానికి వెళ్లినట్లుగా ఉందని సెటైర్లు వేస్తున్నారు. అంటే ముందు ఇచ్చిన బైక్ రిపేర్ కాదు. తర్వాత ఇచ్చిన బైకుకు కూడా మోక్షం కలగదు అంటూ ఎద్దేవా చేస్తున్నారు. చంద్రబాబు మరో విడత భూ సమీకరణ కూడా ఇలాగే ఉందని అంటున్నారు. అమరావతి భూ సమీకరణకు సీఆర్డీఏ సమావేశంలో అమోదించారు. దాదాపు రెండో విడత ఇరవై వేల ఎకరాలను సేకరించాలని నిర్ణయించారు. ఇందుకు అధికారులతో పాటు ఎమ్మెల్యేలు కూడా రంగంలోకి దిగి రైతులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తీరుపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది.. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి పరిశ్రమల ఏర్పాటు కోసం రెండోదశ భూసమీకరణ చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం కొంతకాలం వెయిట్ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. దాదాపు 20, 496 ఎకరాలు సమీకరణ కింద తీసుకోవాలని ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సిఆర్డిఏ అథారిటీ సమావేశంలో నిర్ణయించారు. దానిపై క్యాబినెట్లోనూ చర్చ జరిగింది. ఆమోదించిన సమయంలో ఎప్పుడు నోటిఫికేషన్ ఇవ్వాలనే అంశం నిర్ణయించలేదు. దీంతో పూలింగ్ ప్రక్రియను ప్రారంభించలేదు. ఇప్పటికే. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అందరి కంటే ముందుగా అమరావతి మండల పరిధిలోని గ్రామాల్లో సమీకరణ ప్రక్రియపై రైతులతో సమావేశాలు నిర్వహించారు. అప్పట్లో రైతుల్లో పెద్దగా అవగాహన లేకపోవడంతో ఎమ్మెల్యే చెప్పారనే పేరుతో తలూపినా, ఈలోపు వారందరూ గత పూలింగు ఏరియాలో ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేసిన తర్వాత భూములు ఇవ్వకూడదనే నిర్ణయానికి వచ్చారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో నోటిఫికేషన్ ను నిలిపేశారు. గతంలో సమీకరణకు ఇచ్చిన ప్రాంతంలో ప్లాట్లనే అభివృద్ధి చేయలేదనే అంశంపై రాజధాని రైతులు అసంతృప్తిగా ఉన్నారు. తమకు డెవలెప్ చేసిన ప్లాట్లు ఇస్తే వాటిని విక్రయించి తమ పిల్లల పెళ్లిళు జరపుకుంటామని, పదేళ్లవుతున్నా ఇంకా అక్కడ ఎలాంటి అభివృద్ధి లేదని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కానీ రైతులకు త్వరలోనే అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా వారికి నమ్మకం కలగడం లేదు. ప్రతి పనికీ డెడ్ లైన్ పెట్టే చంద్రబాబు నాయుడు తమకు ఇచ్చే ప్లాట్ల విషయంలో మాత్రం డెడ్ లైన్ ఎందుకు పెట్టడం లేదని రైతులు నిలదీసేపరిస్థితికి వచ్చింది. రైతులకు ఇవ్వాల్సిన కౌలును చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నామని గ్రామాల్లో ప్రచారం చేశారు. మొత్తం మీద రెండో దశ భూసమీకరణ నిలిపేశారని అధికారులే ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. త్వరలోనే పూలింగ్ కు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల తర్వాతనే ప్రక్రియ మొదలవుతుందని చెబుతున్నారు. మరి రాజధాని రైతులు ఏ మేరకుసహకరిస్తారన్నది చూడాల్సి ?ంది

# వివాదాలకు కేరాఫ్ గాకొలికపూడి

విజయవాడ, జూలై 17,తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఏ ముహూర్తాన ఎమ్మెల్యే అయ్యారో కానీ అప్పటి నుంచి అక్కడ వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో ఎన్నడూ ఆ పరిస్థితి లేదు. గతంలో టీడీపీ గెలిచినప్పుడు ఇన్ని వివాదాలు చుట్టుముట్ట లేదు. కానీ 2024 ఎన్నికల్లో తిరువూరు నుంచి కొలికపూడి శ్రీనివాసరావు గెలిచిన నాటి నుంచి ఆ నియోజకవర్గం వివాదాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. పార్టీ నాయకత్వానికి కూడా తిరువూరు తలనొప్పిగా తయారయింది. ఎన్ని మార్లు పంచాయతీలు జరిగినా అక్కడ ఫుల్ స్టాప్ పడటం లేదు. చంద్రబాబు నాయుడు పిలిచి వార్నింగ్ ఇచ్చినా పరిస్థితుల్లో మార్పులేదు. అక్కడ కూటమి పార్టీలకు పడటం లేదు. సొంత పార్టీలో శత్రువులు ఒకవైపు, మిత్రపక్షమైన జనసేనలోనూ వ్యతిరేకించే నేతలు తయారవ్వడంతో తిరువూరును ఇక ఆపరేట్ చేయడం ఎవరి వల్లా కాదు. తెలుగుదేశం పార్టీకి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఇబ్బందికరంగా మారారు. సొంత పార్టీ నేతకు చెందని రమేష్ రెడ్డితో కొలికపూడి శ్రీనివాసరావు కు మధ్య విభేదాలు తలెత్తాయి. రమేష్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, అందుకు డెడ్ లైన్ కూడా పెట్టారు. కానీ పార్టీ నాయకత్వం మాత్రం అక్కడ పరిస్థితిని తెలుసుకుని ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పార్టీ క్రమశిక్షణ సంఘం ఎదుటకు కొలికపూడిని పిలిపించి మందలించారు. అంతే కాదు కొలికపూడికి తాము సహకరించబోమంటూ టీడీపీ తిరువూరు నేతలే తెగేసి చెప్పడంతో అక్కడ పరిస్థితులు ఎలా సద్దుమణిగించాలో తెలియని పరిస్థితుల్లో అధినాయకత్వం దిద్దుబాటు చర్యలు తీసుకుంది. ఇటీవల కొంత వరకూ ఆ పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. కొలికపూడి శ్రీనివాసరావుకు జాగ్రత్తగా వ్యవహరించాలని, అందరినీ కలుపుకుని పోవాలని కూడా చెప్పి పంపింది. . కొలికపూడి శ్రీనివాసరావు రాజధాని అమరావతి ఉద్యమంలో కీలకంగా ఉన్నారని భావించి చంద్రబాబు నాయుడు టిక్కెట్ ఇచ్చారు. కూటమి పార్టీల హవాతో మొన్నటి ఎన్నికల్లో గెలిచారు. తిరువూరు నియోజకవర్గంలో టీడీపీకి బలమైన నేతలున్నప్పటికీ వారిని కాదని, అక్కడ నియమించిన ఇన్ ఛార్జిని కాదని కొలికపూడికి టిక్కెట్ ఇచ్చారు. రాజధాని అమరావతి ఆందోళన చేసిన వారికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని భావించి చంద్రబాబు కొలికపూడికి ఈ టిక్కెట్ ఇచ్చారని చెప్పాలి. అయితే దొరికిన ఈ అరుదైన అవకాశాన్ని కొలికపూడి శ్రీనివాసరావు నిలుపుకోలేకపోతున్నారు. ప్రతి విషయంలోనూ వివాదమే. తానే మోన్కార్ గా ఉండాలని, చివరకు నియోజకవర్గంలో తన గెలుపునకు కారణమయిన వారిని కూడా పక్కన పెట్టి సొంత క్యాడర్ ను ఏర్పాటుచేసుకుంటూ పార్టీ నేతల నుంచి వ్యతిరేకత ను ఎదుర్కొంటున్నారు. ఇక తాజాగా తిరువూరు నియోజకవర్గంలో టిడిపి, జనసేన మధ్య మట్టి పంచాయతీ నెలకొంది. తెలుగుదేశం పార్టీ మట్టి దోపిడీని ఆధారాలతో సహా జనసేన నాయకులు బహిరంగంగానే నిలదీస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా వారు తిరువూరులో జరుగుతున్న ఇసుక, మట్టి దోపిడీలను జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు. తిరువూరు నియోజకవర్గంలోని చీమలపాడులో మట్టి దోపిడీ పై జనసేన నాయకులు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. మట్టి తవ్వకాల వీడియోలను సెల్ఫీ వీడియో ద్వారా తిరువూరు జనసేన ఇన్ ఛార్జి మనుబోలు శ్రీనివాసరావు బయపెట్టారు. గత ప్రభుత్వం పై దుమ్మెత్తి పోశామని, ఇప్పుడు మనం చేస్తున్నది ఏంటంటూ మనబోలు శ్రీనివాసరావు ప్రశ్నించడం విశేషం. గతంలో తమ పోరాటాలను మెచ్చుకున్న వారు ఇప్పుడు ప్రశ్నిస్తుంటే బూతులు తిడుతున్నారంటూ మండిపడుతున్నారు. ప్రజాధనం ఎలా లూటీ అవుతుందో చూడండి అంటూ మనుబోలు శ్రీనివాసరావు పోస్టు చేసిన వీడియో వైరల్ గా మారింది

# దేశంలో కొత్తగా 200 చమరు బావులు

జైపూర్ జూలై 17, (న్యూస్ పల్స్) భారత్.. ప్రపంచంలో ఎక్కువ చమరు దిగుమతి చేసుకునే దేశాల్లో మూడోస్థానంలో ఉంది. దేశ అవసరాల్లో కేవలం 15 శాతం మాత్రమే భారత్‌లో ఉత్పత్తి అవుతోంది. 85 శాతం గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. అయితే ఉక్రెయిన్?రష్యా యుద్ధం నేపథ్యంలో రష్యా క్రూడ్ ఆయిల్‌ను భారత్‌కు చౌకగా సరఫరా చేస్తోంది. దీనికి చెక్ పెట్టేందుకు అమెరికా, నాటో, గల్ఫ్ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. రష్యా ఆయిల్ కొనుగోలు చేస్తే భారత్‌పై వంద శాతం సుంకాలు విధిస్తామని అమెరికా, నాటో తాజాగా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అమెరికాతోపాటు, గల్ఫ్ దేశాలకు షాక్ ఇచ్చేలా భారత్ ప్రణాళికా రూపొందించింది. రాజస్థాన్‌లోని బాడ్‌మేర్?సాంచోర్ ప్రాంతంలో చమురు నిల్వల ఆవిష్కరణ భారత ఇంధన రంగంలో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. థార్ ఎడారిలో గుర్తించిన ఈ నిల్వలు దేశ ఇంధన స్వావలంబన లక్ష్యానికి ఊతం ఇవ్వనున్నాయి.రాజస్థాన్‌లోని బాడ్‌మేర్ బేసిన్ భారతదేశంలో అతిపెద్ద ఆన్‌షోర్ చమురు క్షేత్రాలలో ఒకటి. 2004లో గుర్తించిన మంగళ, భాగ్యం, ఐశ్వర్య క్షేత్రాలు 2009 నుంచి ఉత్పత్తిని ప్రారంభించాయి. ఈ క్షేత్రాలు దేశంలోని మొత్తం క్రూడ్ ఆయిల్ ఉత్పత్తిలో సుమారు 29% తీరుస్తున్నాయి. 2022లో రాజస్థాన్ నుంచి 5.9 మిలియన్ మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి అయింది. అయితే 2023 నాటికి ఈ మొత్తం 3.9 మిలియన్ టన్నులకు తగ్గింది. ఈ క్షీణత సహజంగా ఉన్న క్షేత్రాల నీటిపారుదల వల్ల సంభవించింది. 2022లో వేదాంత సంస్థ 2017/1 బ్లాక్‌లో దుర్గా?1 అనే చమురు నిల్వను గుర్తించింది. అయితే, దీని వాణిజ్య సాధ్యత ఇంకా పరీక్షలో ఉంది.తాజాగా బాడ్‌మేర్ బేసిన్‌లో 200 కొత్త చమురు బావుల తవ్వకం చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఈమేరకు వేదాంత సంస్థకు చెంది టైర్ సంస్థ ముందుకు వచ్చింది. ఇందుకోసం ప్రణాళిక సిద్ధమైంది. త్వరలోనే బావుల తవ్వకం ప్రారంభించే అవకాశం ఉంది. ఇందుకు అమెరికా, కెనడా, రష్యా, ఆస్ట్రేలియాకు చెందిన సంస్థలు భారీ ఎక్విప్ మెంట్ తో భారత్‌కు రానున్నాయి. రష్యా ఆయిల్ సరఫరాను అడ్డుకునేందుకు అమెరికా, నాటో దేశాలు ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో 200 బావుల్లో క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి జరిగితే మన దేశ అవసరాలకు పోనూ ఇంకా మిగిలే అవకాశం కూడా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. అప్పుడు భారత్ కూడా గల్ఫ్ దేశాల తరహాలో ఎగుమతి చేసే అవకాశం ఉంది. పెట్రో ధరలు తగ్గి దేశ ఆర్థికవృద్ధి కానుంది. సామాన్యులకు ఇదో గొప్ప ఊరట.. ఆర్థిక స్వావలంబనకు దోహదపడనుంది. అదే జరిగితే గల్ఫ్ దేశాలు నమ్మకమైన అతిపెద్ద దిగుమతిదారును కోల్పోవడంతోపాటు, పోటీదారును ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అమెరికా, నాటో సహా పాశ్చాత్య దేశాల బెదిరింపులకు భారత్ భయపడాల్సిన అవసరం అగత్యం ఉండదు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి వ్యక్తి మృతి?..

## పలువురికి స్వల్ప గాయాలు

కోవూరు మండలం జాతీయ రహదారిపై తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు నుండి విజయవాడకు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ముందు వెళ్తున్న లారీని అతివేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులను ఎక్కించే నాని అనే వ్యక్తి బస్సు క్యాబిన్లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాద సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. డ్రైవర్ కు, ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.ప్రయాణికులను మరో బస్సులో విజయవాడకు తరలించారు.

# జనాభా పెంపుపై సర్కార్ దృష్టి


## ఇద్దరిని కంటే ఎక్కువ మందైతే ప్రోత్సాహకాలు

విశాఖపట్టణం, జూలై 17, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్య ఎక్కువగా ఆందోళన చెందుతున్న విషయం జనాభా తగ్గదల. ఏపీ జనాభా పెరుగుదల ఆశించిన స్థాయిలో ఉండటం లేదని.. ఇలాగైతే భవిష్యత్తులో ఊర్లు ఉండవంటూ చంద్రబాబు పలు సందర్భాలలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగానూ చంద్రబాబు మరోసారి ఇదే విషయాన్ని ప్రస్తావించారు. అయితే చంద్రబాబు ఆందోళన వెనుక అనేక కారణాలు ఉన్నాయి. చంద్రబాబు నాయుడు గతంలో జనాభా నియంత్రణ విధానాన్ని గట్టిగా సమర్థించారు. అధిక జనాభా వల్ల ఇబ్బందులు తప్పవన్న ఆయన.. ఒక్కరు ముద్దు అనే విధానాన్ని పాటించాలని అప్పట్లో పిలుపునిచ్చారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోవడంతో చంద్రబాబు స్టాండ్ మారింది. పిల్లల్ని కనండి.. అవసరమైతే ప్రోత్సాహకాలు కూడా ఇస్తామని ప్రకటిస్తున్నారు. ఏపీలో జనాభా పెరుగుదల రేటు తగ్గడం మంచిది కాదని.. సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని కొత్త జంటలు పిల్లలను కనాలని ఆయన సూచిస్తున్నారు. చంద్రబాబు ఈ మధ్య ఓ అడుగు ముందుకేసి.. ముగ్గురు కంటే ఎక్కువమంది పిల్లలను కన్నవారే నిజమైన దేశభక్తులు అనే వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు జాతీయ సగటు కంటే తక్కువగా ఉందని.. జనాభా స్థిరత్వం కోసం సంతానోత్పత్తి రేటు 2.1గా ఉండాల్సి ఉండగా.. ఏపీలో సంతానోత్పత్తి రేటు 1.7గా ఉందని చంద్రబాబు చెబుతున్నారు. చంద్రబాబు ఎందుకిలా పిల్లలను కనమని చెప్తున్నారో చైనా, జపాన్ దేశాలను చూస్తే అర్థమవుతుందని విశ్లేషకులు చెప్తున్నారు. ఎందుకంటే పిల్లల్ని కనే జంటలకు ఈ దేశాల్లో ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. 'ఒక్కరు ముద్దు – ఇద్దర వద్దు' అంటూ గతంలో పిలుపునిచ్చిన కమ్యూనిస్టు దేశం చైనా.. ఇప్పుడు యువ జనాభా తగ్గుదలతో ఇబ్బందులు పడుతోంది. పనిచేసే యువకుల సంఖ్య తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరుగుతూ ఉండటంతో చైనా ఆర్థిక రంగం మీద ఆ ప్రభావం పడుతోంది. దీంతో అప్రమత్తమైన బీజింగ్ పాలకులు పిల్లలను కనాలని చైనీయులను కోరుతున్నారు. పిల్లలను కనే వారికి ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నారు. చైనాలోని ఇన్నర్ మంగోలియాలో.. రెండో బిడ్డను కన్న జంటకు 50 వేల యువాన్లు అందిస్తున్నారు. ఇది భారత కరెన్సీలో దాదాపు రూ.6 లక్షలు. ఇక మూడో బిడ్డను కన్న దంపతులకు లక్ష యువాన్లు అందిస్తోంది అక్కడి ప్రభుత్వం.చైనాలోని పలు రాష్ట్రాల ప్రభుత్వాలు.. పిల్లలను కనే జంటల కోసం ఇలాంటి రాయితీలను ఇప్పటికే ప్రకటించాయి. ఇల్లు కట్టుకోవడానికీ రాయితీలు అందిస్తున్నారు. పుట్టే ప్రతి బిడ్డకు ఏడాదికి 3600 యువాన్ల చొప్పున.. మూడేళ్లపాటు ఇవ్వాలనే యోచనలో చైనా ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. ఆ లెక్కన పుట్టే ప్రతి బిడ్డకు కూడా మన భారతీయ కరెన్సీ ప్రకారం ఏటా రూ.43000 ఇవ్వాలనే ఆలోచన చైనా ప్రభుత్వం చేస్తోంది.ఒక దేశం లేదా రాష్ట్రంలో జనాభా స్థిరంగా పెరగకపోతే అది దాని ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. పెరిగిన మౌలిక వసతులు, వైద్యారోగ్య రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా.. సగటు మనిషి ఆయుర్దాయం పెరిగింది. అలాగే మారుతున్న జీవన శైలి, విపరీతంగా పెరుగుతున్న ఖర్చులు, చిన్న కుటుంబాల కారణంగా నేటి యువత పెళ్లి పట్ల, పిల్లలను కనడం పట్ల అంతగా ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా ఏటేటా వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. పనిచేసే యువ జనాభా తగ్గుముఖం పడుతోంది. దీంతో ఉత్పత్తి తగ్గి.. ఆర్థిక వ్యవస్థలో వేగం తగ్గుతుంది. పనిచేసే వారి సంఖ్య తగ్గితే అది ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలాగే వృద్ధుల సంరక్షణ కోసం చేసే ఖర్చు కూడా ప్రభుత్వాలకు భారంగా మారుతుంది.ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే సంతానోత్పత్తి రేటు తగ్గుతోందనేది చంద్రబాబు ఆందోళన. పరిస్థితి ఇలాగే కొనసాగితే మన రాష్ట్రంలోనూ యువత తగ్గిపోతారని చంద్రబాబు అంటున్నారు. ఇందులో రాజకీయ కోణం కూడా లేకపోలేదు. జనాభా ప్రాతిపదినక లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందనే వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే అధిక జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ ఎంపీ సీట్లు వస్తాయని.. ఇన్నాళ్లు కుటుంబ నియంత్రణను పటిష్టంగా అమలు చేసిన తమకు పార్లమెంట్‌లో ప్రాధాన్యత తగ్గుతుందనేది దక్షిణాది రాష్ట్రాల ఆందోళన. దీంతో తమిళనాడు సీఎం స్టాలిన్ సైతం పిల్లలను కనాలని పిలుపునిస్తున్నారు.ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అవకాశం లేకపోయేది. ఈ చట్టంలో చంద్రబాబు మార్పులు చేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల మాతృత్వ సెలవులు, పితృత్వ సెలవుల విషయంలోనూ ఏపీ ప్రభుత్వం కొత్త ఆలోచనలు చేస్తోంది. అయితే జనాభా పెరుగుదల కోసం చంద్రబాబు చెప్తున్న కారణాలపైనా భిన్నమైన వాదనలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా ఉన్న చైనాను ఇండియా వెనక్కి నెట్టింది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ జనాభాకు అవసరమైన మౌలిక వసతులు.. కూడు, గూడు, గుడ్డ లాంటి కనీస అవసరాలు అందని అభాగ్యులు కూడా మనదేశంలో ఉన్నారు. వీరికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉంది.అలాగే ప్రస్తుతం విద్య, వైద్యం మనదేశంలో చాలా ఖరీదైన వ్యవహారంగా మారిపోయింది. జీవన వ్యయం కూడా భారీగా పెరిగింది. దీంతో భార్యాభర్తలిద్దరూ పని చేస్తే గానీ పిల్లలను చదివించలేని పరిస్థితి. ఇప్పటికే ఉపాధి కోసం యువ జంటలు నగరాల్లో నివాసం ఉంటుండగా.. పెద్దలు మాత్రం సొంతూర్లలో ఉంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇద్దరికి మించి పిల్లలను కనడం సాధ్యమేనా అనే ప్రశ్న వినిపిస్తోంది. చిన్న ఊళ్లలోనూ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. పిల్లలను కంటూ పోతే.. వారి బాగోగులు ఎవరు చూసుకుంటారు అని ప్రశ్నించే వారూ ఉన్నారు.ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలను కనడానికి యువ జంటలు ముందుకు రావాలంటే.. ప్రభుత్వం నుంచి మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తల్లికి వందనం వంటి పథకాల ద్వారా చిన్నారుల చదువుకు ఆర్థిక భరోసా అందిస్తున్నప్పటికీ.. అది పిల్లల చదువు కోసమే ఖర్చయ్యే పరిస్థితి. పిల్లలు పుట్టగానే వారి ఖాతాలో కొంత నగదు జమ చేయడంతోపాటు.. పిల్లలకు కనీసం ఐదేళ్లు వచ్చే వరకూ ఏటా కొంత మొత్తం ఆర్థిక సహకారం అందించడం.. విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు చేయడం ఎంతో అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇవన్నీ చేయాలంటే భారీ మొత్తంలో నిధులతోపాటు ప్రభుత్వానికి ఓ ప్రణాళిక, సన్నద్ధత అవసరం. ఎక్కువ మంది పిల్లలను కనడం ద్వారా.. తమ దేశభక్తి నిరూపించుకోవడానికి యువ జంటలు సిద్ధపడాలంటే.. అంత కంటే ముందు తగిన కార్యాచరణ రూపొందించడం ద్వారా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

# జాతి వివక్షత పై పోరాడిన నల్ల సూరీడు నెల్సన్ మండేలా

**–భారతరత్న పొందిన విదేశీయుడు**

**–జులై 18 "మండేలా డే" నేడు నేల్సన్ మండేలా జయంతి**



నెల్సన్ మండేలా..! ఓ స్వాప్నికుడు...శాంతి కాముకుడు...విశ్వ శాంతికి సంకేతం... పీడనకు, దోపిడీకి, భయానికి తావులేని సమాజం కావాలనేది ఆయన కల. దక్షిణాఫ్రికా విమోచనోద్యమానికి జీవం. మనిషిని పశువుగానో, పనిముట్టుగానో చూడటంపై నిప్పులు చెరిగిన పోరాట యోధుడు. జాతి వివక్ష, దోపిడీ, బానిసత్వంపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన ధిక్కార పతాకం. దక్షిణాఫ్రికాలో దశాబ్దాలుగా కొనసాగిన వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించి 27 ఏండ్లు జైల్లో నిర్బంధిచబడిన వాడు. జాత్యహంకార శ్వేత జాతి ప్రభుత్వం పాటిస్తున్న వివక్షను నిరసిస్తూ ఉద్యమించి నల్ల జాతీయులకు విముక్తి కల్పించిన వీరుడు " నెల్సన్ మండేలా ". అందుకే ప్రపంచంలో ప్రజలను విముక్తి చేయటం కోసం పోరాడిన అతికొద్ది మందిలో ఒకరిగా కీర్తి పొందారు. భౌతికంగా ప్రపంచానికి దూరమైనప్పటికీ, మానవాళి ఉన్నంత కాలం, వివక్ష, అణిచివేత ఉన్నంతకాలం నెల్సన్ మండేలా బతికే ఉంటాడు. సమాజ పరిణామ క్రమంలో బానిసత్వంపై తిరుగుబాటు చేసిన మొదటి తరానికి చెందిన స్పార్టకస్, ఏసుక్రీస్తు పేర్లు ఎలాగైతే అజరామరంగా చలామణిలో ఉంటున్నాయో, విముక్తి ఉద్యమాలు జరిగే చోట, దోపిడి, అణిచివేతలు జరిగే చోట వీరి పేరు ఎలా ప్రతిధ్వనిస్తున్నాయో...అలాగే 21వ శతాబ్దపు విముక్తి ఉద్యమ వీరుడిగా నెల్సన్ మండేలా పేరు కూడా ప్రతి ధ్వనిస్తూనే ఉంటుంది. అణిచివేతలో మగ్గిపోయి మసిబారిన బొమ్మల్లా ఉన్నవారి కోసం జీవితకాలం ఉద్యమాన్ని కొనసాగించటమే కాదు, తరతరాలుగా తలలు వంచుకొని బ్రతికిన వారిని బ్యాలెట్ ( ఓటుహక్కు ) వరకూ తీసుకెళ్లి వారిని జీవమున్న " మనుషులుగా " నిటారుగా నిలబెట్టెందుకు నేలను చీల్చుకుంటూ ఎగిసిపడిన స్వేచ్ఛా పతాక నెల్సన్ మండేలా. అనేక దశాబ్దాల పాటు కొనసాగిన ఉద్యమం ఫలితంగా 1994 ఏప్రిల్ 26వ తేదీన ఉదయాన్నే పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలబడిన ఒక ఆఫ్రికన్ యువకుడు తనను పలకరించిన ఓ ఇంగ్లీష్ పత్రిక విలేకరితో " ఇప్పుడు నేను మనిషి " అన్న మాట వెనుక వందల వేల మంది ఆత్మార్పణ ఉంది. త్యాగం ఉంది. వారి రక్తం ఉంది. పోరాట యోధుల చిత్ర హింసలున్నాయి. అందుకే దక్షిణాఫ్రికాకు నెల్సన్ మండేలా మొదటి నల్లజాతి అధ్యక్షుడిగా అధికారం చేపట్టినప్పుడు " నేల మీద నడిచే దేవ దూత " అంటూ కొనియాడారు. దక్షిణాఫ్రికా శాంతియుత పరిణామానికి ఎంతగానో పొగడ్తలు, ప్రసంసలు లభించాయి. దక్షిణాఫ్రికా జాతిపితగా, ప్రజాస్వామ్య వ్యవస్థాపకుడిగా ప్రజల ఆదరణ పొందాడు. ఆఫ్రికా జాతి విముక్తి నేతగా పేరొందాడు. నెల్సన్ మండేలా జ్ఞాపకార్థం వివిధ నగరాల్లో మండేలా విగ్రహాలు ప్రతిష్టితమయ్యాయి. 1993లో నోబెల్ శాంతి బహుమతి అందుకున్నాడు. జాతి వివక్ష నిర్మూలన కోసం మండేలా జరిపిన పోరాటానికి గుర్తుగా ఆయన పుట్టినరోజు జూలై 18 " మండేలా డే " గా ఐరాస జనరల్ అసెంబ్లీ 2009 నవంబర్ లో ప్రకటించింది. 1990లో భారత అత్యున్నత పౌరపురస్కారం భారతరత్న ప్రకటించింది. బ్రతికుండగానే ఇలాంటి గౌరవం, పురస్కారాలు అందుకున్న నెల్సన్ మండేలా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు. అయితే ప్రపంచ శాంతి అనేది ఒక నినాదంగానే ఉందనేది గుర్తించాలి. ఈ మధ్యకాలంలో అమెరికాలో చోటుచేసుకున్న జాత్యహంకారం ఘటనలు కావచ్చు, మన దేశంలో ఇలాంటి ఘటనలోనే తండ్రీకొడుకులు హతమైన ఘటన కావచ్చు ఇలాంటి మరెన్నో వివక్ష, అణిచివేత దోరణులకు అద్దం పడుతున్నాయి. ఈ తరుణంలో జాతి విముక్తి కోసం, నల్లజాతీయుల యోధుడు నెల్సన్ మండేలా స్ఫూర్తిని పునికిపుచ్చుకోవాలి. జులై 18 "మండేలా డే" ( నెల్సన్ మండేలా పుట్టిన రోజు ) సందర్భంగా నెల్సన్ మండేలాను స్మరించుకుందాం.

# ప్రతి ఒక్కరిపై 11 లక్షల అప్పు

ప్రపంచంలో ఎంత అప్పు ఉందో తెలుసా..? అది ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ పంచితే దాదాపు రూ.11 లక్షల ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం, ప్రపంచం మొత్తం అప్పు 102 ట్రిలియన్ డాలర్లు అంటే రూ. 8,67,53,95,80,00,00,001. ప్రపంచ జనాభా 8.2 బిలియన్లు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికా అత్యధిక రుణాన్ని కలిగి ఉంది. కాగా, చైనా, జపాన్, యూరోపియన్ దేశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ జాబితాలో భారత్ 7వ స్థానంలో ఉంది. దీని మీద 3 ట్రిలియన్ డాలర్ల అప్పు ఉంది. ఇది మొత్తం ఉఆఖ కంటే తక్కువగా ఉండవచ్చు. కానీ భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌కి ఈ రుణం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రపంచం, దేశాల రుణాలకు సంబంధించి ఈ నివేదికలో ఎలాంటి గణాంకాలు ఉన్నాయో చూద్దాం.

భారతదేశం గత దశాబ్దకాలంలో అనేక ఆర్థిక సంస్కరణలు, సామాజిక పథకాలు, రాజకీయ మార్పులను చవిచూసింది. కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశ ఆర్థికవృద్ధి, ఉపాధి కల్పన, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై ఎన్నో వాగ్దానాలు చేసింది. అయితే, ఇటీవలి ఆర్థిక నివేదికలు, సామాజిక వాస్తవాలు సామాన్య పౌరుడి జీవితంలో పెరిగిన అప్పుల భారాన్ని, ఆర్థిక సంక్షోభాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఇటీవల విడుదల చేసిన ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్- 2025 ప్రకారం, దేశంలోని ప్రతి పౌరుడిపై సగటున రూ. 4.8 లక్షల అప్పు ఉంది. ఇది గత రెండేళ్లలో రూ. 90,000 మేర పెరిగింది. ఈ గణాంకాలు సామాన్యుడి జీవన పరిస్థితులు ఎంత దిగజారాయో చాటుతున్నాయి.ఆర్‌బిఐ నివేదిక ప్రకారం, 2023 మార్చిలో ఒక్కో పౌరుడిపై అప్పు రూ. 3.9 లక్షలుగా ఉండగా, 2025 మార్చి నాటికి ఇది రూ. 4.8 లక్షలకు చేరింది. ఈ రూ. 90,000 పెరుగుదల సామాన్యుడి ఆర్థిక ఒత్తిడిని సూచిస్తుంది. దేశ జిడిపిలో అప్పుల వాటా 41.9 శాతంగా ఉంది. ఇందులో గృహ రుణాలు 29 శాతం. క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, మొబైల్ ఇఎంఐలు 54.9 శాతం వాటాను కలిగి ఉన్నాయి. మరో ఆందోళనకర అంశం ఏమిటంటే, లోన్-టు-వాల్యూ (ఎల్‌టివి) రేషియో 70 శాతానికి పైగా ఉండటం. ఇది రుణాల రికవరీని కష్టతరం చేస్తుంది. అంతేకాక, 25 శాతం రిటైల్ రుణాలు సురక్షితం కానివిగా గుర్తించారు. ఇది ఆర్థిక వ్యవస్థలో అస్థిరతను సూచిస్తుంది.ఫోర్బ్ నివేదిక ప్రకారం, దేశంలో సగటు తలసరి ఆదాయం రూ. 2.16 లక్షలు మాత్రమే. అంటే, సామాన్యుడి అప్పు అతని ఆదాయం కంటే రెండింతలకు పైగా ఉంది. ఈ అసమతుల్యత సామాన్య పౌరుడు తన రోజువారీ జీవన అవసరాల కోసం అప్పులపై ఆధారపడుతున్నాడని స్పష్టం చేస్తుంది. ఆర్‌బిఐ గణాంకాలు చెప్పేది ఏమిటంటే 55% అప్పులు, ఆస్తుల సృష్టికి కాకుండా, కేవలం జీవన ఖర్చుల కోసమే తీసుకోబడుతున్నాయి. క్రెడిట్ కార్డుల వాడకం, వ్యక్తిగత రుణాలు, ఇఎంఐలు ఈ ధోరణికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. సామాన్యుడు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. మొదటిది, నిత్యావసర వస్తువుల ధరలు గత 11 ఏళ్లలో దాదాపు 300 శాతం పెరిగాయి. ఆహారం, ఇంధనం, గృహ ఖర్చులు, విద్య, వైద్యం వంటి అంశాలు సామాన్యుడికి భారంగా మారాయి.రెండవది, ద్రవ్యోల్బణం పెరిగినా, వేతనాలు దానికి అనుగుణంగా పెరగలేదు. చాలీచాలని జీతాలతో కుటుంబ ఖర్చులను భరించలేక, ప్రజలు అప్పులపై ఆధారపడుతున్నారు. మూడవది, నైపుణ్యానికి తగిన ఉపాధి అవకాశాలు తగ్గాయి. యువతలో నిరుద్యోగం రేటు గత కొన్నేళ్లలో గణనీయంగా పెరిగింది, ఇది ఆర్థిక అస్థిరతకు దారితీస్తోంది. ఈ పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని పథకాలు- ఉదాహరణకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై), ఆయుష్మాన్ భారత్- పేదలకు సహాయం చేసే లక్ష్యంతో రూపొందించబడ్డాయి. అయితే, ఈ పథకాలు అమలులో లోపాలు, అవగాహన లేమి లేదా అర్హత సమస్యల వల్ల సామాన్యుడికి పూర్తి ప్రయోజనం చేకూరడం లేదుపిఎంఎవై కింద గృహ రుణాలపై సబ్సిడీలు అందుతున్నప్పటికీ అర్హత నిబంధనలు, దరఖాస్తు ప్రక్రియలు సంక్లిష్టంగా ఉండటం వల్ల చాలా మంది ఈ ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ వంటి విమర్శకులు, మోడీ ప్రభుత్వం గత 11 ఏళ్లలో సామాన్యుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో విఫలమైందని ఆరోపిస్తున్నారు. అచ్చేదిన్ నినాదంతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం, వాస్తవానికి ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టిందని వాదిస్తున్నారు. ఒక వైపు సామాన్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే, ప్రభుత్వానికి సన్నిహిత వ్యాపార వేత్తలు మాత్రం అపార సంపదను సృష్టించుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఉదాహరణకు, ఉదాహరణకు, ఐటి హార్డ్‌వేర్, బయో టెక్నాలజీ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు, ప్రోత్సాహకాలు అందిస్తున్నప్పటికీ ఈ ప్రయోజనాలు ప్రధానంగా కార్పొరేట్ రంగానికే చేకూరుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంక్షోభాన్ని తగ్గించడానికి, ప్రభుత్వం కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి. మొదట ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలి.నిత్యావసర వస్తువుల ధరలను స్థిరీకరించడం అత్యవసరం. రెండవది, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలి. మూడవది, రుణాల విషయంలో పారదర్శకత, సురక్షిత రుణవిధానాలను అమలు చేయాలి. అంతేకాక సామాన్యులకు విద్య, వైద్యం, గృహసౌకర్యాలు అందించే పథకాలు సులభతరం చేయాలి. తద్వారా వారు అప్పులపై ఆధారపడకుండా ఉండగలరు. మోడీ పాలనలో దేశం కొన్ని రంగాల్లో పురోగతి సాధించినప్పటికీ, సామాన్యుడి జీవనపరిస్థితులు మాత్రం ఆశాజనకంగా లేవు. పెరిగిన అప్పుల భారం, ద్రవ్యోల్బణం, ఉపాధి అవకాశాల కొరత వంటివి పేద, మధ్యతరగతి ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆర్థిక స్థిరత్వం, సామాజిక సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే సామాన్యుడి జీవితం మరింత కష్టాల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. భారతదేశం మొత్తం ఉఆఖ 3.7 ట్రిలియన్ డాలర్లు. అటువంటి పరిస్థితిలో భారతదేశం అప్పు మొత్తం జీడీపీ కంటే తక్కువగా ఉంది. కానీ భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు అప్పుల పరిమాణం చాలా ప్రమాదకరమైనది. ప్రపంచ రుణంలో వాటా గురించి మాట్లాడినట్లయితే, అది 3.2 శాతం. ప్రపంచంలో చాలా తక్కువ రుణాలు ఉన్న దేశాలు ఉన్నాయి. ఇరాక్, చిలీ, చెక్ రిపబ్లిక్, వియత్నాం, హంగరీ, జంఇ. బంగ్లాదేశ్, ఉక్రెయిన్, తైవాన్, రొమేనియా, నార్వే, స్వీడన్, కొలంబియా, ఐర్లాండ్ మరియు ఫిన్లాండ్. అదే సమయంలో ప్రపంచ రుణంలో పాకిస్తాన్ మొత్తం అప్పుల వాటా 0.3 శాతంగా కనిపించింది.ఎఓఈ నివేదిక ప్రకారం.. 2024 నాటికి ప్రపంచం పెరుగుతున్న అప్పులు పెద్ద సమస్యగా మారాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనాల అప్పులు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. మనం ప్రపంచ రుణం గురించి మాట్లాడినట్లయితే, అది 102 ట్రిలియన్ డాలర్లు అంటే రూ. 8,67,53,95,80,00,00,001. కాగా గ్లోబల్ జిడిపి 110 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. అంటే ప్రపంచ స్థూల జాతీయోత్పత్తి కంటే ప్రపంచ రుణం తక్కువగా ఉన్నప్పటికీ, ఈ రుణం మొత్తం జిడిపిలో 93 శాతానికి చేరుకుంది. చాలా దేశాలు తమ మొత్తం జిడిపి కంటే ఎక్కువ రుణాలు తీసుకున్నాయి. అంతేకాకుండా, కొన్ని పెద్ద దేశాలు కూడా డిఫాల్ట్ అంచుకు చేరుకున్నాయి.

## ఏఐ సాయంతో రైల్వేల్లో సీసీటీవీలు

ముంబై, జూలై 17, (న్యూస్ పల్స్) రైలు ప్రయాణం తక్కువ ఖర్చుతోపాటు సుఖవంతమైన ప్రయాణాన్ని కూడా అందిస్తుంది. ఇక దూర ప్రాంతాలకు వెళ్లేవారికి రైలు ప్రయాణం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. అందుకే కొన్ని రూట్లలో నెలలకు ముందే టికెట్లు బుక్ చేసుకుంటూ ఉంటారు. అయితే రైలు ప్రయాణాల్లో కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. రైలు ప్రయాణాల్లో దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు.. రైల్వే శాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి రైళ్లలో కెమెరాలు బిగించి.. ఏం జరుగుతుందో తెలుసుకోనుంది. ఇంతకీ ఈ కెమెరాలు ఎక్కడ బిగిస్తారు. వాటి వల్ల ప్రయాణికుల ప్రైవసీకి భంగం కలగకుండా ఎలా చర్యలు తీసుకుంటారుభారతీయ రైల్వేలు రోజురోజుకూ సరికొత్తగా మారిపోతున్నాయి. అత్యాధునిక రైళ్లు, రైలు మార్గాల విస్తరణ, చీనాబ్ లాంటి ప్రపంచంలోనే ఎత్తైన బ్రిడ్జి నిర్మాణం, ప్రయాణికుల సౌకర్యం కోసం ఎన్నో చర్యలను రైల్వే శాఖ చేపడుతూనే ఉంది. అదే సమయంలో రైలు ప్రమాదాలను తగ్గించేందుకు.. కవచ్ లాంటి టెక్నాలజీని ప్రవేశపెట్టింది. రైల్వే ఆధునీకరణ వైపు అడుగులు పెడుతున్నప్పటికీ.. కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. రైళ్లలో దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వ్యక్తులు, టికెట్ లేకుండా ప్రయాణించేవారు.. ప్రయాణికులను భయాందోళనకు గురి చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ఒంటరిగా ప్రయాణించే మహిళలు, యువతులు.. ఇలాంటి ఘటనలపై ఫిర్యాదులు చేయడం.. ప్రయాణికుల భద్రతకు సవాల్ విసురుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రైలు ప్రయాణికుల భద్రతకు రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా రైళ్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి.. భద్రతను పటిష్ఠం చేసి, ప్రయాణికులకు మెరుగైన ప్రయాణాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.10 ఏళ్లలో రైల్వే శాఖ ఎంత అప్‌డేట్ అయిందో, అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఎలా దూసుకెళు_ందో మనం చూస్తూనే ఉన్నాం. ఇప్పటికే వందే భారత్ రైళ్లు.. సూపర్ సక్సెస్ కాగా.. త్వరలోనే వందే భారత్ స్లీపర్ రైళ్లు కూడా పరుగులు పెట్టనున్నాయి. మరోవైపు.. బుల్లెట్ రైలు ప్రాజెక్టు కూడా శరవేగంగా పూర్తి చేసుకునేందుకు సిద్ధం అవుతోంది. ఈ నేపథ్యంలోనే రైల్వే వ్యవస్థలోనే మరో విప్లవాత్మక మార్పుకు సిద్ధం అవుతోంది. రైళ్లలో సీసీటీవీ కెమెరాలను అమర్చాలని కీలక నిర్ణయం తీసుకుంది. రైల్వే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. ఈ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది.

### 3.86 లక్షల కెమెరాలు

రైల్వే ప్రయాణికుల భద్రతను పెంచడంలో భాగంగా.. దేశంలోని అన్ని ప్యాసింజర్ కోచ్‌లు, లోకోమోటివ్‌లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. మొత్తం 74 వేల కోచ్‌లు, 15 వేల లోకోమోటివ్‌లలో ఈ కెమెరాలను అమర్చనున్నట్లు వెల్లడించింది. ఇందుకోసం సుమారు 3.86 లక్షల సీసీ కెమెరాలు అవసరం అవుతాయని తెలిపింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర రైల్వే సహాయ మంత్రి రవణీత్ సింగ్ బిట్టు ఆమోదం తెలిపారు.రైల్వే మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం.. ప్యాసింజర్ కోచ్‌లలో సీసీటీవీ కెమెరాలను పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయగా.. అందులో మంచి ఫలితాలు రావడంతో.. దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రైళ్లలో కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల.. రైలు ప్రయాణికులకు మరింత భద్రతను అందించవచ్చని సంబంధిత అధికారులు వెల్లడించారు. రైళ్లలో దుండగులు, కొన్ని ముఠాలు అమాయక ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నాయని.. కెమెరాల ఏర్పాటుతో అలాంటి ఘటనలు తగ్గించవచ్చని రైల్వే మంత్రిత్వ శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది.సాధారణంగా రైలు ప్రయాణం అంటేనే.. ఎక్కడి నుంచో ఎక్కడికి వెళ్లేవాళ్లు ఎక్కుతూ ఉంటారు. ఏ స్టేషన్‌లో ఎక్కుతారో ఏ స్టేషన్‌లో దిగుతారో పక్కవారికి అస్సలు తెలియదు. అందులో సాధారణ ప్రయాణికులతోపాటు దొంగలు, కిడ్నాప్ ముఠాలు, దోపిడీదారులు, హంతకులు, డ్రగ్స్ సేవించేవారు, ఆల్కహాల్ సేవించేవారు, పొగ తాగేవారు ఉంటారు. ఇలాంటి వాళ్ల వల్ల మిగిలిన ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయి. రాత్రివేళల్లో ప్రయాణికులు అంతా నిద్రపోతున్న సమయంలో దొంగతనాలు చేస్తారు. మెడలో ఉన్న గొలుసులు లాగేసుకుపోతారు. అడ్డగిస్తే.. హతమార్చేందుకు కూడా వెనుకాడని వారు ఉంటారు. ఇలాంటి ఘటనలను ఎంతో కొంత అడ్డుకోవడానికి ఈ సీసీటీవీల ఏర్పాటు ఉపయోగపడుతుందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.రైళ్లలో కెమెరాలు ఏర్పాటు చేస్తామని రైల్వే శాఖ చేసిన ప్రకటనతో తమ ప్రైవసీకి భంగం కలుగుతుందని కొందరు ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రయాణికుల గోప్యతకు ఎలాంటి భంగం కలగదని తేల్చి చెప్పింది. ప్రయాణికుల ప్రైవసీని దృష్టిలో పెట్టుకుని.. సీసీ కెమెరాలు ఎక్కడ ఏర్పాటు చేయాలి అనేది నిర్ణయించినట్లు తెలిపింది. బోగీ డోర్ల వద్ద ఉన్న ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రాంతంలో మాత్రమే కెమెరాలను ఏర్పాటు చేస్తామని రైల్వే మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.ప్రతి ప్యాసింజర్ కోచ్‌లో మొత్తం 4 డోమ్ టైప్ సీసీ కెమెరాలు అమర్చనున్నారు. బోగికి ఇరువైపుల ఉన్న ఎంట్రీల వద్ద రెండు చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఇక లోకోమోటివ్‌లకు మొత్తం 6 కెమెరాలు బిగించనున్నారు. ముందు, వెనుక, రెండు వైపులా ఒక్కొక్కటి చొప్పున కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు లోకోలోని ప్రతి క్యాబ్ (ముందు, వెనుక) ఒక డోమ్ సీసీ కెమెరా సహా 2 డెస్క్ మౌంటెడ్ మైక్రోఫోన్‌లతో అమర్చనున్నారు.రైల్వే శాఖ ఏర్పాటు చేయనున్న సీసీటీవీ కెమెరాలు అత్యాధునిక టెక్నాలజీ కలిగి ఉండనున్నాయి. హై క్వాలిటీ గల కెమెరాలు, ఇతర పరికరాలను మాత్రమే వినియోగించాలని.. రైల్వే బోర్డు సీనియర్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో.. కేంద్రమంత్రి రవణీత్ సింగ్ బిట్టు సూచించారు. రాత్రి వేళల్లో స్పష్టంగా కనిపించడమే కాకుండా.. రైలు గంటకు 100 కిలోమీటర్లకు పైగా వేగంతో వెళ్తున్నా.. కెమెరాలు రికార్డ్ అయ్యేలా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఇండియాఏఐ మిషన్‌తో కలిసి సీసీటీవీ కెమెరాల ద్వారా సేకరించిన డేటాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించాలని కేంద్రమంత్రి సూచించారు. రైళ్లలో అనుమానాస్పద కదలికలను ఆటోమేటిక్‌గా గుర్తించడం, రియల్ టైమ్ హెచ్చరికలు చేయడం, ప్రయాణికుల రద్దీని విశ్లేషించడం వంటి సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఏఐ ఉపయోగపడుతుందని తెలిపారు.రైళ్లలో లక్షలాది సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం భారీ ఖర్చుతో కూడుకున్న పని అని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టుకు సుమారు రూ.8,300 కోట్ల నుంచి రూ.12,500 కోట్ల మధ్య ఖర్చవుతుందని తెలుస్తోంది. ఈ కెమెరాల ఏర్పాటులో 3.86 లక్షల సీసీటీవీలు మాత్రమే కాకుండా వాటికి సంబంధించిన పూర్తి పరికరాలు, వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయిన డేటాను నిల్వ చేసేందుకు వ్యవస్థలు.. కమాండ్ కంట్రోల్ సెంటర్లు, వీడియో అనలిటిక్స్ సాఫ్ట్‌వేర్, సైబర్ సెక్యూరిటీ టూల్స్, వీటన్నింటి మెయింటెనెన్స్ ఉండాలి.ప్రయాణికుల భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణం కోసం రైల్వే శాఖ ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా ఉన్న రైళ్లలో సీసీటీవీలు ఏర్పాటు చేయడం భద్రతపరంగా ప్రయాణికులకు మరింత ధైర్యం కలగనుంది. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించుకుంటూ.. ప్రయాణికుల ప్రైవసీకి భంగం కలగకుండానే రక్షణ కల్పిస్తామని రైల్వే శాఖ హామీ ఇస్తోంది. రైల్వే శాఖ తీసుకున్న ఈ నిర్ణయం.. అభినందించదగిందే కదూ!

## కగార్.. సింధూర్...
## ఇప్పుడు కాలనేమి

తిరువనంతపురం, జూలై 17, ఆపరేషన్ సిందూర్.. ఇటీవల పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు భారత్ చేపట్టిన ఆపరేషన్ ఇది. ఇక ఆపరేషన్ కగార్.. ప్రస్తుతం ఇది దేశంలో కొనసాగుతోంది. 2026 నాటికి మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ ఆపరేషన్ కొనసాగిస్తోంది. ఆపరేషన్ కాలనేమి కూడా దేశంలోని ఒక రాష్ట్రంలో జరుగుతోంది.దేవభూమిగా గుర్తింపు పొందిన రాష్ట్రం ఉత్తరాఖండ్. ప్రస్తుతం ఈ రాష్ట్రంలో చార్‌ధామ్, కావడి యాత్రలు జరుగుతున్నాయి. అనేక పుణ్యక్షేత్రాలకు కొలువై ఉన్న ఉత్తరాఖండ్‌లో కొన్నేళ్లుగా నకిలీ బాబాల బెడద పెరిగింది. ఈ నకిలీ సాధువులు భక్తులను మోసం చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. కొందరిని బెదిరిస్తున్నారు. కొందరిని దూషిస్తున్నారు. ఈ సాధువుల్లో కొందరు బంగ్లాదేశ్‌కు చెందినవారు ఉన్నారు. వీరు రహస్యంగా ఉగ్రకార్యకలాపాలకు మద్దతు ఇచ్చే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో దేశ భద్రత మరియు ఆధ్యాత్మిక సామరస్యాన్ని కాపాడటానికి పుష్కర్‌సింగ్ ధామి ప్రభుత్వం ఈ ఆపరేషన్ కాలనేమి చేపట్టిందికాలనేమి అనేది రామాయణంలోని ఒక రాక్షసుడి పేరు, రావణుడి ఆదేశంతో సాధువు వేషంలో హనుమంతుడిని మోసం చేయడానికి ప్రయత్నించిన వ్యక్తి. హనుమంతుడు అతని మోసాన్ని గుర్తించి సంహరించాడు. ఈ పురాణ కథ నుంచి ప్రేరణ పొంది, ఉత్తరాఖండ్ ప్రభుత్వం 'ఆపరేషన్ కాలనేమి' అనే పేరును ఎంచుకుంది. ఇది సాధువుల వేషంలో మోసాలు చేసే వ్యక్తులను గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఉద్దేశించబడిందిఉత్తరాఖండ్‌లో, ముఖ్యంగా చార్‌ధామ్ యాత్ర, కావడి యాత్ర సమయంలో, నకిలీ సాధువులు భక్తులను మోసం చేస్తున్నారు. వీరు డబ్బు కోసం భక్తులను బెదిరిస్తూ, తప్పుదారి పట్టిస్తూ, శాపనార్థాలు పెడుతున్నారు. ఈ మోసాలు భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీస్తూ, సనాతన ధర్మం పవిత్రతను కలుషితం చేస్తున్నాయి. ఈ సమస్యను గుర్తించిన ఉత్తరాఖండ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆధ్వర్యంలో, ఈ మోసగాళ్లను అరికట్టేందుకు ఆపరేషన్ కాలనేమిని ప్రారంభించిందిఆపరేషన్ కాలనేమి ద్వారా ఒక్క రోజులోనే 127 మంది నకిలీ సాధువులను అరెస్టు చేశారు. వీరిలో ఒక బంగ్లాదేశీయుడు కూడా ఉన్నాడు. ఈ వ్యక్తుల వద్ద నకిలీ ఆధార్ కార్డులు స్వాధీనం చేయబడ్డాయి, ఇది దేశ భద్రతకు సంబంధించిన ఆందోళనలను లేవనెత్తింది. ఈ చర్యలు డెహ్రాడూన్, హరిద్వార్, ఉధమ్ సింగ్ నగర్ జిల్లాలలో నిర్వహించబడ్డాయి. ఈ ఆపరేషన్ గతేడాది నుంచి ఉత్తరప్రదేశ్‌లో కూడా కొనసాగుతోంది.ఈ ఆపరేషన్ కేవలం మతపరమైన మోసాలను అరికట్టడానికి మాత్రమే కాకుండా, దేశ భద్రతను రక్షించడానికి కూడా ఉద్దేశించబడింది. నకిలీ గుర్తింపు కార్డుల ఉనికి, బంగ్లాదేశీ నాగరికుడి అరెస్టు అక్రమ ఇమ్మిగ్రేషన్, ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన ఆందోళనలను లేవనెత్తాయి. గతంలో గుజరాత్‌లో 550 మంది బంగ్లాదేశీ అక్రమ ఇమ్మిగ్రెంట్ల అరెస్టు ఈ సమస్య తీవ్రతను సూచిస్తుంది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈ ఆపరేషన్‌ను ఏ మతానికి పరిమితం చేయకుండా, మోసాలు చేసే ఎవరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అక్రమ సంబంధం అనుమానంతో దారుణం
## మహిలను స్థంభానికి కట్టిన వైనం



భీమవరం పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గుత్తులవారిపాలెంలో దారుణం చోటు చేసుకుంది. తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కోపంతో భార్య, ఆమె బంధువులు ఒక మహిళను సిమ్మెంటు స్తంభానికి కట్టి చిత్రహింసలు పెట్టారు.

విషయం పోలీసులకు తెలియడంతో పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని మహిళకు వైద్యం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి.మహిళపై దాడికి పాల్పడిన మహిళలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు..

## శ్రీధర్ ఆస్తుల చిట్టా... చాంతాడంతా...

హైదరాబాద్, జూలై 16, నీటిపారుదల శాఖలో రిటైర్డ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధరరావును అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. నిన్న ఏసీబీ అధికారులు పదిచోట్ల ఏకకాలంలో సోదాలు జరిపారు. ఆదాయానికి మించిన ఆస్తులున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. కోట్లాది రూపాయల అక్రమార్జన బయటపడిందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. మురళీధరరావును అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చి జైలుకు పంపారు. ఆయనను కస్టడీలోకి తీసుకుని మరింత విచారించే అవకాశముందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. మురళీధరరావు ఆస్తులు చూస్తే కళ్లు తిరగాల్సిందే. ఆయన ఆస్తుల విలువ నాలుగు వందల కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ లో విలువైన భూములు, ఇంటి స్థలాలలతో పాటు పవర్ ప్రాజెక్టు, ఖరీదైన ఫ్లాట్లు, ఇంటి స్థలాలు, విల్లాతో పాటు బంగారం, వెండి ఆభరణాలను ఉన్నట్లు కనుగొన్నారు. ఇక బ్యాంకు లాకర్లను కూడా తెరవాల్సి ఉంది. అది తెరిస్తే ఇంకా ఎన్ని ఆస్తులు బయటపడతాయోనంటున్నారు. హైదరాబాద్ లోని మోకిలాలో 6,500 చదరపు గజం స్థలం ఉంది. అలాగే హైదరాబాద్ శివార్లలో పదకొండు ఎకరాల సాగు భూమి కూడా ఉంది. జహీరాబాద్ లో టూ కేవీ సోలార్ పవర్ ప్రాజెక్టును కూడా మనోడు నిర్వహిస్తున్నాడు.. దీంతో పాటు బంజారాహిల్స్, యూసఫ్ గూడ, కోకపేట, బేగంపేట్లో నాలుగు ఫ్లాట్లు, నాలుగు ఇళ్లస్థలాలను ఉన్నట్లు సోదాల్లో ఏసీబీ అధికారులు కనుగొన్నారు.వరంగల్, కోదాడ ప్రాంతంలోనూ అపార్ట్ మెంట్లతో పాటు కొండాపూర్ లోని ఖరీదైన విల్లా ఉంది. అయితే లాకర్ ఓపెన్ చేస్తే మరిన్ని ఆస్తులు బయటపడే అవకాశముందని భావిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన మురళీధరరావు ఈఎన్సీగా చేసి రిటైర్ అయ్యారు. పదమూడేళ్ల పాటు నీటిపారుదల శాఖలో పనిచేసిన మురళీధరరావు ఆస్తులు మరెన్ని బయటపడతాయన్నది చూడాల్సి ఉంది. ఈ దాడుల్లో కీలక పత్రాలను కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మురళీధరరావు అన్ని ఆస్తులు అక్రమార్జనతో కొనుగోలు చేసినట్లు ఏసీబీ డీజీ విజయకుమార్ తెలిపారు. అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు.

# పెళ్లైన నాలుగు నెలలకే దంపతుల ఆత్మహత్య



హైదరాబాద్ పెళ్లైన నాలుగు నెలలకే దంపతుల ఆత్మహత్య!హైదరాబాద్‌లో అంబర్‌పేట పీఎస్ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. గోల్నాకలోని లక్ష్మీనగర్‌లో పవన్ కుమావత్, ఆసియా హసింఖాన్ 4 నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గతకొద్ది రోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ కారణంగానే బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వారు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయినట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

# యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ విస్తరణ

నల్గొండ, జూలై 17,తెలంగాణ రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో ముఖ్యమైన అడుగు వేసింది. ఘట్కేసర్ నుంచి యాదాద్రి వరకు 33 కిలోమీటర్ల దూరంలో మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ విస్తరణకు కేంద్ర రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టును సాధించేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.100 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేసింది.ఈ నిర్ణయంపై భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి రైల్వే మంత్రిత్వ శాఖకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు భువనగిరి ప్రజల భవిష్యత్‌కు సరికొత్త బాటలు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచో ఈ ప్రాజెక్టు కోసం డిమాండ్ వినిపిస్తోంది. ఏడాది ఏప్రిల్ నెలలో కూడా పార్లమెంట్‌లో ఈ అంశాన్ని కాంగ్రెస్ ఎంపీలు లేవనెత్తారు. జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ రూట్ పొడిగిస్తే యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి వెళ్లే భక్తులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వాదించారు. అప్పట్లో కాంగ్రెస్ ఎంపీలు వేసిన ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వివరణాత్మక సమాధానం ఇచ్చారు. కేంద్రం సహకారం పూర్తిగా ఉంటుందని అప్పుడే తెలిపారు. చెప్పినట్టుగానే ఇప్పుడు ఘట్కేసర్ నుంచి యాదాద్రి వరకు 33 కిలోమీటర్ల విస్తరణ ప్రాజెక్టును ఓకే చెప్పింది. ఈ ప్రాజెక్టుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.100 కోట్లు మొదటి విడతగా కేటాయించింది. ఈ నిధుల విడుదలతో పాటు, భూసేకరణ, ఇతర ముందస్తు పనులు వేగవంతం చేయడానికి అవకాశం కల్పించింది.

విస్తరణ రాష్ట్రంలో రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణిస్తున్నారు. ఈ 33 కిలోమీటర్ల ప్రాజెక్టు ద్వారా, ఘట్కేసర్ నుంచి యాదాద్రి వరకు సుస్థిర, వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ఈ మార్గం ప్రధానంగా యాదాద్రి దేవాలయానికి వెళ్లే లక్షల మంది భక్తులకు, సమీప ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది. ఈ ప్రాజెక్టు పూర్తైన తర్వాత, రోడ్డు రవాణా ఒత్తిడిని తగ్గిస్తుంది. ఈ ప్రాజెక్టు సమీప గ్రామాల్లోని ఆర్థిక వ్యవస్థను పుంజుకునేలా చేసి, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది.

ఈ మార్గం నిర్మాణం కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదు, రాష్ట్రంలో పర్యాటక రంగానికి కూడా కొత్త ఊపిరి పోసే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టును 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ. 330 కోట్లతో ప్రతిపాదించినప్పటికీ.. నిధుల కేటాయింపులో జాప్యం కారణంగా పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం మొత్తం వ్యయం రూ. 464 కోట్లకు చేరగా.. ఈ పనులను కేంద్ర ప్రభుత్వమే పూర్తిస్థాయిలో చేపట్టనుంది. రైల్వే అధికారుల అంచనా ప్రకారం రెండేళ్లలోపు ఈ పనులు పూర్తవుతాయిఎంఎంటీఎస్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి యాదాద్రికి ప్రయాణం గణనీయంగా సులభతరం అవుతుంది. కేవలం రూ. 20 టిక్కెట్‌తో సుమారు గంటలోపే యాదాద్రి ఆలయానికి చేరుకునే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. యాదాద్రి, జనగామ జిల్లా ప్రజలు సులువుగా హైదరాబాద్‌కు చేరుకోవచ్చు. కాగా, జనగామ వరకు ఎంఎంటీఎస్ పొడిగింపునకు మరోమారు కేంద్రంతో చర్చిస్తానని ఎంపీ చామల వెల్లడించారు.

ప్రస్తుతం మౌలాలి నుంచి ఘట్‌కేసర్ వరకు 21 కిలోమీటర్ల మేర కొత్తగా రెండు ఎంఎంటీఎస్ లైన్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఘట్‌కేసర్ నుంచి మరో 33 కిలోమీటర్ల మేర కొత్త లైను వేస్తే యాదాద్రి కనెక్టివిటీ పూర్తి అవుతుందని చెప్పారు.

# ఏ క్షణమైనా నోటిఫికేషన్

నిజామాబాద్, జూలై 17,. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఖరారుతో ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. హైకోర్టు ఆదేశాలతో సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీకి సంబంధించి ఐదు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం యోచిస్తున్నట్లు సమాచారం. మరి గ్రామీణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో వేచి చూడాల్సిందే..స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. మొత్తం 566 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు, అలాగే రాష్ట్రవ్యాప్తంగా 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఏ క్షణంలోనైనా జరగవచ్చునే సంకేతాలను వెలువడుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని తెలంగాణ ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖను ఆదేశించింది. ఎన్నికలకు అవసరమయ్యే సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని కూడా నిర్దేశించింది.సెప్టెంబర్ 30వ తేదీలోగా తెలంగాణలో స్థానిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేసింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన ఆర్డినెన్స్‌ను సిద్ధం చేసి ఇప్పటికే గవర్నర్‌కు పంపింది. గవర్నర్ ఆమోదం లభించిన వెంటనే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు అధికారికంగా తెరలేవనుంది.రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఐదు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. వర్షాకాలం, శాంతిభద్రతల పరిస్థితి, గిరిజన ప్రాంతాలకు పోలింగ్ సిబ్బంది రవాణా, పోలింగ్ మెటీరియల్ తరలింపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2019లో ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించగా, అప్పుడు వేసవి కావడంతో అది సాధ్యమైంది.ఇప్పుడు వర్షకాలం కావడం, దానివల్ల ఎదురయ్యే ఇబ్బందులను అంచనా వేసి ఈసారి ఐదు విడతల్లో నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల సమాచారాన్ని అందించిన వెంటనే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు కసరత్తు జరుగుతోంది. పోలింగ్ స్టేషన్లు, ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. ఐదు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల పోలింగ్ సిబ్బంది, పోలీసుల తరలింపు సులువు అవుతుందని, పర్యవేక్షణలోనూ ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. వర్షాల వల్ల రవాణాకు, ఓటింగ్‌కు ఆటంకం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయానికి వచ్చారు.

నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి పోలింగ్ వరకు మధ్య ప్రక్రియను పూర్తి చేయడానికి దాదాపు 15 రోజుల సమయం అవసరం. 2019 ఎన్నికల సమయంలో ఒక్కో దశకు నాలుగు రోజుల విరామం ఇవ్వగా, ఈసారి రెండు నుంచి మూడు రోజులు మాత్రమే ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల సమాచారం అందించిన తర్వాత, పోలీసు అధికారులతో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటారు. మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ రెండు ఎన్నికలకు ఒకే రోజు పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ ఎన్నికలు రాష్ట్రంలో గ్రామీణ, మండల స్థాయిలో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి మార్గం సుగమం చేయనున్నాయి.

## ఫారెస్ట్ కమిటీల ఏర్పాటు...

హైదరాబాద్, జూలై 17, తెలంగాణలో అటవీ విస్తీర్ణం ఏటా తగ్గుతూ వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 27,688 చ.కి.మీ. అటవీ విస్తీర్ణమే ఉందని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇది రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 24.69 శాతం మాత్రమే. ఇటీవల విడుదలైన ఫారెస్ట్ సర్వే రిపోర్ట్‌లో 2021 2023 మధ్య దాదాపు 100.42 చ.కి.మీ. అటవీ భూమి తగ్గినట్టు వెల్లడైంది. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం అటవీ విస్తీర్ణం పెంచాలని నిర్ణయించింది.ఓ వైపు వన మహోత్సవంలో భాగంగా చెట్ల పెంపకం చేపడుతూనే.. వాటి సంరక్షణకు కావాల్సిన చర్యల పై ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఒక కమిటీని కూడా నియమించింది. దేశవ్యాప్తంగా అటవీ భూముల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు ఇదివరకే పలు మార్గదర్శకాలను జారీ చేసింది. అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు భూముల గుర్తింపు కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) డాక్టర్ సీ సువర్ణ చైరపర్సన్ గా ఆరుగురు సభ్యులతో తాజాగా కమిటీని ఏర్పాటు చేసింది.ఈ కమిటీలో వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్స్, రిటైర్డ్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శంకరన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ) చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రతినిధి, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మాధవరావు, ఖమ్మం, రాజన్న జిల్లా అటవీశాఖ అధికారులను సభ్యులుగా నియమించింది. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అటవీ, అటవియేతర ప్రభుత్వ భూములను గుర్తించనుంది. ఒకవేళ ప్రభుత్వ భూము ల్లో చెట్లు, పొదలు ఉంటే దాన్ని డీమ్డ్ ఫారెస్ట్‌గా పేర్కొనుంది.అటవీ భూములను గుర్తించి, వాటిని డాక్యుమెంట్ చేయనుంది. రెవెన్యూ, అటవీ శాఖల అధికారుల సమన్వయంతో జాయింట్ సర్వేలు చేపట్టనుంది. అటవీ భూముల అక్రమణలను గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. అటవీ భూములను రియల్ ఎస్టేట్, మైనింగ్, ఇతర కార్యకలాపాల కోసం దుర్వినియోగం చేయకుండా, పోరంబోకు, రెవెన్యూ, దేవాదాయం, ఇతర ప్రభుత్వ భూములకు రక్షణగా ఈ కమిటీ రిపోర్ట్ నిలుస్తుందని సంబందిత అధికారులు పేర్కొంటున్నారు.అటవీ ప్రాంతంగా పరిగణించిన భూములు, అటవీ లక్షణాలు కలిగిన ప్రాంతం, అటవీ బయట ఉన్న భూములను గుర్తించడానికి ప్రభు త్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించింది. ఇలాంటి భూమి ఎవరి ఆధీనంలో ఉన్నా.. వాటిని అటవీ భూముల జాబితాలో చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది.అధికారికం గా అడవులుగా వర్గీకరించని ప్రాంతాలతో పాటు అడవు లుగా అర్హత ఉన్న భూములను గుర్తించి డ్యాక్యుమెంట్ చేయనుం ది. చట్టబద్ధంగా అటవీ ప్రాంతంగా ప్రకటించకపోయినా, వర్గీకరించకపోయినా అటవీ ప్రాంత లక్షణా లుంటే కమిటీ ఫీల్డ్ సర్వే చేసి డీమ్డ్ ఫారెస్ట్‌గా గుర్తించనున్నది.

# తెలంగాణలో స్థానిక సంస్థల సంఖ్య ఖరారు

హైదరాబాద్, జూలై 17, రాష్ట్రంలోని జెడ్పీ, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ స్థానాలపై తెలంగాణ ప్రభుత్వం ప్రకటన చేసింది. జడ్పీలు 31, ఎంపీపీలు 566, జడ్పీటీసీలు 566, ఎంపీటీసీలు 5,773, గ్రామపంచాయతీలు 12,778, వార్డులు లక్షా 12 వేలు ఉన్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను బుధవారం ఖరారు చేసింది. రాష్ట్రంలో మొత్తం 31 జడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు.. 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు వెల్లడించింది.రాష్ట్రంలో మొత్తం 12,778 గ్రామ పంచాయతీలు ఉండగా? 1.12 లక్షల వార్డులు ఉన్నట్లు ప్రభుత్వం వివరించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో వీటిపై ప్రకటన చేసింది.మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధం కావాలని పంచాయతీరాజ్ శాఖ సిబ్బందిని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ఎన్నికలకు అవసరమయ్యే సామాగ్రి అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది.

ఏర్పాట్లు ముమ్మరం

తెలంగాణలో స్థానిక ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. ఓవైపు ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకువేస్తుండగా? మరోవైపు ఏర్పాట్ల ప్రక్రియపై ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ప్రక్రియను కూడా పూర్తి చేసింది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే? షెడ్యూల్ విడుదల చేసేందుకు సిద్ధమైంది.రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ? ఈసారి పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకునే పనిలో పడింది. అయితే అధికారంలోకి రాకముందు నుంచే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిన ఆ పార్టీ?. కామారెడ్డిలో డిక్లరేషన్ కూడా చేసింది. కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీల రిజర్వేషన్లను పెంచుతామని ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా?. అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కులగణన చేపట్టింది. డెడికేషన్ కమిషన్ కూడా ఏర్పాటు చేసింది. అసెంబ్లీలో తీర్మానం కూడా చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్రానికి కూడా పంపింది.కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ఆర్డినెన్స్ జారీకి కేబినెట్ నిర్ణయించింది. అయితే శాసనసభ, మండలిలను ప్రొరోగ్ చేయకుండా ఆర్డినెన్స్ తీసుకురావడానికి నిబంధనలు అంగీకరించవు. ఈ నేపథ్యంలో?. శాసనసభ, మండలిలను ప్రొరోగ్ చేస్తూ గవర్నర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో త్వరలోనే ఆర్డినెన్స్ జారీ అయ్యే అవకాశం ఉంటుంది.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ ఆధారంగా? స్థానిక ఎన్నికల ప్రక్రియ మరింత వేగవంతమవుతుంది. ఆ వెంటనే రిజర్వేషన్లపై ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంటుంది. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ లకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారవుతాయి. అయితే గతంలో ఉన్న రిజర్వేషన్లే అమల్లో ఉంటాయా?? లేక ఏమైనా మార్పులు ఉంటాయా?? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.బీసీ రిజర్వేషన్ల పెంపుపై ఇచ్చే ఆర్డినెన్స్ నిలబడుతుందా అన్న చర్చ గట్టిగా తెరపైకి వస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు 50 శాతం రిజర్వేషన్లు దాటవద్దనే నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ తీసుకువచ్చే ఆర్డినెన్స్ పై అనేక అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కోర్టుల ముందుకు ఈ ఆర్డినెన్స్ నిలబడవనే విశ్లేషణలు తెరపైకి వస్తున్నాయి. బీసీల రిజర్వేషన్ల పెంపు బిల్లులను 9వ షెడ్యూల్ చేర్చి? పార్లమెంటు ఆమోదం పొందే దిశగా ముందుకెళ్తే తప్పు? రిజ్వేషన్ల పెంపు సాధ్యం కాదని పలువురు చెబుతున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉంది. ఈ నేపథ్యంలో ఇదే బిల్లుకు సంబంధించి ఆర్డినెన్స్ ఇవ్వొచ్చా అన్న చర్చ కూడా తెరపైకి వస్తోంది.ప్రస్తుత గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 12,777 గ్రామ పంచాయతీలున్నాయి. 5,982 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, 585 జడ్పీటీసీ స్థానాలు ఉండగా? వీటన్నింటికి ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆర్డినెన్స్ జారీ తర్వాత? ఎన్నికల ప్రక్రియ వేగవంతమయ్యే అవకాశం ఉంటుంది. మరోవైపు సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఒక వేళ ఆర్డినెన్స్ జారీపై న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తుతే?. ప్రభుత్వం ఎలా ముందుకెళ్తోందనేది కూడా చర్చనీయాంశంగా మారింది?!రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ? ఈసారి పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనుంది. క్షేత్రస్థాయిలో ఉన్న నేతలు కూడా?. పార్టీ గెలుపు కోసం కృషి చేసే దిశగా అడుగులు వేసే పనిలో ఉన్నారు. హస్తం జెండా ఎగరవేయటమే లక్ష్యంగా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పావులు కదిపేస్తున్నారు. షెడ్యూల్ వచ్చే నాటికే గ్రౌండ్ క్లియర్ గా ఉండాలని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తోంది. ఇక అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకోని స్థానిక పోరులో సత్తా చాటాలని బీఆర్ఎస్ తో పాటు బీజేపీ చూస్తున్నాయి.రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని ఆశావాహులు పావులు కదిపేస్తున్నారు. రిజర్వేషన్ల ఖరారుపై స్పష్టత రాగానే? మరింత దూసుకెళ్లాలని భావిస్తున్నారు. చాలా రోజులుగా గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. గెలుపు కోసం అవసరమైన అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈసీ నుంచి ప్రకటన వెలువడితే? పల్లెల్లో పొలిటికల్ హీట్ మరింత పెరగనుంది.రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లోని సర్పంచ్ లో పదవీ కాలం గతేడాది జనవరి 31వతో ముగిసింది. ఆ తర్వాత నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. 2024 జూన్ మాసంలోనే ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీ కాలం కూడా ముగిసింది. ఈ స్థానాలకు కూడా ఎన్నికలు జరగాల్సి ఉంది. పదవీకాలం ముగిసిన తర్వాత వెంటనే నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ? ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఆ తర్వాత కుల గణన కార్యక్రమం చేపట్టడంతో ఆలస్యమైంది

# సమాజంలో జర్నలిస్టులు ప్రధాన భూమిక పోషిస్తున్నారు

### సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లండి

### మంత్రి ఇవ్వాలనుకుంటే గంటలో జర్నలిస్టులకు ఇల్లు




కొల్లాపూర్ ప్రజా సమాజంలో జర్నలిస్టులు ప్రధాన భూమిక పోషిస్తున్నారని అది గమనించి పాలకులు వెంటనే వీరి సమస్యను పరిష్కరించాలని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ రాష్ట్ర నాయకులు పరిపూర్ణం తెలిపారు

గురువారం కొల్లాపూర్ నియోజక వర్గంలోని టిడబ్ల్యూజేఎఫ్ తాలూకా కన్వీనర్ జలకం మద్దిలేటి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆర్డీవో కార్యాలయం ఎదుట 23 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు దీక్షలకు మద్దతుగా నవతెలంగాణ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా మేనేజర్ కార్తీక్ వెంకటస్వామి దర్వేష్ మాధవరెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా వివిధ సంఘాల జర్నలిస్టులు సంఘీభావం తెలియజేశారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ




జర్నలిస్టులు సమాజంలో ప్రధాన భూమిక పోషిస్తున్న వారికి సమస్యలు వచ్చినప్పుడు పాలకులు పట్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల వార్తలు ఎన్నికల్లో ప్రతిరోజు వార్తలు రాస్తూ వస్తున్న జర్నలిస్టులను ఒక పార్టీకి అంటగట్టడం సరైన పద్ధతి కాదన్నారు బిపిఎల్ అన్నది ప్రధానంగా మీరు తీసుకుంటే బిపిఎల్ ఎవరికి ఏ ప్రాతిపదికన ప్రభుత్వం ప్రజలను గుర్తిస్తుందో మీరు చెప్పాలన్నారు

మీ ఓట్ల రాజకీయాల కోసం మీ ప్రచారం కోసం జర్నలిస్టులను అవమానపరిచే విధంగా ప్రజల్లో అపోహలు తెచ్చే విధంగా మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలని పాలకులకు సూచించారు

మీకు చిత్తశుద్ధి ఉంటే జర్నలిస్టులపై అభిమానం ఉంటే మీరు అనుకుంటే గంటలో పూర్తయ్యే ఇళ్ల సమస్యలను రాజకీయాల పేరుతో అంటగట్టకుండా ఎమ్మార్వో ఆర్డీవో లకు పిలిపించుకొని నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను వెంటనే కేటాయించే విధంగా నిర్ణయాలు తీసుకోగలిగే స్థానంలో పాలకులుగా మీరున్నారు అలాంటప్పుడు ఎందుకు వీరిని నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ప్రశ్నించారు నేడు జడప్రోలు కోస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లేందుకు మూడు దశాబ్దాల సమస్యను వారికి వివరించేందుకు వినతి పత్రం అందివ్వాలని అందుకు అందరు సిద్ధం కావాలని వారి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో దీక్షలు చేపట్టిన జర్నలిస్టులు జిల్లా నాయకులు ఎస్పీ మల్లికార్జున సాగర్ సీనియర్ జర్నలిస్టులు బి కురుమయ్య కారంగి గోవిందు మల్లయ్య భాను స్వాములు జల్లాపూర్ సురేందర్ రజిని బాబు రమేష్ తదితరులు పాల్గొన్నారు



# పారిశ్రామికవేత్తలుగా మహిళలు ఎదగాలి.

మహిళల ఆర్థిక అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యం.

మహిళల పేరు మీదే రేషన్ కార్డ్, ఇందిరమ్మ ఇండ్ల జారీ.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్.





**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, మహిళలు ఆర్థిక అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం రోజున వేములవాడ పట్టణంలో డిఆర్డిఏ, షర్ఫ్ అధికారంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళలు సమైక్య సంఘాలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజ్, ఇటీవల మరణించిన మహిళా సంఘ సభ్యుల ప్రమాద బీమా చెక్కులను వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నారని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తద్వారా మహిళలకు వడ్డీరేని రుణాలు మంజూరు చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారని తెలిపారు. ఆనాడు ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మేలు జరిగితే మళ్ళీ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళ తల్లులకు పెద్దపీట వేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీ రుణాలు మంజూరు చేశారని, ఐకెపి కేంద్రాలను ప్రారంభం చేసి మహిళలకు ఆర్థిక స్వలంబన దిశగా ప్రోత్సాహం అందించారని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో మహిళలకు 20వేల పైచిలుకు కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు.

గత ప్రభుత్వం మహిళా సంఘాలను ఏమాత్రం పట్టించుకోలేదని చివరికి మూడు సంవత్సరాలు వడ్డీని ఎగ్గొట్టినట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తున్నామని తెలిపారు.

గత పాలకుల హాయంలో నిర్లక్ష్యం చేసిన వడ్డీలేని రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్ధరించామని తెలిపారు. 93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రములో సన్నబియ్యం, రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.

25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయలు జమ చేస్తామని అన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచి తొమ్మిది రోజులలో తొమ్మిది వేల కోట్ల రూపాయలు జమ చేస్తామని, రైతు బీమాకు 3000 కోట్లు అందించామని అన్నారు.

వేములవాడ నియోజకవర్గ పరిధిలో ఐకెపి నుండి గత సీజన్లో 63 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో 177 కోట్ల విలువగల 76,38,877 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని తద్వారా జిల్లా మహిళా సమైక్య సంఘాలకు 17 లక్షల 48 గ్రామ ఐక్య సంఘాలకు ఒక కోటి 55 లక్షల కమిషన్ రావడం జరిగింది అని తెలిపారు.

ఇందిరా అమ్మాయిల శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు వారు ఆర్థికంగా ఎదగాలని మైక్రో ఎంటర్ప్రైజెస్, మహిళా శక్తి స్టిచ్చింగ్ సెంటర్స్, ఈవెంట్ మేనేజ్మెంట్ యూనిట్లో, సోలార్ పవర్ ప్లాంట్, డైరీ యూనిట్స్ వంటి వాటిని ఏర్పాటు చేయడం కోసం బ్యాంకు లింకేజీ వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగింది అని తెలిపారు.

వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో అయ్యప్ప, శ్రీ ఆదర్శ గ్రామ సంఘాలకు సంబంధించిన నాలుగు ఎకరాల భూమిలో నాలుగు కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదన సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. 36 లక్షలతో మహిళా సమైక్య సంఘానికి ఆర్టిసి బస్సు కొనుగోలు చేసి అందజేయడం జరిగిందని తెలిపారు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లింకేజీ ద్వారా 20084 కోట్లు,2025-26 సంవత్సరానికి 58 కోట్లు బ్యాంకు లింకేజీ అందజేయడం జరిగిందని తెలిపారు.4350 సంఘాలకు ఐదు కోట్ల 72 లక్షల వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

మహిళా సంఘాల సభ్యురాళ్లకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన లోన్ బీమా ప్రమాద బీమా స్కీం వలన ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రమాదవశాత్తు ఎవరైనా సంఘ సభ్యులు చనిపోతే వారు తీసుకున్న రుణ మాఫీ తో పాటు పదిలక్షల వరకు ఇన్సూరెన్స్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు.

లోన్ బీమా, ప్రమాద బీమా వంటి పథకాలను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆలోచించలేదని అన్నారు. ఇప్పటివరకు వేములవాడ నియోజకవర్గంలో 37 మందికి 40.43 లక్షల మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.

వేములవాడ నియోజకవర్గ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి ఆశీర్వాదాలు అందజేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ శేషాద్రి, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, చిలుకల తిరుపతి, కచ్చకాయల ఎల్లయ్య, అన్ని మండలాల ఏ పి ఎం లు, మహిళా సమాఖ్య సంఘ అధ్యక్షురాలు, మహిళా సంఘ సభ్యులు

## తెలంగాణ రాష్ట్ర వాయిద్య కళాకారుల సంఘం సమావేశం

## సలహా దారులుగా ఏం.డి తాజుద్దీన్ బాబా, పీర్ మహ్మద్





**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 17:**తెలంగాణ రాష్ట్ర వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని సిటిజన్ ఫంక్షన్ లో జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిలుగా తెలంగాణ సాంస్కృతిక సారథి మండలి కి చైర్మన్ శ్రీమతి వెన్నెల గద్దర్, తెలంగాణ రాష్ట్ర వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఏం. వి రమణ లు హాజరయ్యారు. ఈ సదస్సులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మందమర్రి కి చెందిన మంచిర్యాల జిల్లా బ్యాండ్ కళాకారుల జనరల్ సెక్రెటరీ ఎం.డితాజుద్దీన్ బాబా, నస్పూర్ మండలానికి చెందిన ఫిర్ మహమ్మద్ తెలంగాణ రాష్ట్ర వాయిద్య కళాకారుల సంఘంకు సలహా మండలి సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరిద్దరి ఎంపికతో మంచిర్యాల జిల్లాలో బ్యాండ్ కళాకారులందరూ సంబరాలు చేసుకుంటున్నారు.

# అంబేద్కర్ విగ్రహాలపై దాడి చేస్తే ఊరుకోము

## రాజ్యాంగ రచయితను అవమానించడం సరికాదు

## అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జూలై 17 :** అంబేద్కర్ విగ్రహాలపై దాడిచేస్తే ఊరుకునేది లేదని, రాజ్యాంగ రచయితను అవమానించడం సిగ్గుచేటని,సబ్బండ వర్గాలకు సమాన హక్కులు ప్రసాదించించిన ప్రదాత బాబా సాహెబ్ అంబేద్కర్ అని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు పేర్కొన్నారు.గురువారం పట్టణంలోని ఆ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ...నాగర్ కర్నూల్ జిల్లాలో అంబేద్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.కొంతమంది అంబేద్కర్ ను అర్థం చేసుకోకుండా,అంబేద్కర్ ను చదవకుండా,వ్యతిరేకత పెంచుకోవడం సరికాదన్నారు.ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలంన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నర్సయ్య,మండల ఉపాధ్యక్షులు భైరం లింగన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్,లింగంపల్లి సుధాకర్,ఆక్కినపల్లి సిల్పతి,పెండెం రాజశేఖర్, అలుగునూరి నరేష్,దుంపల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేటలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ-2025 బృందం పర్యటన.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట,( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట గ్రామాన్ని గురువారం రోజున ఎంపీడీవో సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలోని నివాస గృహాలను సర్వే చేసి వారు మరుగుదొడ్లను వాడుతున్నారా, పరిశుభ్రంగా ఉంచుకుంటున్నారా, అదేవిధంగా వాడిన నీటిని ఏ విధంగా నిర్వహిస్తున్నారు, ఇంకుడు గుంతకు పంపిస్తున్నారా, కిచెన్ గార్డెన్ మరలిస్తున్నారా, లేదా డ్రైనేజీలోకి పంపిస్తున్నారా, ఇంటిలోని చెత్తను తడి పొడి చెత్తగా వేరు చేస్తున్నారా, అనే అంశాల పైన గృహస్థాయిలో సర్వే నిర్వహించారు. దీనితో పాటు గ్రామంలోని పబ్లిక్ ప్రదేశాలు, పాఠశాల, అంగన్వాడి, హెల్త్ సెంటర్, ప్రార్థన ప్రదేశాలను పరిశీలించారు. గ్రామస్థాయిలో మురికి కాలువల పరిస్థితి, నిర్మాణంలో ఉన్నాయా, మురుగు కాల్వ, చివర ఇంకుడు గుంతలు నిర్మించారా, గ్రామంలోని గృహాల నుండి సేకరించిన తడి పొడి చెత్తను గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా సేకరించి కంపోస్ట్ షడ్ కు తరలించి కంపోస్ట్ షెడ్డులో మరల చెత్తను వేరు చేసి పొడి చెత్తను ఆరు రకాలుగా వేరుచేసి, స్క్రాప్ డీలర్ కు విక్రయిస్తున్నారా, తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువుగా తయారు చేస్తున్నారా, వినియోగించిన సానిటరీ ఫ్యాట్స్ మరియు హానికర చెత్త నిర్వాణ కోసం ఏర్పాట్లు ఉన్నాయా, అనే అంశాలపై సర్వే నిర్వహించారు. గ్రామ



పంచాయతీలోని ట్రాక్టర్కు లాంగ్ బుక్, తడి పొడి చెత్త సేకరణ నిర్వహణ, వి డాల్ యు, ఎస్సీ ఎకౌంటు పాస్బుక్ మొదలై నటువంటి ను పరిశీలించారు. అన్ని పరిశీలించిన అనంతరం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారికి నివేదికను పంపిస్తారు ఇందులో స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ కన్సల్టెంట్ కే.సురేష్, ఎంపీడీవో, ఎంపీ ఓ బృందం సభ్యులు పి. అనూష, ఎన్. శిరీష, ఏపీ ఓటి ఎన్ ఎస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా భుక్యా చాత్రు బాధ్యతల స్వీకరణ



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జూలై 17 :** జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా భుక్యా చాత్రు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. భుక్యా చాత్రు గతంలో కరీంనగర్ జిల్లా వ్యవసాయ శాఖ ఉప సంచాలకులుగా పని చేశారు.

## గిరిగేట్పల్లి, లో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మెతుకు ఆనంద్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జులై 17(ప్రజాబలం)**వికారాబాద్ జిల్లా:గిరిగేట్ పల్లి గ్రామంలో గల ఎల్లమ్మ తల్లి మరియు పోచమ్మ తల్లి దేవాలయాల్లో జరిగిన విగ్రహ ప్రతిష్టాపన పూజ కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులతో కలిసి హాజరైన వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్,పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్లి భక్తి శ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు పూజా కార్యక్రమం అనంతరం ప్రజలందరితో సంతోషంగా ఆప్యాయంగా మాట్లాడి ప్రతి ఒక్కరూ దైవచింత కలిగి ఉండాలని తెలిపారు .

# అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ విప్ అది.

నూతన రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది.
రేషన్ కార్డుతో పేద కుటుంబాలకు 10 లక్షల కవరేజితో ఆరోగ్యశ్రీ లబ్ధి.
వేములవాడ పట్టణం లోని రాజరాజేశ్వర గార్డెన్లో నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్.







**వేములవాడ టౌన్, ( ప్రజాబలం )**, రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని. ఇందులో భాగంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

గురువారం రోజున ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు తో కలిసి వేములవాడ పట్టణంలో గల గార్డెన్లో వేములవాడ రూరల్, అర్బన్ మండలాలకు చెందిన కబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని అన్నారు. పేద ప్రజలకు రేషన్ కార్డు ఒక గుర్తింపు కార్డుగా మారిందని, దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు రేషన్ కార్డుతో పాటు గత ఉమ్మడి రాష్ట్రంలో రెండు లక్షల రూపాయలు ఆరోగ్యశ్రీ బీమా కార్డు అప్పటి ప్రభుత్వం అందించిందని, ప్రస్తుతం మన ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డు పొందిన ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య శ్రీ పథకం వర్తిస్తుందని అన్నారు.

పేద ప్రజలు అనారోగ్యంతో బాధపడితే కార్పొరేట్ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందే అవకాశం లభించింది అని అన్నారు. నేడు వేల సంఖ్యలు వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయడంలో కృషిచేసిన అధికారులకు ప్రభుత్వ విప్ అభినందనలు తెలిపారు.

రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా చేయడం ఉగాది నుంచి ప్రారంభించామని, దీనితో రేషన్ కార్డు ప్రాముఖ్యత గణనీయంగా పెరిగిందని అన్నారు. రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారుల భవిష్యత్తులో అరువులకు ఇందిర మైండ్లు మంజూరు చేసి నిర్మాణానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నామని అన్నారు.

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించే వారిని పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. మహిళా సంఘాలలోని మహిళలకు 10 లక్షల రూపాయలు ప్రమాద బీమా, రెండు లక్షల రూపాయల లోన్ బీమా కల్పించామని అన్నారు. పెట్రోల్ బంక్, ఆర్టీసీకి అద్దె బస్సుల్లో ఏర్పాటు, సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు అనేక రంగాలలో స్వయం సహాయక మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని, ఆదాని, అంబానీలకు పోటీగా మన మహిళలు వ్యాపారాలు చేస్తున్నారని అన్నారు.

కనిక రాష్ట్రం తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని ప్రభుత్వ విప్ ధ్వజమెత్తారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హాయంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పది లక్షల రూపాయలకు పెంపు, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామని అన్నారు. ఆరోగ్యశ్రీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఫ్లీజ్ రియంబర్స్మెంట్ వంటి పథకాలను కొనసాగిస్తూ ఆధారంగా పేదలకు 2 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు.

500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, 25 లక్షల రైతులకు రెండు లక్షల వరకు పంట రుణమాఫీ, సన్న వడ్లకు క్వింటాల్కు 500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలలో 40 శాతం డైట్ చార్జీలు, 200% కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు.

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు మాట్లాడుతూ.

వేములవాడ అర్బన్ మండలంలోని 353, రూరల్ మండలంలో 174 నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, వీటి ద్వారా దాదాపు 3,000 మంది పేదలకు అదనంగా రేషన్ అందుతుందని అన్నారు. ప్రజల జీవనంలో రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్, ఆధార్ కార్డు, కరెంట్ కలెక్షన్, ప్రభుత్వ పథకాల అమలు అంటే అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు.

సిరిసిల్ల జిల్లాలో నూతనంగా 14 లబ్ధిదారులకు రేషన్ అందించేందుకు కార్డులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు అదనంగా 6 కిలోల సన్న బియ్యం రేషన్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. నువ్వు తండ్రి రేషన్ కార్డు ద్వారా ఇందిర ఇండ్లు, పింఛన్ వంటి అనేక సంక్షేమ పథకాలు అర్హత వస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ కమిటీ మార్కెట్ చైర్మన్ రాజు, డి ఎం సివిల్ సప్లై రజిత, తాసిల్దారులు, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు త్వరితగాంచిన పూర్తి చేసుకోవాలి.

గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులు నిర్వహించాలి.
కలెక్టర్ సందీప్ కుమార్ ఝు.
సనుగుల, రామారావు పల్లెలో ఆకస్మిక తనిఖీ.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, చందుర్తి, ( ప్రజాబలం ),** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకొని, ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝు పిలుపునిచ్చారు. చందుర్తి మండలం లోని రామారావు పల్లె గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న ఇద్దరమ్మా ఇంటి నిర్మాణ పనులను కలెక్టర్ గురువారం రోజున పరిశీలించి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువగా తిరగడం గమనించిన కలెక్టర్, వాటిని నియంత్రించాలని పంచాయతీ సెక్రటరీ, ఆదేశించారు.

గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులు నిర్వహించాలి.

సనుగుల గ్రామపంచాయతీ పరిధిలో రహదారుల వెంట ఇరువైపులా గడ్డి, నిరుపయోగ మొక్కలు పెరగడం, రహదారి వెంబడి వర్షపు నీరు ఉండడానికి కలెక్టర్ పరిశీలించారు. రోడ్ల వెంట గడ్డి, ఇతర మొక్కలు వెంటనే తొలగించాలని, నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో అవసరమైన చోట్ల సిసి రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదన సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నిబంధన ప్రకారం ఎరువులు, విత్తనాలు విక్రయించాలి.

స్టాక్, సేల్స్ రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలి.
నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.
కలెక్టర్ సందీప్ కుమార్ ఝు.
చందుర్తి మండలం లోని ఎరువులు, విత్తనాల దుకాణాలు, పిఎసిఎస్ లు ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, చందుర్తి, ( ప్రజాబలం ),** నిబంధనల ప్రకారం ఎరువులు, విత్తనాలు విక్రయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝు ఆదేశించారు. చందుర్తి మండలం లోని మర్రిగడ్డ శ్రీ పవన కుమార్ ఫర్టిలైజర్ దుకాణం, చందుర్తి మండల కేంద్రం సనుగుల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ శాఖ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాలు, దుకాణాలలో నిలువలు పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలోని సేల్స్, స్టాక్ రిజిస్టర్ పరిశీలించి గోదామును తనిఖీ చేశారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు అందజేయాలని సూచించారు. కృత్రిమ కుర్తా సృష్టిస్తే కఠన్ చర్యలు ఉంటాయని యజమానులకు కలెక్టరు హెచ్చరించారు.

ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్, రిమాండ్ కు తరలింపు.

250 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం.
అక్రమంగా గంజాయి సేవించిన, క్రయవిక్రయాలు జరిపిన, కఠిన చర్యలు తప్పవు.
వివరాలు వెల్లడించిన వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** వేములవాడ రూరల్ సిఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం సుల్తానాబాద్ కు చెందిన వేముల శ్రీనివాస్, వేముల విజయలక్ష్మి అనే భార్యాభర్తలు మహారాష్ట్రలోని చంద్రపూర్ నుండి గంజాయి కొనుగోలు చేసి గంజాయి కి అలవాటు పడిన వారికి ఎక్కువ ధరలకు అమ్ముతూ వాటితో జల్సాలు చేస్తుండేవారు. సిరిసిల్ల జిల్లాలో గ్రానైట్ కార్మికులకు ఎక్కువ రేటుకు గంజాయి అమ్ముచున్నారని, అందులో భాగంగా బోయినపల్లి మండలం కోరేం గ్రామ శివారుకి వస్తున్నారన్న సమాచారం మేరకు బోయినపల్లి ఎస్సై తన సిబ్బందితో అక్కడికి వెళ్ళగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద250 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. అక్రమంగా గంజాయి సేవించిన, క్రయవిక్రయాలు జరిపిన, కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. యువత డ్రగ్స్ బారిన పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి జిల్లాలో స్పెషల్ డ్రైవ్ లు, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తూ, అక్రమ గంజాయి రవాణాపై జిల్లా పోలీస్లు ప్రత్యేక దృష్టి సారించి ఉక్కు పాదం మోపుతున్నారని తెలిపారు. జిల్లాలో గంజాయి కి సంబంధించిన సమాచారం సంబంధిత పోలీసువారికి సమాచారం అందించి గంజాయి రహిత జిల్లాగా మార్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పోలీసులు కోరారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో నికర ఆదాయం – ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్.





**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ),** ఆయిల్ ఫామ్ సాగుతో నికర ఆదాయాన్ని పొందవచ్చు అని రాష్ట్ర ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి. శేఖర్ రైతులకు సూచించారు. గురువారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మరల పేట గ్రామంలో గల ఆయిల్ పంప్ తోటలను సందర్శించి ఆయిల్ ఫామ్ గెలల కోతను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సోదరులకు ఆయిల్ ఫామ్ పంటపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రతి రైతుకు కేవలం 20 రూపాయలకే ఒక మొక్క అందిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక ఎకరాకు 4,200/- సబ్సిడీని, డ్రిప్ పరికరాలను, ఎస్సీ, ఎస్టీలకు 100%, బిసి, చిన్న కారు రైతులకు 90%, ఓసీలకు 80 శాతం రాయితీపై అందిస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో ఎకరాకు ఏడాదికి నికరంగా 1,50,000/- ఆదాయం పొందవచ్చు అన్నారు. మన జిల్లాలో ఆయిల్ సాగుకు అనుకూలమైన నేలలు, మీరు అందుబాటులో ఉన్నందున రైతులు ముందుకు రావాలని కోరారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి లత మాట్లాడుతూ మన జిల్లాకు ఈ సంవత్సరం ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యం 2000 ఎకరాలు, అయితే ఇప్పటికే పెద్ద ఎత్తున రైతులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి లోకేష్, గోవర్ధన్, ఏవో ప్రణతి, ప్రినిక్ కంపెనీ జిల్లా మేనేజర్ ప్రేమ్ సాయి, ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, ఏ ఈ ఓ లు పాల్గొన్నారు.








# టాస్క్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి 17 :** టాస్క్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ ప్రాధాన్యత రంగాలలో నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని టాస్క్ కేంద్రాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, టాస్క్ రీజనల్ సెంటర్ మేనేజర్, జి.సాయికుమార్ లతో కలిసి ప్రపంచ యూత్ స్కిల్ డే పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...టాస్క్ కేంద్రం ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఉచితంగా అందించి వివిధ ఉపాధి, ఉద్యోగాలలో రాణించేలా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.ఈ నెల 15వ తేదీన ప్రపంచ యూత్ స్కిల్ డే సందర్భంగా చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ పోటీలలో గెలుపొందిన మేఘన- చిత్రలేఖనం,అంజలియాదవ్-వ్యాసరచన లకు బహుమతులు అందించడం జరిగిందని తెలిపారు. టాస్క్ ద్వారా అందిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట.

**పలు వ్యాపారుల్లో మహిళలు ఆర్థికంగా ఎదుగాలి.**
**మహిళల పేరు మీదే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు.**
**మహిళా సంఘాలలో నూతన సభ్యులను చేర్పించాలి. మంత్రి సీతక్క.**



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) జూలై 17 :** రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించి ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నదని, మహిళలు ఆర్థికంగా లబ్ధి పొందడానికి ప్రతి మహిళను సంఘాలలో సభ్యులుగా చేర్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.
గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అదనపు సి ఈ ఓ సేర్ఫ్ పి. కట్యాయని దేవి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ లతో కలిసి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ భీమా, ప్రమాద చెక్కులను పంపిణీ చేసారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఇందిరమ్మ కళలను నెరవేర్చడానికి పలు పథకాలను అమలు చేయడం జరుగుతుందని,
మహిళా జీవితాల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుంటూ సంబరాలు చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నామని అన్నారు.
ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు దాదాపు 26 వేల కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజ్ రుణాలు పంపిణీ చేశామని అన్నారు.
రాష్ట్రంలోని మహిళా సంఘాలకు లక్షల కోట్లు కేటాయించడంతో పాటు వడ్డీ రుణమాఫీ చేసిన ఘనత తమ దేనని, మహిళలు అన్ని రంగాలలో రాణించడానికి పలు సంక్షేమ ఫలాలను అమలు చేయడంతో పాటు పలు రంగాలలో రాణించడానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కన్నా ప్రైవేట్ రంగంలో పలు వ్యాపారంలో మహిళలు రాణించడానికి అవకాశం ఉందని, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ములుగు జియోజకవర్గం లో 9 మండల సమాఖ్యలు, 330 గ్రామ సమాఖ్యలు, 6 వేల 904 స్వయం సహాయక సంఘాలు, 69,736 స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొంటున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా కృషి చేయడానికి బ్యాంకు లింకేజీల ద్వారా 2024- 25 ఆర్థిక సంవత్సరంలో 249.07 కోట్ల రూపాయల రుణాలను అందించడం జరిగిందని, 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గాను 618 స్వయం సహాయక సంఘాలకు 54.79 కోట్ల రుణాలను అందించడం జరిగిందని వివరించారు.
బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన 5109 స్వయం సహాయక సంఘాల లోని సభ్యులకు మహిళా 884.53 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించడం జరిగిందని, 5212స్వయం సహాయక సంఘాల లోని 52615 మంది సభ్యులకు 10 కోట్ల 74 లక్షల వడ్డీ లేని రుణాలను మహిళా శక్తి సంబరంలో అందించడం జరిగిందని తెలిపారు.
మహిళల ఆర్థిక స్వలంబం కోసం ఇప్పటికే ఆర్టీసీ బస్సులను అందజేయడంతో పాటు లోన్ బీమా పథకం, ప్రమాద బీమా పథకం ఏర్పాట్లు, కొత్త సంఘాల ప్రారంభం, స్త్రీ నిధి రుణాలు అందజేయడం, మైక్రో ఎంటర్ప్రైజెస్, పాడి గేదెల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం, పౌల్ట్రీ మదర్ యూనిట్, సంచార చేపల విక్రయ కేంద్రం, వ్యవసాయ అనుబంధ జీవనోపాధి కల్పన కోసం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లో ఏర్పాటు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు తదితర కార్యక్రమాలను మహిళా సంఘాల చే నిర్వహించడం జరుగుతుందని వివరించారు.
గతంలో ఎన్నడు లేని విధంగా మహిళలు అన్ని రంగాలలో ఆర్థిక అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిక్షత తో ఉందని మంత్రి తెలిపారు.
ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ వంటి వివిధ వ్యాపారాలు చేయడం వల్ల నెలకు మహిళలకు అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు.
ఆర్టిసి కు పెట్టిన అద్దె బస్సు ద్వారా నెలకు 75 వేల రూపాయల ఇస్తున్నామని అన్నారు.
మహిళా సంఘాలకు అందించిన రుణాలు 99 శాతం తిరిగి చెల్లిస్తున్నామని అన్నారు. బ్యాంకులు నేడు మహిళా సంఘాలకు క్యూ కట్టి రుణాలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు.
మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల రూపాయల అందిస్తున్నామని అన్నారు. మహిళ సభ్యులు సాధారణంగా మరణిస్తే 2 లక్షల రూపాయల వరకు లోన్ బీమా అమలు అవుతుందని అన్నారు.
60 సంవత్సరాల నిండిన వారిని కూడా మహిళా సంఘాలలో చేర్చాలని, 15 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ సంఘంలో ఉండేలా చూడాలని అన్నారు. మహిళా సంఘం సామాజిక భరోసాగా పని చేయాలని అన్నారు.
మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆ కుటుంబం ఎదగడానికి దోరపడుతుందని ప్రతి మహిళ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.
మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం.
భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు.
మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు.
ఈ సందర్భంగా భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, గత పాలకుల హయాంలో నిర్లక్ష్యం చేసిన వడ్డి లేని రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్దరించామని అన్నారు.
మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. మహిళల చేతిలో డబ్బులు ఉండాలని లక్ష్యంతో ఇందిరమ్మ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు.



పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. మహిళల ఆశీర్వాదం ఉంటే ప్రభుత్వం చల్లగా ఉంటుందని అన్నారు.
ప్రభుత్వ పథకాలతో జిల్లాలో మహిళలు అభివృద్ధి.
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం లక్ష రూపాయల ఆర్థిక సాయం.
జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.
రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నామని, మహిళా సంఘాల్లో ఉన్న మహిళలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన మహిళలు ఆర్థికంగా పెట్టుబడి పెట్టని పరిస్థితిలో ఉన్న మహిళలకు లక్ష రూపాయల ముందస్తు రుణాలను ముందస్తు అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కలెక్టరేట్, రామప్ప, ఐటీడీఏ, బోగత జలపాతం, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేశామని, రానున్న రోజులలో లక్నవరం, బ్లాక్ బెర్రీ పర్యటక ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని అన్నారు. జిల్లాలోని మహిళా సంఘాల మహిళలకు ఇప్పటివరకు 300 కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేయగా, 10 కోట్ల రూపాయల వడ్డీ రుణాలను వారి ఖాతాలోని జమ చేయడం జరిగిందని వివరించారు. రానున్న రోజులలో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న ములుగు జిల్లాలో మహిళలు అన్ని రంగాలలో ఆర్థికంగా ఎదగడానికి వినూత్న కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.
అనంతరం ఇంద్ర మహిళా శక్తి సంఘ సభ్యులకు వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ భీమా, ప్రమాద చెక్కులను పంపిణీ చేసారు.
మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో 4 గురికి కుట్టు మిషన్లను మంత్రి సీతక్క అందచేశారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, సంబంధిత అధికారులు, మండల సమాఖ్య సభ్యులు, ఏ.పి.ఎం.లు, మహిళలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ పంటల సాగుకు సింగూరు జలాల విడుదల

## రెండు పంటల క్రాప్ హాలిడే తర్వాత నీటిని విడుదల చేసిన మంత్రి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి( జులై 17 ప్రజాబలం )**సంగారెడ్డి జిల్లా : ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయినా సింగూరు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా, గడిచిన రెండు పంటలకు నీరు విడుదల చేయకపోవడంతో, ఇటు వర్షాలు పడకపోవడంతో, రైతన్నలు అధికారులపై ప్రభుత్వంపై ఆగ్రహంతో నిరాశకు గురైన రైతన్నలకు, కళ్ళల్లో ఆశలు చిగురించాయి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, అందోల్ పుల్కల్ మండల పార్టీ నాయకులతో, సంగారెడ్డి తన నివాసంలో సమావేశమై ప్రభుత్వం చేపడుతున్న,సంక్షేమ పథకాలను, ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్ని విషయాలపై చర్చించి, నియోజకవర్గం రైతులను దృష్టిలో పెట్టుకొని, ప్రాజెక్టు అధికారులతో చర్చించి, ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిలువ 521. 075, మీటర్ల నీరు ఉందని అధికారులు తెలపడంతో, ఇరిగేషన్ అధికారులతో చర్చించి, ఇదివరకు సింగూరు ఎడమ కాలువ మరమత్తుల పనుల కోసం, గడిచిన రెండు పంటలకు క్రాప్ హాలిడే ప్రకటించిన అధికారులు, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ,రైతుల పంట సాగు ఇబ్బందుల దృశ్య గురువారం ఉదయం 12 గంటలకు పంటల సాగుకు సింగూరు ఎడమ కాలువ ద్వారా 100, క్యూసెక్కుల జలాలను విడుదల చేశారు, దీంతో రైతన్నల ఆనందానికి






అంతులేదు, ఇప్పటికైనా మంత్రి దామోదర్ రాజనర్సింహ రైతుల బాధను అర్థం చేసుకొని ఈ ఖరీఫ్ పంటకు సాగుకు సింగూరు జలలు విడుదల చేసినందుకు రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో పుల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు పోచారం లక్ష్మారెడ్డి, గొ%శీ%గులూరు రామచంద్రారెడ్డి యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంజయ్య, జోగిపేట మాజీ కౌన్సిలర్ సురేందర్ గౌడ్, తదితర నాయకులు రైతులు, అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు

### ఇంటర్ విద్యార్థిని వైష్ణవి హత్య కేసులో ట్విస్ట్

కడప జిల్లా జమ్మలమడుగు మండలం గండికోటలో ఇంటర్ విద్యార్థిని వైష్ణవి హత్య కేసులో ట్విస్ట్ చోటు చేసుకుంది. పోలీసుల దర్యాప్తులో కీలక ఆధారాలు సేకరించారు. వైష్ణవి హత్యలో ప్రియుడు లోకేశ్ పాత్ర లేదని డీఐజీ ప్రవీణ్ తెలిపారు. విద్యార్థినిపై ఎలాంటి లైంగిక దాడి జరగలేదన్నారు. కాగా, ఎర్రగుంట్ల మండలానికి చెందిన వైష్ణవి సోమవారం కాలేజీకి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా.. గండికోటలో విద్యార్థిని మృతదేహం లభించింది.



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:**గురువారంనాడు గోషామహల్ నియోజకవర్గంలో బోనాల సందర్భంగా గోషామహల్ భైరవి మాతా మందిరంలో దర్శణం చేసుకున్న జాతీయ కాంగ్రెస్ ఓబీసీ కోఆర్డినేటర్ నిర్మల్ కుమార్ యాదవ్ అర్జున్ యాదవ్ రమేష్ లాల్ రాకేష్ భగత్ తదితరులు

## ఆరోగ్యశ్రీ పథకంతో అనాథ పిల్లలకు రక్షణ

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 17** :అనాథ పిల్లల రక్షణ,ఆరోగ్య సంరక్షణ కొరకు ఆరోగ్య పథకం వర్తింపజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ జిల్లా మహిళ,శిశు , వయోవృద్ధులు, దివ్యాంగులు,ట్రాన్స్‌జెండర్ల సంక్షేమశాఖ అధికారి రౌఫ్గాన్,బాలల సంరక్షణ సమితి అధికారి ఆనంద్ లతో కలిసి అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులను అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని బాలల పరిరక్షణ సమితి పరిధిలోని బాలల సంరక్షణ కేంద్రాలలో ఆశ్రయం పొందుతూ సంరక్షణ,రక్షణ అవసరం ఉన్న అనాథ పిల్లలందరికీ ఆరోగ్య సేవలు ఉచితంగా అందాలనే ఉద్దేశ్యంతో ఆరోగ్యశ్రీ కార్డులు అందించడం జరిగిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సి.ఈ.ఓ., వైద్యశాఖ సహకారంతో జిల్లా బాలల పరిరక్షణ విభాగం,జిల్లా సంక్షేమశాఖ సమన్వయంతో జిల్లాలోని 6 సంరక్షణ కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న 85 మంది అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులను అందించామని తెలిపారు. ఈ కార్డు ద్వారా బాలలు రాష్ట్రంలో ఎక్కడైనా 10 లక్షల రూపాయల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ రాధిక,సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు మంచి చేయాలంటే పదవులే కాదు మంచి మనసు కూడా ఉండాలి

## తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, గడ్డం ప్రసాద్ కుమార్








వికారాబాద్ ప్రజాబలం ప్రతినిధి:జూలై 17: పేదలకు మంచి చేయాలంటే పదవులే కాదు మంచి మనసు కూడా ఉండాలని మీరందరూ ఈ విషయాన్ని గమనించాలని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు.

వికారాబాద్ జిల్లా సమీకృత కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబురాలు మరియు నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో శాసనసభ సభాపతి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

ఈసందర్భంగా వికారాబాద్ నియోజకవర్గంలోని మహిళా స్వయం సహాయక బృందాలకు మంజూరైన 9 కోట్ల 12 లక్షల రూపాయల వడ్డీ మాఫీ మొత్తాన్ని స్పీకర్ అందజేశారు.

ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ.... సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా, రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఎర్పడినప్పటి నుండి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పీకర్ తెలిపారు.

ఇందిరా మహిళా శక్తి సంబురాలలో సందర్భంగా పాల్గొన్న మహిళలకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

భారతీయ సంస్కృతి, సాంప్రదాయంలో మహిళలకు అత్యున్నత స్థానం ఉందని, మనం మహిళలను అత్యంత గౌరవించాలన్నారు.

అదేవిధంగా ప్రతి ఇంటికి ఇల్లాలే వెలుగనీ తెలిపారు.

ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు.

మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, పేదలకు 200 యూనిట్ల వరకు కరంటు ఉచితంగా అందుతున్నాయన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరు మీదనే మంజూరు చేస్తున్నామని,

ఇవే కాకుండా మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలనే మంచి ఆశయంతో ప్రజా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని ఆయన తెలిపారు.

మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు ఇప్పించడం, పెట్రోల్ పంపుల నిర్వాహణ, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్లుల ఏర్పాటు వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు ప్రభుత్వం చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇందిరా శక్తి క్యాంటీన్, పాఠశాలలకు ఏకరూప దుస్తులు కుట్టడం వంటి ఆర్థిక లబ్ది కలిగించే పథకాలను కూడా అమలు చేస్తున్నామన్నారు.

కోటీ మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని ఉద్దేశంతో సంవత్సరానికి 20 వేల కోట్ల రూపాయలు మహిళలకు వడ్డీ లేకుండా అందిస్తున్నట్లు ఆయనతెలిపారు.

మహిళా సంఘాలకు అందే రుణాలతో చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించాలని, మన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మహిళా సంఘాలు డ్రోన్ వ్యాపారం కూడా చేస్తున్నారని, మహిళలు వివిధ రకాలైన వ్యాపారాలు చేసేందుకు ధైర్యంగా ముందుకు రావాలని ఆయన తెలిపారు. మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదిగి పది మందికి ఉపాధి కల్పించాలని సూచించారు.

మహిళల ఆశీర్వాదం ఉంటే ప్రభుత్వం చల్లగా ఉంటుందని, అందుకే ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ మహిళల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

రుణ భీమా, ప్రమాద భీమా వంటి పథకాలను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆలోచించ లేదని, గత పాలకుల హయాంలో నిర్లక్ష్యం చేసిన వడ్డి లేని రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్ధరించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.

మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల రూపాయల భీమా అందుతుందని, అదే మహిళ సభ్యులు సాధారణంగా మరణిస్తే 2 లక్షల రూపాయల వరకు ఉన్న లోన్ బీమా అమలు అవుతుందని ఆయన అన్నారు.

మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీలో భాగంగా వికారాబాద్ జిల్లాలో మొత్తం 32.70 కోట్లు రుణమాఫీ జరిగిందని ఆయన అన్నారు.

ఇందులో భాగంగా మన వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన రెండు వేల 987 సంఘాల లోని 30 వేల మంది మహిళా సభ్యులకు 9 కోట్ల 12 లక్షల రూపాయల మిత్తీ రుణమాఫీ జరిగిందని తెలిపారు.

తెలంగాణ ప్రాంతంలో కుటుంబానికి భూమి ఉంటే ఎంత ఆత్మ గౌరవమో అదేవిధంగా రేషన్ కార్డు ఉంటే కూడా ఆ కుటుంబానికి అంతే ఆత్మగౌరవం అని ఆయన అన్నారు.

తెల్ల రేషన్ కార్డులు తీసుకునే వారు పేదలు. రేషన్ కార్డుతో చౌకగా బియ్యం అందితే కుటుంబంతో కడుపు నిండా అన్నం తింటారని, కానీ గత ప్రభుత్వం పదేళ్ళ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఆయన అన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచి మనసుతో అర్హులైన వారందరికి రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారని,అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు వస్తాయని, కడుపు నిండా తృప్తిగా అన్నం తినాలని సన్న బియ్యాన్ని ఇస్తున్నాం అని ఆయన అన్నారు.

గత ప్రభుత్వ ఎనిమిది లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్ర ప్రజల నెత్తిమీద భారం వేసిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఒక గాడిలో పెడుతున్నట్లు ఆయన తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగుంటే మీకు ఇస్తామన్న నెలకు 2,500 రూపాయలు ఇచ్చేవాళ్ళం, పెళ్ళిలో తులం బంగారం కూడా వచ్చేది. మీరు అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. త్వరలోనే మహిళలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా సభాపతికి పెద్ద ఎత్తున మహిళలు బోనాలు, వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సంఘాలకు చెక్కులను, అర్హులైన పేదలకు స్పీకర్ చేతుల మీదుగా రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, ఎం.సుధీర్, హెల్ప్ డైరెక్టర్ జాన్సన్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టీవో సభ్యులు జాఫర్, జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జానకి తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటకులకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా అనంతగిరి గుట్ట ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులకు సూచించారు.



వికారాబాద్ ప్రజాబలం ప్రతినిధి:జూలై 17: గురువారం వికారాబాద్ జిల్లాలో సభాపతి పర్యటనలో భాగంగా అనంతగిరిగుట్ట పైన అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పర్యావరణ పట్టణ పార్క్ అభివృద్ధి పనులకు, పట్టణ కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్ లో క్రీడా ప్రాంగణం పునః నిర్మాణం, బ్యాట్మెంటన్ కోర్టు ఏర్పాటు నిర్మాణ పనులకు శంకుస్థాపనలతో పాటు వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అనంతగిరి అటవీ ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమంలో సభాపతి గడ్డ ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభాపతి అధికారులనుద్దేశించి మాట్లాడుతూ... అనంతగిరి అటవీ ప్రాంతంలో పర్యాటకులకు మంచి అనుభూతి, సంతృప్తిని కలిగించే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. సుదీర్ఘ కాలంగా అవసరానికి వచ్చే నిర్మాణాలతో పాటు సదుపాయాలను నాణ్యతతో పకడ్బందిగా పట్టాలని ఆయన అధికారులకు సూచించారు. వన మహోత్సవంలో భాగంగా ఆకుపచ్చ తెలంగాణ దిశగా పెద్ద మొత్తంలో మొక్కలు నాటేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. కోటి రూపాయల వ్యయం తో చేపట్టే వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్ పునఃనిర్మాణ, బ్యాట్మెంటన్ కోర్టు పనులను నాణ్యత లోపము లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారిని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా అనంతగిరి అటవీ ప్రాంతంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అధికా రులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక వర్గీస్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్, డిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఆర్డీవో వాసు చంద్రలతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గాపి.చంద్రయ్య బాధ్యతల స్వీకరణ





ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ 17 : మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పి.చంద్రయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. పి.చంద్రయ్య గతంలో వికారాబాద్ జిల్లా రెవెన్యూ అధికారిగా పని చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)ను జిల్లా పౌరసంబంధాల అధికారి యం.కృష్ణమూర్తి మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## వన మహోత్సవం లక్ష్యాలను పూర్తిగా సాధించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 17 : భావి తరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం-2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంతో పాటు అర్కెపెల్లి గ్రామంలోని మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్,మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ లతో కలిసి 2వేల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని,జిల్లాకు కేటాయించిన వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణలలో, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటాలని తెలిపారు. పాఠశాలలోని తరగతి గదులు,వంటశాల, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యమైన విద్యాబోధన అందించాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతం పెంపొందించడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలో నిర్మితమవుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మూత్రశాలల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, భోజనం నాణ్యతను పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం మెనూ, విద్యాబోధన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల,వసతి గృహాలను సందర్శించి భోజనశాల, 8వ తరగతి గదులను సందర్శించి మరమ్మత్తులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని, బడి బయట ఉన్న పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించి పిల్లలు తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని,ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు,నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని,వంట చేసే వారు శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు.ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు.ప్రతి పాఠశాలలో త్రాగునీరు,విద్యుత్, మూత్రశాలలు,ప్రహారీగోడ, వంటశాల ఇతర అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.వర్షాకాలం కావడంతో పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మీకు దమ్ముంటే అసెంబ్లీ కి కేసీఆర్‌ను తీసుకురండి

## టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



నాంపల్లి (ప్రజాబలం ప్రతినిధి):హరీష్ రావు వాదనలలో పస లేదు..

ఢిల్లీలో నిన్న నీటి పారుదల అంశాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎం లు, నీటి పారుదల శాఖ మంత్రులు, అధికారుల సమావేశంలో ఏ అంశాలపై ఏమీ మాట్లాడారో స్వయంగా కేంద్ర మంత్రి సి.ఆర్ పాటిల్ చెప్పిన కూడా హరీష్ రావు పిచ్చి వాగుడు వాగుతూ తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడు.

మీటింగ్ లో ఏఏ అంశాలు, ఏమి మాట్లాడారో స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి చెప్పినా కూడా హరీష్ రావు మెదడు కు ఎక్కనట్టు ఉంది.

హరీష్ రావు ఆరు అడుగులు పెరిగాడే తప్ప ఆర అంగుళం మెదడు పెంచుకోలేదు.. అర్థగోలు వాదన అర్థం లేని తర్కంతో పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నాడు.

సీఎం మాట్లాడగానే ఏదో ఒకటి మాట్లాడి తన ఉనికిని చాటు కోవాలన్న తపన తప్ప రాష్ట్ర ప్రయోజనాలు లేవు.

సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదా లో మాజీ సీఎం, బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ కు సవాల్ విసిరారు..

అసెంబ్లీ వచ్చి చర్చల్లో పాల్గొనండి లేదా మేమే ఫామ్ హౌస్ కు వచ్చి అక్కడ మాక్ అసెంబ్లీ పెడుతాము మీరు పాల్గొనండి అని సవాల్ చేస్తే అక్కడ నుంచి నోరు లేవలేదు..

మీరు మళ్ళీ సిగ్గులేకుండా సవాళ్ల గురించి మాట్లాడుతున్నారు.

గోదావరి లో 3 వేల టి ఎంసీ ల నీటి వరద ఉంది.. ఆంధ్ర ప్రాజెక్టు లు కట్టుకున్నా మనకు సమస్య లేదు..

రాయల సీమ ను రతనాల సీమ చేస్తాను.. బేసిన్లు లేవు, భేషజాలు లేవు అని కేసీఆర్ అంటేనే కదా ఈ రోజు వాళ్ళు బనకచర్ల, రాయలసీమ ఎత్తిపోతల పథకాలు కడుతున్నది .

తెలంగాణ కు అడ్డగోలుగా ద్రోహం చేసినా మీరే మళ్ళీ సిగ్గులేకుండా కాంగ్రెస్ మీద, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీద ఆరోపణలు చేస్తున్నారు.

మీకు దమ్ముంటే అసెంబ్లీ లో పెట్టె చర్చలకు నువ్వు, మీ మామ కేసీఆర్ లు వచ్చి మీ వాదన చెప్పండి.. అప్పుడు ఎవరు ఏంటో తెలుస్తాది..

ప్రెస్ మీట్ లు పెట్టి కోడిగుడ్డు మీద ఈకలు పీకుదామని చూస్తే జనం నమ్మరు..

## చేనేతకారులకు మరింత చేయూతనివ్వాలి : రమ్య రావు

### కళింగ కల్చరల్ హాలులో జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన షురూ



ప్రజాబలం, హైదరాబాద్, జూలై 2025 : బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని కళింగ కల్చరల్ హాలులో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రచార జాయింట్ కన్వీనర్ రమ్యరావు బుధవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడి హాలు లో కొలువుదీరిన చేనేత కారుల వస్త్రోత్పత్తులను ఆమె తిలకిస్తూ, చేనేత కారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలవడిగా తిరిగారు.

భారతీయ సంస్కృతి లో పట్టు , హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని రమ్య రావు అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెల 21 తేది వరకు కొనసాగుతున్న ప్రదర్శన లో దేశం లోని 14 రాష్ట్రాల నుండి చేనేత కారులు , చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు

# పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది

**ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అనే ఉద్దేశంతోనే సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది**

**ఆత్మకూరు&దామెర మండలాలకు చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**





ఆత్మకూరు మండలం పరకాల నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాబలం) జూలై 17: గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జివిఆర్ గార్డెన్లో ఆత్మకూరు%దామెర మండలాల పరిధిలోని గ్రామాలలో పేద ప్రజలకు నూతన రేషన్ కార్డులను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. అంతకుముందు రేషన్ డీలర్లు ఎమ్మెల్యే గారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ… ఆత్మకూరు మండలానికి చెందిన 428 మంది లబ్ధిదారులకు, అలాగే దామెర మండలానికి చెందిన 518 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.గత 18 నెలలుగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజల సంక్షేమానికి నా మొదటి ప్రాధాన్యత అని, కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు.గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల కోసం పదేళ్లపాటు నిరీక్షణ చేశారని, రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరమయ్యాయి అని అన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు.పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి పథకాలను మంజూరు చేస్తున్నామని అన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అనే ఉద్దేశంతోనే సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగుతుందన్నారులి.

# మణికొండ మునిసిపల్ మాజీ పాలకవర్గం, అధికారుల చిత్ర విచిత్రాలు



రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 17 జూలై 2025ఖాళీ స్థలాల కబ్జాలను ఖాతరు చేయని అధికారులుమణికొండ పురపాలక సంఘ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీ 2004లో హైదరాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వారు ప్రజల అవసరార్థం కొన్ని ఖాళీ ప్రదేశాలను మార్కింగ్ చేస్తూ తుది లే ఔట్ మంజూరి పత్రాన్ని విడుదల చేసిన తర్వాత ఆ ఖాళీ ప్రదేశాలను అప్పటి గ్రామ పంచాయతీకి దాఖలు చేయడం తర్వాత ఇట్టి ఖాళీ ప్రదేశాలను కలుపుకుని మరొక లే ఔట్ పుట్టుకు రావడం, ఇందులో ప్రధానంగా తిరుమల హిల్స్ కాలనీ రోడ్డులలో ఉన్న ఖాళీ స్థలాలు ప్రజా ఉప యోగాలకు అనువుగా ఉండగా, ఆ యొక్క ఖాళీ ప్రదేశాలను కొంతమంది స్థానిక నాయకుల అండతో క్రయ విక్రయాలు చేసుకొని తమ ఆధీనంలోకి తీసుకువడం జరిగినది. అందులో భాగంగానే 6054 గజాల స్థలం కూడా ఉండడం దురదృష్టం కాగా ఇందు కోసం స్థానిక కాలనీ వాసులు మరియు కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య గడచిన కొన్ని సంవత్సరాలుగా తీవ్ర పోరాటం చేస్తూనే ఉన్నారు. అందుకు గత పురపాలక సంఘ పాలకవర్గం ఐదు సంవత్సరాల కాల పరిమితిలో ఒక్క నాడు కూడా కాలనీ వాసులకు అండగా స్పందించకుండా, కౌన్సిల్ లో చర్చకు పెట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం జగ మెరిగిన సత్యం కాగా అదే స్థానిక కాలనీ వాసులు మరియు కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య ఈ మధ్య హైడ్రా కమిషనర్ను కలసిన దరిమిలా వారి తోడ్పాటుతో ఈ 6054 గజాలలో దరిదాపు 5000 గజాల స్థలానికి ఫెన్సింగ్ వేయడం, మణికొండ పురపాలక సంఘం ఆధీనంలో తీసుకోవడం జరిగింది, మిగిలిన ఖాళీ స్థలం కాపాడవలసిన బాధ్యత పురపాలక సంఘ పరిధిలోకే వస్తుంది కావున మణికొండ పురపాలక సంఘం అధికారులు తక్షణమే స్పందించి మిగిలిన స్థలానికి కూడా ఫెన్సింగ్ వేయడానికి పూను కోవలసిందిగా కోరడమైనది. అదురు బెదురు లేకుండా పార్కు స్థలాన్ని నిలబెట్టు కోవడంలో స్థానికులు చేసిన కృషి అభినందనీయమని, ఇది ప్రజా విజయంగా వేనోళ్ల కొనియాడుతూ, ఇటువంటి కార్యక్రమాలలో మణికొండ మునిసిపాలిటీ పరిధిలో స్థానికులతో పాటు మా వంతు కృషి, సహాయ సహకారాలు ఎల్ల వేళల అందిస్తామని బి.ఆర్.ఎస్ పార్టీ తరఫున తెలియ చేస్తున్నాము. ప్రస్తుత తరుణంలో హైడ్రా సహకారంతో దాదాపు 5000 గజాల స్థలాన్ని ఆధీనంలో తీసుకున్న దరిమిలా మాజీ పాలకవర్గ సభ్యులు అందుకు భిన్నంగా అట్టి స్థలాన్ని 6054 గా చిత్రీకరిస్తూ తాము కాపాడిన నిర్వాహకముగా ధాంబికాలు పలుకుతూ ముందుకు వచ్చి పార్క్ ను తాము అభివృద్ధి చేస్తామని చిలక పలుకులు పలకడం విడ్డూరంగా ఉంది, ఏది ఏమైనప్పటికీ ఇప్పటికైనా మించిపోయింది లేదని మణికొండ పురపాలక సంఘం అధికారులు తక్షణమే ఈ కాళీ ప్రదేశంలో ప్రజా సంక్షేమ పనులను మొదలు పెట్టాలని డిమాండ్ చేస్తూ, సంబంధిత అభివృద్ధి కార్యక్రమాలలో స్థానికులతో పాటు మేము సైతం చురుకుగా పాల్గొంటామని, మణికొండ మునిసిపాలిటీ పరిధిలో ప్రజల మద్దతుతో ఇట్టి కార్యక్రమాలకు ఎల్ల వేళల మా మద్దతు కొనసాగిస్తామని మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు తెలియ పరిచారు. తిరుమల హిల్స్ కాలనీ కొండ ప్రాంతంగా ప్రసిద్ధి చెందిందని, స్థానిక ప్రజలు త్రాగు నీటి వసతులు సరిగా లేనందువలన నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అందుకు గాను నీటి సామర్థ్యం గల రిజర్వాయర్ కట్టడం స్థానికులకు ఎంతో మేలు జరుగు తుందని, ప్రజల బాగోగులను దృష్టిలో పెట్టుకొని తత్వర రిజర్వాయర్ కట్టడం అన్ని విధాలు మెలుగా తలచి గతంలో రిజర్వాయర్ కట్టడానికి సంబంధించి స్థల పరిశీలన కావించి పనులు కూడా మొదలు పెట్టడం జగమెరిగిన సత్యం కాగా, అనివార్య కారణాల వలన అట్టి పనులను ఆపిన దరిమిలా ప్రస్తుత తరుణంలో ప్రజా ప్రయోజనార్థం సంకల్ప బలంతో ఎత్తైన ప్రాంతంలో చిన్నపాటి నీటి నిలువ రిజర్వాయర్ కట్టాలని, అది రాబోయే తరాలకు ఉపయోగకరంగా ఉంటుందని అట్టి దిశగా జలమండలి అధికారులు పనులు మొదలు పెట్టి ముందుకు సాగాలని స్థానిక భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకుల తరఫున విన్నవించుకొంటూ సీతారాం ధూళిపాళ, గుట్టమీద నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, లక్ష్మణ్ రావు అండే, రూపా రెడ్డి, మహేశ్వరం సునీత, రాజేంద్ర ప్రసాద్, మాల్యాద్రి నాయుడు, సంగం శ్రీకాంత్, కిరణ్ యాలాల, బుదోలు బాబు, బొడ్డు శ్రీధర్, షేక్ ఆరిఫ్, సుమనలిని, గోరుకంటి విఠల్, భాను చందర్, బాబు రావు, ఆరిఫ్ మహమ్మద్, సుమన్, బిట్టుగా రాజు, చెరుకూరి బాలాజీ, రమణ మూర్తి, బిందు, తిరుపతి, ఆదిత్య, శేఖర్, మహేష్ తది తరులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.








గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:శ్రీ దుర్గా మాత దేవాలయం చందన్ వాడిలో గోషామహల్ బోనాలు పండుగ ఘనంగా జరిగింది గుడి పూజారి పాండు ముదిరాజ్ మరియు సాంబశివరాజ్ ఘనంగా అమ్మవారిని పూజలు సమర్పించారు మహంకాళి అమ్మవారికి ప్రజలు పూజలు చేశారు అష్ట ఐశ్వర్యాలు ,ఆరోగ్యంగా ఉండాలని వర్షాలు మంచిగా పడాలని అన్నదాత రైతులకి కలిసి రావాలని కోరుకుంటున్న టీడీపీ స్టేట్ ప్రధాన కార్యదర్శి నాయకుడు రామ్ నారాయణ యాదవ్, కేడీ దినేష్ మరియు సోమశేఖర్ కురుమ శివరాజ్, సురేందర్ సింగ్, సింహాద్రి, తదితరులు టిడిపి నాయకులు పాల్గొన్నారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com